ఇక 9 క్యారెట్ల గోల్డ్!



- గొలుసు దొంగతనాలు పెరుగుతున్న క్రమంలో త్వరలో తీసుకొచ్చే యోచనలో కేంద్రప్రభుత్వం
- తులం ధర 25 వేల నుంచి రూ. 30 వేలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): 24-క్యారెట్ల మేలిమి బంగారం గురించి అందరికీ తెలిసిందే. ఆభరణాల తయారీలో 22-క్యారెట్లు, 18-క్యారెట్ల బంగారాన్ని వినియోగిస్తారన్న సంగతి కూడా విదితమే. అయితే, కేంద్రం త్వరలో 9-క్యారెట్ల బంగారాన్ని తీసుకొచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు బంగారు నగల వ్యాపారులతో కేంద్రప్రభుత్వం ప్రతినిధులు మంగళవారం భేటీ అయినట్టు జాతీయ పత్రిక 'మింట్' ఓ కథనంలో వెల్లడించింది.

ఎందుకు తీసుకొస్తున్నారు?

24-క్యారెట్ల తులం బంగారం రూ.73 వేలకు పైబడి పలుకుతున్నది. 22-క్యారెట్ల తులం బంగారం ధర కూడా రూ.68 వేల పైమాటే. దీంతో దొంగలు తమ చేతివాటం చూపుతున్నారు. ఎన్సీఆర్బీ గణాంకాల ప్రకారం.. 2021తో పోలిస్తే, 2022లో దేశంలో గొలుసు దొంగతనాలు 32.54 శాతం మేర పెరిగాయి. దీంతో చవక బంగారంపై వినియోగదారులు ఆసక్తి కనబరుస్తున్నట్టు వ్యాపారులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్రం 9-క్యారెట్ల బంగారాన్ని తీసుకొచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం.

ధర ఎంత ఉండొచ్చు?

9-క్యారెట్ల తులం బంగారం ధర రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 24-క్యారెట్లు, 22-క్యారెట్ల బంగారం నాణ్యతను ధ్రువీకరించేందుకు ఉద్దేశించిన హాల్‌మార్క్, బీఎస్ఐ ముద్రలు ఈ బంగారంపై కూడా ఉంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్ 35 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకోగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 45.5 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకొన్నది. స్విట్జర్లాండ్, యూఏఈ, పెరూ, ఘనా దేశాల నుంచి భారత్ ఎక్కువగా బంగారాన్ని దిగుమతి చేసుకొంటున్నది.

లెస్బియనిజం.. లైంగిక నేరం

కరికులమ్‌లో తిరిగి చేర్చిన ఎన్ఎంసీ

న్యూఢిల్లీ : సొడోమీ, లెస్బియనిజం అసహజ లైంగిక నేరమని చెప్తున్న పాఠ్యాంశాన్ని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) పునరుద్ధరించింది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ స్టూడెంట్స్ కోసం ఫోరెన్సిక్ మెడిసిన్, టాక్సికాలజీ కరికులమ్‌లో దీనిని మళ్లీ చేర్చింది. కన్నె పొర, దాని రకాలు; దాని వైద్యపరమైన, చట్టపరమైన ప్రాధాన్యం, కన్యత్వం, కన్నె పొర ఛేదన, లెజిటిమసీ, దాని మెడికో-లీగల్ ఇంపార్టెన్స్ అంశాలను కూడా తిరిగి చేర్చింది. వీటిని మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు 2022లో పాఠ్య ప్రణాళిక నుంచి తొలగించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం..

నలుగురు భారతీయులు మృతి

- మృతుల్లో ముగ్గురు హైదరాబాదీలు
- డల్లాస్‌లో కారును ఢీకొన్న ట్రక్కు



దర్శిని వాసుదేవ్ , ఆర్యన్ రఘు, ఫరూఖ్ షేక్, లోకేశ్ పలచర్ల

హ్యూస్టన్/హైదరాబాద్, సెప్టెంబర్ 4: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన నలుగురిని భారతీయులుగా పోలీసులు గుర్తించారు. డల్లాస్ సమీపంలో ఓ హైవేపై ఆగి ఉన్న ఎస్‌యూవీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా మంటల్లో దగ్ధమైపోయింది. ఘటన జరిగినప్పుడు కారులో ఉన్న నలుగురు మరణించారు. వీరి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. దీంతో డీఎన్ఏ, ఇతర ఆధారాల ద్వారా నాలుగు రోజులకు పోలీసులు మృతులను గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్యన్ రఘునాథ్ ఒరంపట్టి, ఫరూఖ్ షేక్, లోకేశ్ పలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవ్ ఈ ప్రమాదంలో మరణించినట్టు కొల్లిన్ కౌంటీ షెరిఫ్ కార్యాలయం ధ్రువీకరించింది. ఆర్యన్, ఫరూఖ్ ఇటీవలే టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసుకున్నారు. లోకేశ్ చదువు పూర్తి చేసుకొని ఉద్యోగం చేస్తున్నాడు. కార్‌పూలింగ్ యాప్ ద్వారా వీరు ప్రమాదం జరిగిన కారు ఎక్కినట్టు తెలుస్తున్నది.

కేటీఆర్ సంతాపం

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణ యువకులు, తమిళనాడుకు చెందిన యువతి మరణించడంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆర్యన్ రఘునాథ్, ఫరూక్ షేక్, లోకేశ్ పాలచర్ల, దర్శిని వాసుదేవన్ (తమిళనాడు) మరణవార్త తనను ఎంతగానో బాధించిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జాతీయ భావాలపై జాగ్రత్తగా ఉంటాం: నెట్‌ఫ్లిక్స్

న్యూఢిల్లీ: జాతీయ భావాలు దెబ్బతినకుండా ఇకపై తమ కంటెంట్ విషయంలో జాగ్రత్తగా ఉంటామని ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ హామీ ఇచ్చింది. ఖాందహార్ విమాన హైజాక్ ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన 'ఐసీ-814: ద ఖాందహార్ హైజాక్' సిరీస్‌లో ఇద్దరు హైజాకర్లు భోళా, శంకర్‌ల పేర్లపై వివాదం రావడంతో నెట్‌ఫ్లిక్స్ వివరణ ఇచ్చింది. ఇద్దరు ముస్లిం హైజాకర్ల పేర్ల స్థానంలో హిందువుల పేర్లు పెట్టడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సిరీస్‌లో హైజాకర్ల అసలు పేర్లను జోడించారు.

మీ ఫోన్లకూ చెవులుంటాయ్!

- మీరు మాట్లాడే మాటలు వింటుంటాయి
- కంపెనీలకు మీ అవసరాలు చేరవేస్తాయి
- 'యాక్టివ్ లిజెనింగ్'తో లక్షిత ప్రకటనలు
- అంగీకరించిన అమెరికాకు చెందిన సంస్థ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: 'మెల్లగా మాట్లాడండి.. గోడలకు చెవులుంటాయి' అనే మాటలు ఇప్పటివరకు విన్నాం. ఇక నుంచి 'ఫోన్లకూ చెవులుంటాయి' అని వినే కాలం వచ్చింది. మీ ఫోన్ల ద్వారా మీకు తెలియకుండానే మీ మాటలను కొన్ని కంపెనీలు వింటాయి. మీ అవసరాలను గుర్తిస్తాయి. మీరు ఏం కొనాలనుకుంటున్నారో పసిగడతాయి. మిమ్మల్ని లక్ష్యంగా చేసుకొని ప్రకటనలు గుప్పిస్తాయి. ఇదంతా సాధ్యమే అంటూ ఇంతకాలంగా టెక్ నిపుణులు చెప్తున్నప్పటికీ సరైన ఆధారాలు లేవు. తాజాగా అమెరికాకు చెందిన కాక్స్ మీడియా గ్రూప్(సీఎంజీ) అనే ఓ కంపెనీ తన నివేదికలో ఈ విషయాలను ధ్రువపరిచింది. తమ వద్ద ప్రజల మాటలను వినే 'యాక్టివ్ లిజెనింగ్' సాంకేతికత ఉన్నట్టు ఈ సంస్థ అంగీకరించింది.

ఏం మాట్లాడుకుంటే.. అవే ప్రకటనలు

మనం గూగుల్‌లో ఏదైనా వస్తువు గురించి సెర్చ్ చేసిన తర్వాత మనం ఏ వెబ్‌సైట్ బ్రౌజ్ చేసినా, ఏ యాప్ వినియోగించినా ఆ వస్తువుకు సంబంధించిన ప్రకటనలే కనిపిస్తూ ఉంటాయి. ఆయా కంపెనీలు మన బ్రౌజింగ్ యాక్టివిటీని ట్రాక్ చేసి ఈ రకంగా లక్షిత ప్రకటనలు గుప్పిస్తుంటాయి. ఈ వ్యవహారం ఇప్పుడు మరింత ముదిరిపోయింది. కొన్నిసార్లు మనం ఏ వస్తువు గురించైనా పక్కవారితో మాట్లాడిన తర్వాత మన ఫోన్‌లో ఆ వస్తువుకు సంబంధించిన ప్రకటనలు కనిపిస్తుంటాయి. ఇది మనల్ని ఆశ్చర్యపరిచినా.. యాదృచ్ఛికం కావొచ్చులే అనుకుంటాం. అయితే, ఇది యాదృచ్ఛికం కాదు.. అధునాతన సాంకేతికతతో టెక్ కంపెనీలు పన్నుతున్న పక్కా వ్యూహం. తాము స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టీవీ, వంటి 470 మార్గాల ద్వారా వాయిస్ డాటాను క్యాప్చర్ చేసి, విశ్లేషిస్తామని సీఎంజీ సంస్థ.. తన ఇన్వెస్టర్లకు సమర్పించిన ఒక నివేదికలో పేర్కొన్నట్టు '404 మీడియా' కథనం తెలిపింది.



ఏమిటీ యాక్టివ్ లిజెనింగ్ టెక్నాలజీ?

తాము అభివృద్ధి చేసిన 'యాక్టివ్ లిజెనింగ్' టెక్నాలజీ ద్వారా స్మార్ట్‌ఫోన్ సహా మైక్రోఫోన్స్ ఉండే స్మార్ట్ పరికరాల నుంచి సేకరించిన సమాచారాన్ని కృత్రిమ మేధ(ఏఐ)తో విశ్లేషించి.. వినియోగదారులు ఏం కొనాలనుకుంటున్నారు, వారి ప్రవర్తనను తెలుసుకుంటామని ఈ కంపెనీ చెప్పినట్టు '404 మీడియా' కథనం పేర్కొన్నది. అయితే, ఈ టెక్నాలజీ తమ వద్ద ఉన్నట్టు ఈ సంస్థ బయటపెట్టినప్పటికీ ఇప్పటికే చాలా కంపెనీలు దీనిని వినియోగిస్తుండవచ్చని టెక్ నిపుణులు అనుమానిస్తున్నారు. అందుకే, మనం మాట్లాడుకునే వస్తువులకు సంబంధించిన ప్రకటనలకు మనకు ఇంటర్నెట్‌లో కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఏదైనా యాప్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు మైక్రోఫోన్‌ను వినేందుకు అనుమతి ఇవ్వవద్దని, తద్వారా కొంతవరకు ఈ టెక్నాలజీ బారిన పడకుండా ఉండొచ్చని సూచిస్తున్నారు.

వెయ్యి పేజీల ఫిర్యాదు పత్రాలతో పొర్లుదండాలు

- కలెక్టరేట్ ముందు అర్ధనగ్న నిరసన
- ఏడేండ్లుగా తిరుగుతున్నా చర్యల్లేవ్
- మధ్యప్రదేశ్‌లో ఓ బాధితుడు ఆవేదన

భోపాల్, సెప్టెంబర్ 4: అవినీతి, అధికారుల అలసత్వంపై అనేక ఫిర్యాదులు చేసినా, తనకు న్యాయం జరగటం లేదంటూ మధ్యప్రదేశ్‌లో ఓ వ్యక్తి వినూత్న నిరసన చేపట్టాడు. వెయ్యి పేజీలతో ఫిర్యాదును రూపొందించిన అతడు, దాన్ని ఒంటికి చుట్టుకొని అర్ధనగ్నంగా మధ్యప్రదేశ్‌లోని నీమచ్ కలెక్టరేట్ ముందు నిరసనకు దిగాడు. కాకరాయి గ్రామానికి చెందిన ముకేష్ ప్రజాపత్ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై వినూత్న పద్ధతిలో తన నిరసన వ్యక్తం చేశాడు. 'ఏడేండ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నా.



చెప్పులు నెత్తిన పెట్టుకొని న్యాయం కోసం వేడుకుంటున్నా. నా గోడు సీఎం మోహన్ యాదవ్ వినాలి' అంటూ తన ఆవేదన వ్యక్తం చేశాడు.

ఉగ్రవాదుల చేతుల్లోకి నాటో ఆయుధాలు!

న్యూఢిల్లీ: నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) కోసం అమెరికా తయారు చేసిన ఆయుధాలు ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్ల చేతికి వెళ్తున్నాయి. ఇవి మన దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. తుపాకులు తదితర ఆయుధాలు పంజాబ్, జమ్ముకశ్మీర్‌లలో పట్టుబడుతున్నాయి. నాటో సంకీర్ణ దళాల వద్ద ఉండే ఈ ఆయుధాలు నల్ల బజారులోకి ఏ విధంగా ప్రవేశిస్తున్నాయి? అవి భారత్‌కు ఎలా చేరుతున్నాయి? అనే అంశాలు అంతు బట్టడం లేదు. అఫ్గానిస్థాన్ నుంచి 2021లో అమెరికా దళాలు వైదొలగిన తర్వాత పెద్ద ఎత్తున ఆయుధాలను వదిలిపెట్టాయి. ఇవి తాలిబన్ల వశమయ్యాయి. ఇజ్రాయెల్ వ్యతిరేక ఉగ్రవాదుల వద్ద కూడా ఎం4 అసాల్ట్ రైఫిల్స్ వంటివి ఉండటం ఆందోళన కలిగిస్తున్నది.

స్టెయిన్‌లెస్ స్టీల్ వాడుంటే

శివాజీ విగ్రహం కూలేది కాదు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో ఇటీవల కూలిపోయిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో నిర్మించి ఉంటే అది కూలేది కాదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో చేపట్టే నిర్మాణాల్లో తుప్పును నివారించే లోహాలను వాడాలని ఆయన సూచించారు. 35 అడుగుల శివాజీ విగ్రహం కూలడంతో అధికార బీజేపీపై రాజకీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తీర ప్రాంతాలకు సమీపంలో నిర్మించే వంతెనల నిర్మాణంలో స్టెయిన్‌లెస్ స్టీల్ వాడాలంటూ తాను గత మూడేండ్లుగా చెబుతున్నానని గడ్కరీ అన్నారు.

వరదలను అడ్డుకోనందుకు

30 మందికి ఉరిశిక్ష

ఉత్తరకొరియా అధినేత కిమ్ చర్య

ప్యాంగ్యాంగ్, సెప్టెంబర్ 4: ఉత్తరకొరియా నియంత కిమ్ మరో దారుణానికి పాల్పడ్డారు. దాదాపు 30 మంది అధికారులను ఉరి తీయించినట్టు సమాచారం. ఇటీవల వరదలు రావటంతో పాటు కొండ చరియలు విరిగి పడ్డాయి. దీంతో చాలా మంది మరణించారు. అనేక మంది నిరాశ్రయులయ్యారు. అయితే, ప్రాణ, ఆస్తినష్టాలు నివారించటంలో అధికారులు విఫలం అయ్యారని.. అందుకే వారినందరినీ ఉరి తీయాలని కిమ్ ఆదేశించినట్టు దక్షిణ కొరియా మీడియా పేర్కొన్నది. గత నెలలో ఆ అధికారులకు మరణ దండన విధించారని వెల్లడించింది.

నైజీరియాలో నరమేధం..

100 మంది మృతి

బోకో హరామ్ మిలిటెంట్ల ఘాతుకం

అబుజా, సెప్టెంబర్ 4: ఆఫ్రికా దేశం నైజీరియాలో బోకో హరామ్ మిలిటెంట్లు ఘాతుకానికి పాల్పడ్డారు. ఓ మార్కెట్‌లో చొరబడి ఇష్టానుసారంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో కనీసం 100మందికిపైగా గ్రామస్తులు మరణించారని రాష్ట్ర పోలీస్ అధికార ప్రతినిధి డంగస్ అబ్దుల్ కరీం బుధవారం మీడియాకు తెలిపారు. ఆదివారం యోబ్ రాష్ట్రంలో తార్‌మువా కౌన్సిల్ ఏరియాలో 50 మందికిపైగా తీవ్రవాదులు మోటార్ సైకిల్స్‌పై వచ్చి కాల్పులు జరిపారని, భవనాలకు నిప్పు పెట్టారని కరీం చెప్పారు. దేశంలో ఇస్లామిక్ చట్టాన్ని, షరియా పాలన తీసుకురావటమే లక్ష్యంగా బోకో హరామ్ నైజీరియాలో హింసకు పాల్పడుతున్నది.

నవీ ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణం ప్రారంభం

థాణే: నవీ ముంబైలోని ఉల్వేలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో జే శ్యామల రావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పారిశ్రామికవేత్త గౌతమ్ సింఘానియా పాల్గొన్నారు. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుని దేవాలయం నమూనాలో ఈ ఆలయాన్ని సైతం నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణానికి 2023 జూన్ 7న శంకుస్థాపన జరిగింది. ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో రేమండ్ గ్రూప్ నిర్మిస్తున్నది.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు పింఛన్ బంద్

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ పార్టీ వారి శాసనసభ సభ్యత్వాలపై అనర్హత వేటు వేసింది. మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో తమ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరినప్పుడు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని బలోపేతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ పేర్కొన్నది. అయితే, ఇదే కాంగ్రెస్ పార్టీ ఇతర రాష్ట్రాల్లో మాత్రం వేరే పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి చేర్చుకుంటున్నది. తెలంగాణనే ఉదాహరణగా తీసుకుంటే.. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల ఇండ్లకు స్వయంగా ముఖ్యమంత్రి వెళ్లి కాంగ్రెస్ కండువాలు కప్పుతున్నారు. ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఒకరైన దానం నాగేందర్‌ను కాంగ్రెస్ టికెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లోనూ బరిలో నిలిపారు. ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ఈ ధోరణి పట్ల రాజకీయ విశ్లేషకులు విమర్శలు గుప్పిస్తున్నారు.



ఫిరాయింపులపై కాంగ్రెస్ రాష్ట్రానికో నీతి: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీ తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ రాష్ట్రానికో నీతిని పాటిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణలో విపక్ష ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయించేలా ప్రలోభాలకు గురిచేస్తున్న ఆ పార్టీ.. హిమాచల్‌లో మాత్రం పార్టీ ఫిరాయించినవారికి పెన్షన్ కట్ చేస్తామని చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. ఫిరాయింపులపై కాంగ్రెస్ చేస్తున్న విన్యాసాలు ఇవి అని ఎక్స్‌లో మండిపడ్డారు.

వేతనాలు ఆలస్యంగా ఇస్తే వడ్డీ ఆదా!

నెలకు రూ.3 కోట్లు మిగల్చవచ్చు.. • హిమాచల్ సీఎం సుఖు ప్రకటన

షిమ్లా, సెప్టెంబర్ 4: ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఆలస్యంగా ఇవ్వడాన్ని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు సమర్థించుకున్నారు. వేతనాలు, పింఛన్లు ఆలస్యంగా ఇవ్వడం వల్ల ప్రతి నెల రూ.3 కోట్లు వడ్డీ ఆదా చేయవచ్చని ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. ఆర్థిక సంక్షోభం కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు సైతం ఇవ్వలేకపోతున్నదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దీనిపై సీఎం సుఖు బుధవారం స్పందిస్తూ.. ప్రతి నెల 6వ తేదీ కేంద్రం నుంచి రాష్ట్రానికి రెవెన్యూ లోటు నిధులు(ఆర్‌డీజీ), 10న కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు అందుతాయని తెలిపారు. ఈ నిధులు రాకముందే ఒకటో తేదీన వేతనాలు, పింఛన్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 7.5 శాతం వడ్డీకి అప్పు చేయాల్సి వస్తున్నదని తెలిపారు. దీంతో నెలకు రూ.3 కోట్లు, ఏడాదికి రూ.36 కోట్ల వడ్డీ భారం పడుతున్నట్టు చెప్పారు. కాగా, ఈ నెల మాత్రం వనరులను ఎలా సమర్థంగా వినియోగించాలో గుర్తించేందుకు వేతనాలు ఆలస్యం చేశామని, గురువారం వేతనాలు, 10న పింఛన్లు ఇస్తామని వెల్లడించారు. అయితే, గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీయించిందని బీజేపీ విమర్శిస్తున్నది.

గౌరవంగా రాజీనామా చేయండి

- కోర్టు తీర్పు ఇవ్వకముందే తప్పుకోండి
- తీర్పు ఇచ్చాక 100 శాతం రాజీనామానే!
- సిద్ధరామయ్యకు యెడియూరప్ప సూచన



శివమొగ్గ, సెప్టెంబర్ 4: ముడా కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గౌరవంగా పదవికి రాజీనామా చేయాలని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత యెడియూరప్ప సూచించారు. ఈ కుంభకోణంలో సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు. దీనిని ఆయన కోర్టులో సవాల్ చేశారు. అయితే, కోర్టు తీర్పు ఇవ్వకముందే పదవి నుంచి తప్పుకోవాలని యెడియూరప్ప సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 'కోర్టు తీర్పు ఇచ్చాక వంద శాతం సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వస్తుంది. తీర్పు రాకముందే గౌరవంగా రాజీనామా చేయమని సూచిస్తున్నా. ఆయన ప్రమేయం ఉన్న కుంభకోణాలన్నీ నిరూపితం అయినందున, ఇక తప్పించుకునే అవకాశం లేదు' అని పేర్కొన్నారు. సిద్ధరామయ్యపై విచారణ జరగకుండా సెప్టెంబర్ 9 వరకు మధ్యంతర స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే.

నిద్రపోతే రూ. 10 లక్షల స్టైపెండ్

వేక్‌ఫిట్ ప్రొఫెషనల్ స్లీప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: హాయిగా నిద్రపోతే జీతం ఇచ్చే జాబ్ ఉంటే ఎంత బాగుండు! అని అనుకుని ఉంటాం కదా. అలాంటి జాబ్ తాము ఆఫర్ చేస్తమంటున్నది వేక్‌ఫిట్ సంస్థ. ప్రముఖ మ్యాట్రెస్ సంస్థ అయిన వేక్‌ఫిట్.. రోజుకు 8 గంటలు నిద్రపోతే రూ.10 లక్షల వరకు స్టైపెండ్ ఇస్తామని చెప్తున్నది. పైగా, నిద్రించటానికి పరుపు కూడా తామే ఉచితంగా ఇస్తామని అంటున్నది. ఈ మేరకు ప్రొఫెషనల్ స్లీప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను తీసుకొచ్చింది. రెండు నెలల పాటు ఉండే ఈ ఇంటర్న్‌షిప్‌ను వర్క్ ఫ్రమ్ బెడ్ నుంచే చేయొచ్చు. ఈ ఉద్యోగానికి అర్హతలు ఏంటంటే.. రోజుకు 8-9 గంటల పాటు నిద్రపోవాలి. మధ్యాహ్నం సమయంలో 20 నిమిషాల పాటు చిన్న కునుకు తీయాలి. వీకెండ్స్‌లో వీలైతే ఎక్కువసేపు నిద్రపోవాలి. స్లీప్ మెంటార్స్ నిర్వహించే వర్క్‌షాపులకు హాజరవ్వాలి. నిద్రలో 22 సంవత్సరాల అనుభవం ఉంటే చాలు. సెలెక్ట్ అయ్యే ఇంటర్న్‌కు రూ.1 లక్ష, స్లీప్ చాంపియన్‌గా ప్రమోట్ అయ్యేవారికి ఏడాదికి రూ.10 లక్షలు ఇస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు వేక్‌ఫిట్ లింక్‌డ్ఇన్ పేజీ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో

భారత్ టాప్

ఏటా 10.2 మిలియన్ టన్నులు ఉత్పత్తి

న్యూఢిల్లీ: ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉంది. ప్రతి ఏడాది 10.2 మిలియన్ టన్నుల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తున్నది. ఇది తరువాతి పెద్ద కాలుష్య దేశాల కంటే రెండింతలు ఎక్కువని ఒక నివేదిక వెల్లడించింది. యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్‌కు చెందిన పరిశోధకులు తెలిపిన వివరాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 57 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యర్థాలు ఒక చోటని కాక సముద్ర గర్భం నుంచి కొండ శిఖరాల వరకు, ఆఖరికి మానవ శరీరంలో సైతం పెద్దయెత్తున పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాల్లో మూడింట రెండు వంతులు ప్రపంచంలోని దక్షిణ దేశాల నుంచే వస్తున్నట్టు ఈ నివేదిక వెల్లడించింది.

దర్శన్ కంటే నేనే బెటర్

బెంగళూరు, సెప్టెంబర్ 4: హత్య, కిడ్నాప్ ఆరోపణలతో అరెస్టయిన కన్నడ హీరో, నటుడు దర్శన్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తన ప్రియురాలు పవిత్రా గౌడ్‌ను సామాజిక మాధ్యమంలో వేధిస్తున్నాడన్న కోపంతో తన అభిమాని అయిన రేణుకాస్వామిని అనుచరులతో కలిసి హత్య చేసిన కేసులో దర్శన్, పవిత్రాగౌడ్, అనుచరులను పోలీసులు అరెస్ట్ చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. కాగా, హతుడు రేణుకాస్వామి మొబైల్ కన్పించకపోవడంతో డూప్లికేట్ సిమ్‌ను తీసుకున్న పోలీసులు అతని చాటింగ్‌ను వెలికి తీశారు. రేణుకాస్వామి పవిత్రను దూషిస్తూ అసభ్యకరమైన మెసేజ్‌లతో వేధించే వాడు. ఒకసారి తన జననాంగాల ఫొటోను ఆమెకు పంపి 'దర్శన్ కంటే నానే చాలా బెటర్' అంటూ మెసేజ్ పెట్టాడని పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

మీరేం రాజు కాదు!

- ఇది ఫ్యూడల్ వ్యవస్థ అంతకంటే కాదు
- సీఎం అయితే ఏం చేసినా చెల్లుతుందా?
- ఐఎఫ్ఎస్ అధికారి పోస్టింగ్ విషయంలో ఉత్తరాఖండ్ సీఎం ధామీకి సుప్రీం తలంటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఐఎఫ్ఎస్ అధికారి రాహుల్ పోస్టింగ్ విషయంలో ఏకపక్షంగా వ్యవహరించిన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ తీరును సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో ఆక్షేపించింది. సీఎం అయినంత మాత్రాన ఏదైనా చెల్లుబాటు అవుతుందని అనుకోవద్దని హెచ్చరించింది. సీఎం రాజేమీ కాదన్న న్యాయస్థానం.. మనం ఫ్యూడల్ వ్యవస్థలో ఉన్నామనుకోవద్దని గుర్తు చేసింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది..



ఏమిటీ కేసు?

రాహుల్ అనే ఐఎఫ్ఎస్ అధికారి కార్బెట్ టైగర్ రిజర్వ్‌కు హెడ్‌గా ఉండేవారు. అయితే, పులులు సంచరించే అడవిలో అక్రమ నిర్మాణాలు, చెట్ల నరికివేతకు అనుమతించారన్న ఆరోపణలతో రెండేండ్ల కిందట ఆయన్ని పదవీచ్యుతుణ్ని చేస్తూ ఉత్తరాఖండ్ హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఇప్పుడు అదే రాహుల్‌ను రాజాజీ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్‌గా ధామీ నియమించారు.దీంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది.

ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

- రాజా జైసే బోలా వైసే చలే (రాజు ఎలా చెప్తే అలా..) అనే ఫ్యూడల్ వ్యవస్థలో మనం ఇంకా ఉన్నామని అనుకొంటున్నారా? మీరు (సీఎం) రాజు కాదని గుర్తుంచుకోవాలి.
- కార్యనిర్వాహణ విభాగానికి హెడ్‌గా ఉన్న వాళ్లు తమకు తాము రాజుగా ఊహించుకొంటున్నారు. తాము ఏది చెప్తే అది జరుగుతుంది అనుకొంటున్నారు.
- రాహుల్ మంచి అధికారి అయితే, విచారణ ఎందుకు జరుగుతున్నట్టు?
- అతన్ని నియమించడానికి తగిన కారణాలను కూడా సీఎం వెల్లడించలేదు. ఇది ఎంతమాత్రం అంగీకారం కాదు.
- అతని నియామకంపై ఎంతో మంది అభ్యంతరం చెప్పినా నియమిస్తారా?

మణిపూర్‌లో డ్రోన్ దాడుల కలకలం

రంగంలోకి ఎన్ఎస్‌జీ

ఇంఫాల్, సెప్టెంబర్ 4: కల్లోలిత మణిపూర్ రాష్ట్రంలో కుకీ, మైతీ వర్గాల సంఘర్షణ ఇప్పుడు డ్రోన్ దాడులకు విస్తరించింది. రాష్ట్ర పోలీసులు ఈ సవాల్‌ను ఎదుర్కోవడానికి నేషనల్ సెక్యూరిటీ గార్డు (ఎన్ఎస్‌జీ)లను ఆశ్రయించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగారాజధాని ఇంఫాల్‌లో పౌరులు, భద్రతా దళాలు లక్ష్యంగా కొందరు డ్రోన్ల ద్వారా దాడికి పూనుకున్నారు. ఈ దాడితో మైతీ, కుకీ జాతుల మధ్య జరుగుతున్న ఘర్షణ కొత్త రూపాన్ని సంతరించుకుంది. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో గత కొన్ని రోజులుగా జరిగిన ఈ డ్రోన్ దాడులతో ఇద్దరు మరణించారు. ఈ డ్రోన్ల దాడిపై మణిపూర్ ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.

మొబైల్ వాడకానికి బ్రెయిన్ క్యాన్సర్‌కు సంబంధం లేదు

డబ్ల్యూహెచ్‌వో అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: మొబైల్ ఫోన్ వాడకానికి, బ్రెయిన్ క్యాన్సర్‌కు ఎలాంటి సంబంధమూ లేదని 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' (డబ్ల్యూహెచ్‌వో) తాజా అధ్యయనం వెల్లడించింది. 1994 నుంచి 2022 వరకు వెలువడిన 63 అధ్యయనాల్ని విశ్లేషించిన పరిశోధకుల బృందం పై విషయాన్ని తేల్చింది. మొబైల్ ఫోన్ నుంచి వెలువడే రేడియో తరంగాలకు, బ్రెయిన్ క్యాన్సర్‌కు సంబంధం లేదని నిర్ధారించారు. గత రెండు దశాబ్దాల్లో వైర్‌లెస్ టెక్నాలజీ బాగా వినియోగంలోకి వచ్చిన తర్వాత, బ్రెయిన్ క్యాన్సర్ కేసుల్లో పెరుగుదల లేదని పరిశోధనకు నేతృత్వం వహించిన 'ఆస్ట్రేలియన్ రేడియోషన్ ప్రొటెక్షన్, న్యూక్లియర్ సేఫ్టీ ఏజెన్సీ' తెలిపింది.

నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం



నమస్తే తెలంగాణ

విపక్షంపై ఘాతుక దాడి

తెరిపి లేకుండా వానలు, వరదలతో ప్రజలు సతమతమవుతున్నారు. బాధితులకు కావాల్సింది ఒకింత ఓదార్పు, కాసింత చేయూత. కానీ, జరుగుతున్నదేమిటి? రాజకీయాలకతీతంగా ప్రజలకు సహాయం అందించాల్సిన విపత్తు సమయంలో విపక్షాలపై పాలకపక్షం నిస్సిగ్గుగా దాడులకు తెగబడుతున్నది. స్వయంగా ముఖ్యమంత్రి, మంత్రులు నోరు పారేసుకుంటున్నారు. సమయం, సందర్భం లేకుండా విపక్షంపై దాడి చేయడం ప్రభుత్వ పెద్దల్లోని అభద్రతా భావానికి, అసహనానికి అద్దం పడుతున్నది. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం వారు ముందే హెచ్చరించినా ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమైంది. అదేవిధంగా వర్షాలు కురిసిన తర్వాత సహాయక చర్యల్లోనూ సర్కారు వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఇది కళ్లెదుట కనిపించే కాదనలేని వాస్తవమే. సర్కారు చేతకానితనాన్ని ప్రజలు నిలదీస్తున్నారు. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డికే డౌన్‌డౌన్ నినాదాలు, నిరసనలు స్వాగతం పలుకుతున్నాయి. మంత్రులను బాధితులు అడ్డగిస్తున్నారు, నిలదీస్తున్నారు. రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు చెంపలు వేసుకుంటున్నామని అంటున్నారు. ఇదివరకటి ప్రభుత్వ హయాంలో విపత్తు సహాయక చర్యలు సమర్థంగా అమలుకావడం గురించి ప్రజలు చెప్పుకొంటున్నారు. నాడు బీఆర్ఎస్ నేతలు చేసిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

బాధితులకు భరోసా ఇచ్చేందుకు బీఆర్ఎస్ నేతలు చేపట్టిన పరామర్శ పర్యటనపై కాంగ్రెస్ గూండాగిరికి దిగడం దారుణం. బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల కాన్వాయ్‌పై విరుచుకుపడి వీరంగం వేయడం అమానుషం. ఇదేదో క్షణికావేశంలో జరిగిన దాడి కాదు. రాళ్లు, కర్రలతో వాహనాలను ధ్వంసం చేయడమే అందుకు నిదర్శనం. దాడిలో మాజీ మంత్రులు హరీశ్ రావు, పువ్వాడ అజయ్ కార్లు దెబ్బతినడం చూస్తుంటే ఒక పథకం ప్రకారమే ఈ దాడి జరిగిందని స్పష్టంగా తెలుస్తున్నది. ఇదంతా జరుగుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం మరీ విచిత్రం. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాలతోనే దాడి జరిగిందనే అనుమానాలు సహజంగానే వ్యక్తమవుతున్నాయి. సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న బీఆర్ఎస్ నేతలకు ప్రజల నుంచి ఆత్మీయ స్పందన రావడం సీఎం రేవంత్‌రెడ్డికి గిట్టడం లేదా? విపత్తు నష్టాలను, మృతుల సంఖ్యను తగ్గించి చూపుతూ ఆత్మ సమర్థనలో పడిన కాంగ్రెస్ పాలకులకు కంటగింపుగా మారిందా? ఆ నిస్పృహతోనే తెలంగాణలోకి గూండా రాజకీయం తెస్తున్నరా?

సుమారు పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ లేవు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలక, విపక్షాల మధ్య రాజకీయ చర్చ జరగాలి. వాదన అంతమైన చోటే హింస మొదలవుతుందని పెద్దలు చెప్పిన మాట ఈ సందర్భంగా గుర్తుకువస్తున్నది. సహాయక కార్యక్రమాలు సజావుగా జరగలేదని ప్రజల తరపున విమర్శించే హక్కు విపక్షాలకు ఎప్పుడూ ఉంటుంది. వీలైతే జవాబు చెప్పాలి లేదా క్షమాపణ కోరాలి. ఇది సంస్కారవంతులైన రాజనీతిజ్ఞులు చేసే పని. కానీ, పెనం మీద పేలపు గింజలా ఎగిరెగిరిపడే రాజకీయ మరుగుజ్జుల తీరు వేరు. పొద్దున లేస్తే విపక్షాలను ఆడిపోసుకుంటూ పిల్లిశాపాలు పెట్టే సీఎం రేవంత్‌రెడ్డి నుంచి సరైన స్పందన వస్తుందనుకోవడం అత్యాశే అవుతుంది. సొంత ఊళ్లో మీడియాపై ముష్కర దాడి జరిపించిన చరిత్ర ఆయనది. ఒకటి మాత్రం నిజం. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సరైన సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ మార్క్ గూండా రాజకీయాలకు కర్రు కాల్చి వాతపెట్టడం ఖాయం.

పదేండ్ల జన్‌ధన్‌తో ఏం ప్రయోజనం?

2024, ఆగస్టు 28 నాటికి ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన పథకానికి పదేండ్లు పూర్తయ్యాయి. 2014 మే నెలలో తొలిసారి ప్రధానిగా పీఠమెక్కిన నరేంద్ర మోదీ తన ప్రతి నిర్ణయం ఒక సంచలనం కావాలనే జోరు మీదున్నారు. ఆ క్రమంలో 2014, ఆగస్టు 15 నాడు 'పీఎం జన్‌ధన్ యోజన' పథకాన్ని ప్రకటించారు. పైసా డిపాజిట్ లేకుండా దేశంలో ఉన్నవారందరికీ పొదుపు ఖాతాలు తెరవాలని బ్యాంకులను ఆదేశించారు. నిజానికిది 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన 'జీరో బ్యాలెన్స్' ఖాతాకు నకలు మాత్రమే. అవి కొనసాగుతూ 2014 వరకు లక్షలాది జీరో బ్యాలెన్స్ ఖాతాలు బ్యాంకు రికార్డుల్లోకి ఎక్కాయి. దానికి బీమా, ఓవర్‌డ్రాఫ్ట్ వంటివి జోడించి ప్రధాని మోదీ కొత్త పేరును పెట్టారు. ఉత్తర భారతంలో దీన్ని 'మోదీ ఖాతా'గా పిలుస్తుంటారు.



బి.నర్సన్
94401 28169

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు 2014, ఆగస్టు 23 నుంచి 29 వరకు వారం రోజుల పాటు బ్యాంకులు ఆ ఖాతాల పనిలో పడ్డాయి. జనాలతో బ్యాంకులు కిక్కిరిసిపోవటంతో ప్రజల వద్దకే బ్యాంకు ఉద్యోగులు వెళ్లారు. తత్ఫలితంగా జనాలు ఊళ్లలోని కూడళ్లలోకి వచ్చి మరీ ఖాతాలు తెరిచారు. ఖాతాల్లేవని వెళ్లగొట్టే బ్యాంకువాళ్లు 'రండి! రండి!' అని రోడ్లపైకి రావడం అందరికీ వింతగా అనిపించింది. ఏదో ఒక గుర్తింపు కార్డు చూపిస్తే చాలు ఖాతా చేతికి వచ్చినట్టే. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తెచ్చి ఒక్కొక్కరి ఖాతాలో వేస్తామని అప్పటికే మోదీ ప్రకటించినందు వల్ల ఆ ఆశతో కోట్లాది మంది ఖాతాలను తెరిచారు. అప్పటికే అకౌంట్ ఉన్నవాళ్లు కూడా ప్రభుత్వ పథకాలకు విడిగా ఓ ఖాతా ఉండాలేమో అనుకొని 'జన్‌ధన్' ఖాతా కూడా తెరిచారు. 2014 ఆగస్టు చివరి వారంలో తెరిచిన జన్‌ధన్ ఖాతాల సంఖ్య కోటి 81 లక్షలు. అది ఓ గిన్నీస్ రికార్డు. ఈ దశాబ్ద కాలంలో ఆ యోజన ఫలితంగా 53 కోట్ల బ్యాంకు ఖాతాల్లో రూ.2.31 లక్షల కోట్లు జమయ్యాయని ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది.

ఈ ఖాతాదారులకు రూ.30 వేల జీవిత బీమా, రూ.2 లక్షల ప్రమాద బీమాతో పాటు రూ.10 వేలు ఓవర్‌డ్రాఫ్ట్ అప్పుగా లభించడం ఈ పథకంలోని ప్రత్యేకత. 6 నెలల కాలంలో ఖాతాలో కనీస నాలుగు లావాదేవీలుంటేనే ఓవర్‌డ్రాఫ్ట్‌కు అర్హత ఉంటుంది. అయితే, బ్యాంకులు ఇంటికి దూరంగా ఉండటంతో పని వదిలేసుకొని ఈ లావాదేవీలు నడిపినవారు తక్కువ. మామూలు సెల్‌ఫోన్‌కు సమాచారం అందించే వ్యవస్థ ఉన్నా అన్ని గ్రామాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం లేనందువల్ల ఏ విషయం వారికి చేరకపోవడం మరో అడ్డంకి. దేశంలోని గ్రామాల్లో చిన్న నగదు లావాదేవీలు నడపడానికి వీలుగా ఆర్బీఐ బిజినెస్ కరస్పాండెంట్ వ్యవస్థకు అనుమతినిచ్చింది. దీని ఆధారంగా బ్రాంచీలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ఆయా సర్వీస్ బ్యాంకుల ద్వారా 'బ్యాంకు మిత్ర'ల నియామకం జరిగింది. అయితే వారికి తక్కువ జీతంతో పాటు ఎలాంటి సర్వీస్ రూల్స్, క్రమశిక్షణ చర్యల విధానం లేకపోవడం వల్ల ఎవరూ నిలకడగా ఉండటం లేదు. పైగా, అక్షరజ్ఞానం లేని గ్రామీణులను కొందరు మోసం కూడా చేస్తున్నారు.

2017లో అవినీతికి పాల్పడ్డ బ్యాంకుమిత్రలు 20 శాతం ఉండగా ఏటా వారి సంఖ్య పెరుగుతున్నదని పలు నివేదికలు చెప్తున్నాయి. బ్రాంచీల విస్తరణ లేదా బ్యాంకు సిబ్బందే వారానికి ఒక రోజు గ్రామాల్లోకి వెళ్లడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.



హంగామాగా ఆరంభించిన జన్‌ధన్ యోజన ప్రయోజనాల గురించి ప్రజల్లోకి సరిగా వెళ్లలేదనే చెప్పాలి. ప్రభుత్వం దీని నిర్వహణకు ఒక పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటుచేయలేదు. డబ్బు అవసరం ఉన్నవారికి, సామాన్యులకు బ్యాంకు ఓవర్‌డ్రాఫ్ట్ ఎంతో ఉపయోగకరం. అయితే దీని గురించి ఖాతాదారులకు తెలిపే ప్రయత్నం ప్రభుత్వం కాని, బ్యాంకులు కాని చేయడం లేదు. ఎలాంటి గ్యారెంటీ లేకుండా సామాన్యుడికి పది రూపాయలు ఇవ్వడానికి కూడా బ్యాంకులు ముందుకురావు. ఓవర్‌డ్రాఫ్ట్ ఇస్తే ఆ సొమ్ము తిరిగిరాదని బ్యాంకర్ల విశ్వాసం, అనుభవం. 2016, డిసెంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం 30 కోట్ల ఖాతాల్లో 45 లక్షల మందికి ఓవర్‌డ్రాఫ్ట్ అందింది. అంటే, అది 2 శాతం కూడా కాదు. ఖాతాలో లావాదేవీలు నడిపించి ఓవర్‌డ్రాఫ్ట్ అందేలా ప్రజలకు సాయపడే బాధ్యతను ప్రభుత్వం ఏదైనా గ్రామీణ శాఖకు కట్టబెట్టాలి. ఊర్లలో రికవరీ బృందాలను ఏర్పాటుచేసి మళ్లీ తిరిగి కట్టేలా చర్యలు తీసుకోవాలి. ఓవర్‌డ్రాఫ్ట్ రికవరీ సంతృప్తిగా ఉంటే ఆ సొమ్మును పెంచడానికి కూడా బ్యాంకులు ముందుకు రావచ్చు. ప్రైవేటు లోన్‌యాప్‌ల ద్వారా చిన్న మొత్తాలు తీసుకొని అధిక వడ్డీ, పెనాల్టీలు కట్టలేక ప్రాణం మీదికి తెచ్చుకొన్న వార్తలు ఎన్నో ఉన్నాయి.

2022లో జన్‌ధన్ యోజన ఖాతాల పరిస్థితిపై రాజస్థాన్ గ్రామాల్లో ఇన్‌స్పైరా జర్నల్స్ సేకరించిన వివరాల ప్రకారం ఒక శాతం మాత్రమే ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకున్నారు. ఖాతా తెరిచిన నాటి నుంచి 47 శాతం మంది ఒక్క లావాదేవీ కూడా జరపలేదు. 37 శాతం మందికే రూపే కార్డులు అందాయి. వారిలో రూపే కార్డులను రెన్యూవల్ చేసుకున్నవారు తక్కువే. 59 శాతం మంది తగిన ఆదాయం లేక ఖాతాను నడపడం లేదు. 33 శాతం మందికి ఇదివరకే బ్యాంకు ఖాతాలున్నాయి. ప్రభుత్వం డబ్బులు వేస్తుందని ఈ ఖాతాను కూడా తెరిచామని వారంటున్నారు. కేవలం ఖాతాల సంఖ్య, అందులో జమైన సొమ్మును ప్రచారం చేసుకొని ఈ పథకం గొప్ప ఫలితాలను సాధించిందని ప్రభుత్వం చెప్పుకోవడం తగదని, జన్‌ధన్ యోజన లక్ష్యాలు, ప్రయోజనాలు ఖాతాదారులకు అందినప్పుడే అది నిజమైన విజయమని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ చెప్పడం గమనార్హం.

గరీబ్ కళ్యాణ్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఈ ఖాతాల్లో రూ.10,300 కోట్లు వేయగా, అందులోంచి రూ.4 వేల కోట్లు మాత్రమే విత్‌డ్రా అయ్యాయని తెలుస్తున్నది. అంటే, తమ ఖాతాల్లో డబ్బు పడిన సమాచారం చేరవేసే వ్యవస్థ కూడా లేదన్నమాట. ఈ మధ్య బయటపడిన మరో విషయమేమంటే ఈ ఖాతాలు సైబర్ మోసగాళ్లకు ఉపయోగపడుతున్నాయట. ఈ ఖాతాలు తెరిచేప్పుడు ఎలాంటి కేవైసీ నిబంధనలు పాటించలేదు కాబట్టి, ఆయా వ్యక్తులను పట్టుకోవడం ఇప్పుడు కష్టమే. కోట్లలో జన్‌ధన్ ఖాతాలున్నందువల్ల కోరుకున్నన్ని ఖాతాలు సైబర్ నేరాలకు వాడుకోవచ్చు. ఖాతాదారు రూపే కార్డును తీసుకుంటే ఎక్కడి నుంచైనా డబ్బులు డ్రా చేసుకోవచ్చు. ఇంత వైఫల్యం, దుర్వినియోగం అవుతున్న జనధన్ యోజన పథకాన్ని కేంద్రం లక్ష్యసాధన దిశగా, ప్రజలకు ఆర్థిక సహాయకారిగా మలచాల్సిన అవసరం ఎంతో ఉన్నది.



విష రసాయనాలతో వినాయకుడా?



డాక్టర్ శ్రీదరాల రాము
94411 84667

'వినాయక చవితి' హిందువులకు అతి ముఖ్యమైన పండుగ. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా గణపతి ప్రతిమను భక్తిశ్రద్ధలతో పూజించి, ఆ తర్వాత నీటిలో నిమజ్జనం చేయడం ఏటా ఆనవాయితీగా జరిగే కార్యక్రమం. అయితే, ఈ పండుగ జరుపుకొనే విధానం అసలు సంప్రదాయానికి అనుగుణంగా ఉన్నదా, లేదా? అనే విషయాన్ని భక్తులు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉన్నది. సంప్రదాయం ప్రకారం ప్రకృతిలో లభించే మట్టితో వినాయకుని ప్రతిమను తయారుచేసి పత్రి, పూలతో ఘనంగా పూజించిన తర్వాత, ఆ వినాయకుడిని మళ్లీ అదే ప్రకృతి ఒడిలోకి చేర్చాలి.

వినాయకుడి ప్రతిమను తయారుచేయడం నుంచి పూజించడం, నిమజ్జనం చేయడం దాకా అంతా ప్రకృతి కేంద్రంగా జరుగుతుంది. అంటే, సంప్రదాయ పూజ పద్ధతిలో 'రీసైకిల్' అనే ఒక పర్యావరణ నియమం మనకు స్పష్టంగా కనబడుతుంది. కానీ, ప్రస్తుతం సమాజంలో వినాయక చవితి పండుగ జరుపుకొనే విధానం పర్యావరణ విధ్వంసం కలిగించే విధంగా ఉంటున్నది. మట్టితో తయారుచేసిన ప్రతిమలకు బదులుగా 'ప్లాస్టర్ ఆఫ్ పారిస్' అనే విష రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలను పూజించడం ఆనవాయితీగా మారిపోయింది.

'మట్టి' జీవం గల ఒక పదార్థం. అందుకే మొక్కల నుంచి మహా వృక్షాలు సహా అనేక జీవజాతులకు అది జీవం పోస్తుంది. అందుకే, మట్టి వినాయకుడిని పూజించడమంటే ఒక సజీవమైన దేవుడి ప్రతిమను పూజించినట్లుగా భావించాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో ఎలాంటి మొక్కలు, జీవజాతులు పెరగవు. ఎందుకంటే, ఇది జీవులను నశింపజేసే ఒక నిర్జీవ విష పదార్థం. అంతేకాదు, వినాయక ప్రతిమలను అందంగా అలంకరించడం కోసం వాడుతున్న రంగులు కూడా ఆ ప్రతిమలను మరింత విషపూరితంగా మారుస్తున్నాయి. అంటే, భక్తులు తొమ్మిది రోజుల పాటు పూజిస్తున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు ఒక నిర్జీవమైన, జీవం లేని విష పదార్థాలతో కూడినవేననటంలో సందేహం లేదు. మరి, ఇలాంటి ప్రతిమలను పూజిస్తే ఫలితం దక్కుతుందో, లేదో భక్తులే శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించుకోవాలి. అంతేకాదు, పూజించిన తర్వాత దుర్గంధంతో కూడిన ట్యాంక్‌బండ్ వంటి మురికి నీటిలో ఆ ప్రతిమను నిమజ్జనం చేయడమంటే దేవుడిని పూర్తిగా అగౌరవపరిచినట్టే. ఎందుకంటే అలాంటి దుర్గంధపు నీటిలో మనమే స్నానం చేయం!

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణానికి హాని చేస్తాయి. అవి చెరువు అడుగు భాగంలో ఘన, వ్యర్థ పదార్థంగా ఉండిపోయి క్రమేపి పూడిక పరిమాణాన్ని పెంచుతాయి. అధిక మొత్తంలో కాల్షియం, మెగ్నీషియం లవణాలుండటం వల్ల అవి నీటి కఠినత్వాన్ని పెంచడమే కాకుండా, చెరువుల్లోని నీటిని ఉప్పు నీరుగా మారుస్తాయి. ఈ విగ్రహాలు తయారుచేసేటప్పుడు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ గాల్లోకి విడుదల చేసే వాయువులతో శ్వాసకోశ వ్యాధులు సంక్రమించే అవకాశాలున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వ్యర్థాలు కలిగిన నీటిని సాగుకు వాడినప్పుడు కాలక్రమేణా సారవంతమైన వ్యవసాయ భూములు నిస్సారంగా మారి వ్యవసాయానికి పనికిరాకుండా పోతాయి. వీటిలో వాడే కొబ్బరి పీచు నీటిలో కుళ్లిపోతుంది. తద్వారా నీటిలోని ఆక్సిజన్ స్థాయులు తగ్గిపోతాయి. కొబ్బరి పీచులోని రసాయన సమ్మేళనాలు నీటిలోకి విడుదల కావడం వల్ల నీటిలో ఆమ్లత్వం పెరుగుతుంది. విగ్రహాల సుందరీకరణ కోసం వాడే రంగులు క్యాన్సర్ కారకాలు. ఈ రంగుల వల్ల చెరువుల్లోని నీటి రంగు కూడా మారిపోతుంది. 'బయో మాగ్నిఫికేషన్' ప్రక్రియ ద్వారా రంగు పదార్థాలు మానవుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. అంతేకాదు, ఆ రంగునీళ్లలో నివసించే చేపల వంటి జలచరాలలోకి, మొక్కల్లోకి ప్రవేశించి ఆహారం ద్వారా మనుషుల శరీరాల్లోకి కూడా ప్రవేశిస్తాయి.

ఒకప్పుడు మహా గణపతి నవరాత్రి ఉత్సవాలకు మాత్రమే పరిమితమైన ఈ పద్ధతి, ఈ మధ్యకాలంలో దసరా నవరాత్రి ఉత్సవాల పేరిట కూడా కొనసాగుతున్నది. మనం నిత్యం తాగే నీటి వనరులను కలుషితం చేయడం వల్ల ఆ నీటిని మళ్లీ మంచినీరుగా మార్చుకోవడానికి పెద్దమొత్తంలో ఖర్చుచేసి రివర్స్ ఆస్మాసిస్(ఆర్వో) వంటి ఖరీదైన టెక్నాలజీలతో శుభ్రపరచాల్సిన పరిస్థితి వస్తున్నది. ఆ నీటిలో సరైన మినరల్స్ లేకపోవడం వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. కాబట్టి ప్రకృతి మనకు సహజంగా ఇచ్చిన వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. పెరుగుతున్న జనాభాకనుకూలంగా రాబోయే తరాలకు ఆరోగ్యవంతమైన నీటి వనరులను అందించాలి. పర్యావరణ కలుషితానికి కారణమయ్యే విషపూరిత ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూజించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదనే విషయాన్ని భక్తులు గ్రహించాల్సిందిగా మనవి.

(వ్యాసకర్త: ఫ్యాకల్టీ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, హైదరాబాద్)

ఇకనైనా రేవంత్ మారతారా!

చిన్నప్పుడు చదివిన చందమామ కథల్లో ఈ కథ బాగా గుర్తుండిపోయింది. ఒక ఏనుగు తొండంతో పూలమాలను పట్టుకెళ్తూ తనకు నచ్చినవారి మెడలో ఆ మాల వేసేది. ఏనుగు ఆ మాలను ఎవరి మెడలో వేస్తే వారే ఆ దేశానికి రాజు. ఏనుగు పూలమాలను వేయగానే అతన్ని రాజుగా పట్టాభిషేకం చేస్తారు. కథ అక్కడితో ముగుస్తుంది. నిజానికి కథ అక్కడితో ముగిస్తేనే బాగుంటుంది. కానీ, ఏనుగు దండ వేశాక రాజుగా బాధ్యతలు స్వీకరించాక అతను ఉపన్యాసమిస్తే ఎలా ఉంటుందోననే కుతూహలం నాలో ఉండేది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపన్యాసాలను విన్నప్పుడల్లా నాకు ఈ కథ గుర్తుకొస్తూ ఉంటుంది.



బుద్దా మురళి

శాసనమండలి సభ్యురాలు కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేశాక, అత్యున్నత న్యాయస్థానాన్ని కించపరిచే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడిన తీరు వ్యక్తులుగా వారి స్థాయికి తగినట్టుగా ఉండవచ్చు, వారి అభిమానులు చప్పట్లు కొట్టే విధంగా ఉండవచ్చు. కానీ, వారు చేపట్టిన పదవులకు తగిన స్థాయిలో మాత్రం లేవు. కోర్టు నిర్ణయం పైనే కాదు, అన్ని చోట్ల వారి ప్రసంగాలు అదే స్థాయిలో ఉంటున్నాయి. సుప్రీంకోర్టు స్వయంగా తప్పు పట్టడం వల్ల వారి ప్రసంగాలు చర్చలోకి వచ్చాయి.

గుజరాత్‌లో అత్యంత ఎత్తయిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహాన్ని స్వయంగా ప్రధాని మోదీ ఏర్పాటు చేశారు. మహాత్మా గాంధీ, నెహ్రూ కన్నా పటేల్ మహానాయకుడు అనేది బీజేపీ అభిప్రాయం. అలాంటి పటేల్ నిర్వహించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తాను మాట్లాడేప్పుడు తన అభిమానులను కాకుండా ఒక్కసారి పటేల్‌ను గుర్తుకు తెచ్చుకుంటే కొద్దిగా అయినా హుందాగా మాట్లాడటం అలవాటు అవుతుందేమో. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికే అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం పట్ల గౌరవం లేకపోతే ఎలా? ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై సుప్రీంకోర్టు ఒకసారి కాదు, రెండు సార్లు తీవ్రంగా స్పందించింది. 'నాయకులను సంప్రదించి నిర్ణయాలు తీసుకుంటామా? ముఖ్యమంత్రి వంటి బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నవారు మాట్లాడాల్సిన మాటలేనా ఇవి?' అని రేవంత్‌ను సుప్రీం న్యాయమూర్తులు ప్రశ్నించారు.



తర్వాత కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా ఖాతాలో బెయిల్‌పై చేసిన రాజకీయ విమర్శలపై సుప్రీం అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఫలానా కంపెనీ ఉత్పత్తి కంటే తమ ఉత్పత్తే మంచిదని ఏ వ్యాపార సంస్థ అయినా ప్రచారం చేసుకుంటుంది. అది సహజం. రాజకీయ వ్యాపారంలో రాజకీయ పార్టీలు సైతం అదే విధంగా విమర్శించుకుంటాయి. రాజకీయ వ్యాపారంలో పరస్పర విమర్శలు సహజమే. కానీ, ఉన్నత స్థానాల్లో ఉన్నవారు బూతులకు, విమర్శలకు, ఆరోపణలకు తేడా తెలుసుకోవాలి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలను సుప్రీంకోర్టు తప్పుపట్టడమంటే అది ఆయనకు, కాంగ్రెస్ పార్టీకి మాత్రమే అవమానకరం కాదు, యావత్ తెలంగాణ ప్రజలకూ అవమానకరమే. రేవంత్ రెడ్డి పాఠశాల పిల్లలను ఉద్దేశించి మాట్లాడినా బూతులే మాట్లాడుతున్నారు. వాటిని తన ట్రేడ్‌మార్క్‌గా ఆయన మార్చుకున్నారు. మైకు ముందుకు వెళ్లేటప్పుడు తాను ముఖ్యమంత్రిని అనే విషయాన్ని రేవంత్ రెడ్డి ఒకసారి గుర్తు చేసుకొని ఉపన్యాసం మొదలుపెడితే తన మాటతీరు మారవచ్చు. తన తిట్ల వల్లనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనే భ్రమ ఆయనకు ఉంటే చేయగలిగిందేమీ లేదు. బీఆర్ఎస్‌ను ఓడించి, కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారు. అంతేకానీ, రేవంత్‌రెడ్డిని గెలిపించలేదు. కాంగ్రెస్ అధిష్ఠానం చల్లని చూపు ఉన్నంత వరకే ఆయన మాట చెల్లుబాటవుతుంది. ఆయన తిట్లు కూడా అంతవరకే నచ్చుతాయి.

పాలనపై పట్టు సాధించే విషయం ఎలా ఉన్నా రేవంత్ రెడ్డి మాత్రం బూతులపై పట్టు సాధించారు. రేవంత్ శాసనమండలి సభ్యుడిగా ఉన్నప్పుడు మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్తు సమావేశం జరుగుతున్న సమయంలో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే డీకే అరుణను కొట్టినంత పనిచేశారు. రావుల చంద్రశేఖర్‌రెడ్డి పట్టుకొని ఆయనను వెనక్కి లాగారు. టీడీపీ, కాంగ్రెస్ నాయకుడిగా ఉన్నప్పటి పరిస్థితి వేరు. ఆ ఆవేశం, తిట్లు రాజకీయంగా ఎదగడానికి, అభిమానులు చప్పట్లు కొట్టడానికి ఉపయోగపడి ఉండవచ్చు. ముఖ్యమంత్రి స్థాయిలో కూడా అవే ఉపయోగపడతాయని అనుకుంటే పొరపాటే. రాహుల్ గాంధీ పుట్టుక గురించి బీజేపీ నాయకులు విమర్శిస్తే.. ప్రత్యర్థి పార్టీ అయినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించారు. తమ నాయకుడి గురించి మాట్లాడినా కాంగ్రెస్ నేతలు స్పందించలేదు. అయినా కేసీఆర్ స్పందించారు.

రజత్ శర్మ ఆప్ కీ అదాలత్ వీడియో ఒకటి ఈ మధ్య చూశాను. వాజపేయిని రజత్ శర్మ కలిసినప్పుడు.. 'మీరు ఎంత ఉన్నతస్థాయికి వెళ్తే.. సహన శక్తి అంతగా పెంచుకుంటూ ఉండాల'ని చెప్పారట. మాట్లాడే కళ నేర్పించాలని వాజపేయిని రజత్ శర్మ అడగగా.. 'నా నుంచి మాట్లాడే కళ కాదు.. నేర్చుకోవాలనుకుంటే, మౌనంగా ఉండటం నేర్చుకో' అని వాజపేయి బదులిచ్చారట. అందుకే వాజపేయి లాంటి వారిని పార్టీలకతీతంగా అందరూ గౌరవిస్తారు.

బడిబాట పట్టాలనే సంకల్పంతో ఎస్ఆర్ శంకరన్, మాజీ మంత్రి, స్వర్గీయ మహేంద్రనాథ్ లాంటి మహనీయుల ఆలోచనల నుంచి పుట్టుకొచ్చినవే గురుకులాలు. స్వరాష్ట్రంగా తెలంగాణ ఏర్పడ్డాక నాటి కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అనేక గురుకులాలను ఏర్పాటుచేసింది. దాంతో గామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందింది. అయితే ఎంతోమందికి చేయూతనిచ్చిన గురుకులాలు నేడు నిర్వీర్యమవుతుండటం ఆందోళనకరం.

గురుకులాల విలీనం.. ఓ కుట్ర



పబ్బతి శ్రీకృష్ణ
95334 11328

గురుకులాల్లో చదువుతున్న అణగారినవర్గాల పిల్లలు ఉన్నతస్థాయికి చేరుకోవడం కొందరికి నచ్చడం లేదు. అందుకే వారిని విద్యకు దూరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారు. పాలకులే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నడుపుతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు. తద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను సమూలంగా నాశనం చేస్తున్నారు.

గురుకుల విదార్థులు అన్నిరకాల ప్రవేశ పరీక్షల్లో ముందంజలో నిలుస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడి ఇంజినీరింగ్, మెడికల్, లా తదితర కోర్సుల్లో చాలామంది సీట్లు సంపాదిస్తున్నారు. గురుకులాల ద్వారానే దళిత, బహుజన కుటుంబాలు అభ్యున్నతి చెందుతున్నాయన్నది నగ్న సత్యం. ఇది రుచించుకోని అగ్రకులాలు గురుకులాలపై కుట్రలు పన్నుతున్నారు. అందులో భాగంగానే 'మనమంతా ఒక్కటే' అనే కపట నాటకానికి తెర తీశారు. వాస్తవానికి అందరమొక్కటే అయినప్పుడు ఇంటర్నేషనల్, నేషనల్, ఒలింపియాడ్, కార్పొరేట్ పాఠశాలలు ఎందుకున్నట్టు? నేటికీ బిజినెస్ స్కూళ్లల్లో రిజర్వేషన్లు ఎందుకు లేవు? అందరం ఒక్కటే అయినప్పుడు ఎలాంటి వివక్ష ఎదుర్కోని అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఎందుకు? బడుగు, బలహీనవర్గాల కంటే అతి తక్కువ మార్కులు వచ్చినవారికి సీట్లు, ఉద్యోగాలు ఎందుకొస్తున్నాయి? అనేక కులాలను బీసీల జాబితాలో చేరుస్తూ బీసీలను మరింత బలహీనంగా ఎందుకు మారుస్తున్నారు? ఈ ప్రశ్నల్లో ఏ ఒక్కదానికీ పాలకుల వద్ద సమాధానాల్లేవు. ఎంతటి దుర్గార్మమైన అణచివేత ఇది.



'అన్ని కులాలకు కలిపి ఒకే గురుకులాలు' అని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఈ ప్రకటనలోనే పాలకుల కుట్ర దాగి ఉన్నది. కామన్ గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రావాల్సిన 75 శాతం సీట్లు నష్టపోవడం ఖాయం. గురుకులాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. ఉన్నతాధికారుల పెత్తనం కారణంగా గురుకులాలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. ఈ సమస్యలపై గతంలో గురుకులాల సెక్రెటరీకి మాల మహానాడు విన్నవించినా పట్టించుకోలేదు.

గురుకుల పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించడం లేదు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతోనే రాష్ట్రంలోని అన్ని గురుకులాలు నడుస్తున్నాయి. ఇలా గురుకులాలను వెంటాడుతున్న వివిధ సమస్యలు తమ ప్రతిభకు అడ్డంకిగా మారాయని విద్యార్థులు భావించడం లేదు. సమస్యలతో సహవాసం చేస్తూనే నీట్, జేఈఈ లాంటి జాతీయ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపుతున్నారు. గురుకులాల పేరు నిలబెడుతున్నారు. అయినప్పటికీ నాణ్యమైన విద్యను అందించాల్సిన పాలకులు వారిని మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురుకులాల్లో తిష్టవేసిన సమస్యలను వెంటనే పరిష్కరించి, బంగారు భవితకు బాటలు వేయాల్సిన అవసరం ఉన్నది.

(వ్యాసకర్త: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు)

దండిగా నిధులున్నా.. బాధితులకు సాయం సున్నా!

- రాష్ట్రం వద్ద రూ.1345 కోట్ల ఎస్డీఆర్ఎఫ్ నిధులు
- బాధితులకు తక్షణ సాయం అందించని ప్రభుత్వం
- ఆ నిధులను వాడుకోవాలని కేంద్రం సూచన
- యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించక ఆగిన 208 కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ముంచెత్తిన వరదల కారణంగా లక్షలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయి. తినడానికి తిండిలేక, నిలువ నీడ లేక బాధితులు అల్లాడిపోతున్నారు. వారికి తక్షణ సాయం అందించాల్సిన ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తుండిపోయింది. పరిహారం ప్రకటనలకే తప్ప ఆచరణలో కనిపించడం లేదు. కేంద్రాన్ని సాయం అడుగుతున్నామని, రాగానే అందిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని కేంద్రం బట్టబయలు చేసింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన విపత్తు సహాయ నిధి నిధులు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర రూ.1,345 కోట్లు ఉన్నాయని కేంద్ర హోం శాఖ బుధవారం వెల్లడించింది. 2024-25లో సంభవించే విపత్తు సహాయ చర్యలకు ఆ నిధులు వాడుకోవాలంటూ కేంద్ర హోంశాఖ (జాతీయ విపత్తు నిర్వహణా విభాగం) డైరెక్టర్ ఆశిష్‌గవాయ్ సూచించారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారికి బుధవారం లేఖ రాశారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నాటికి రాష్ట్ర ఖజానాలో రూ.1,345.15 కోట్ల ఎస్డీఆర్ఎఫ్ నిధులు ఉన్నాయని రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ పేర్కొన్నట్టు లేఖలో తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో మరో రూ.208.40 కోట్లు కేంద్రం నుంచి విడుదల కావాల్సి ఉన్నదని, అయితే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించకపోవడంతో వాటిని ఆపాల్సి వచ్చిందని వివరించారు. వెంటనే సర్టిఫికెట్లు సమర్పిస్తే రూ.208 కోట్లు విడుదల చేస్తామని స్పష్టంచేశారు. ఈ లేఖ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై బాధితులు మండిపడుతున్నారు. ప్రభుత్వ ఖజానాలో రూ.1,345 కోట్ల ఎస్డీఆర్ఎఫ్ నిధులు ఉన్నా, బాధితులకు తక్షణ సాయం అందించేందుకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నిస్తున్నారు. వరద బాధితులకు కుటుంబానికి కొంత నగదు, నిత్యవసరాల కిట్లు పంపిణీ చేస్తే ఉపశమనం కలిగేది కదా అని వాపోతున్నారు. పైగా బీఆర్ఎస్ నేతలు నిత్యావసరాల కిట్లు అందిస్తుంటే దాడిచేశారంటూ మండిపడుతున్నారు.

ఆదుకోవడంలో విఫలం: హరీశ్‌రావు

ఎస్డీఆర్ఎఫ్ నిధులను వినియోగించి వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. విపత్తు నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కేంద్ర హోం శాఖ లేఖతో బట్టబయలైందని విమర్శించారు. ప్రభుత్వ ఖాతాలో రూ.1,345.15 కోట్ల ఎస్డీఆర్ఎఫ్ నిధులు ఉన్నా వినియోగించకుండా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. వరద ప్రభావంపై ఇప్పటివరకు కేంద్రానికి నివేదిక ఇవ్వకపోవడం దేనికి సంకేతమని నిలదీశారు.


ప్రయాణికులకు ఆర్టీసీ శుభవార్త :సజ్జనార్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ప్రయాణికులకు టీజీఎస్ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులకు డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించింది. ఈ రూట్ బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులకు టికెట్ ధరపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. రాజధాని ఏసీ, సూపర్‌లగ్జరీ బస్సుల్లో ప్రయాణంపై డిస్కౌంట్ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సజ్జనార్ కోరారు. అడ్వాన్స్‌డ్ టికెట్ రిజర్వేషన్ కోసం tgsrtc.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సినిమా మూడ్‌లో సీఎం.. నిండా మునిగిన ఖమ్మం!

- శనివారం రాత్రే రాష్ట్రానికి భారీవర్ష సూచన
- ఆదివారం ఉదయం నుంచే జిల్లాల్లో కుంభవృష్టి
- పర్యవేక్షణను పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి
- బాలకృష్ణ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు తయారు
- లైవ్ టెలికాస్ట్‌పై నిర్వాహకులు, సావీ మీడియా గొడవ
- చంద్రబాబూ రాకపోవడంతో ఫంక్షన్‌కు దూరం


భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్న గోదావరి


YouTube
Hon'ble CM Sri.A.Revanth Reddy will participate in Sri Nandamuri Bal...
Hon'ble Chief Minister Sri.A.Revanth Redd...
youtube.com

Dear Sir/Madam,
Hon'ble Chief Minister Sri.A.Revanth Reddy will participate in **Sri Nandamuri Balakrishna's Golden Jubliee Celebrations by Telugu Film Industry** at HICC,Hyderabad today i.e.01.09.2024. Live Signal will be available from 07:30PM please download

Frequency : D/L 4168.25 MHz, S/R 2.8 MSPS, MPEG 4, DVBS2 Satellite GSAT - 16, 55 (East)

I&PR Dept,Telangana
YouTube Live Link
https://youtube.com/live/ZNH-vDoKLIo

బాలకృష్ణ కార్యక్రమానికి సీఎం వెళ్లనున్నట్టు మీడియాకు సీఎంవో నుంచి వచ్చిన మెసేజ్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): 'వర్షాలు, వరదల నేపథ్యంలో మూడు రోజులుగా కంటిమీద కునుకు లేకుండా పనిచేస్తున్నా' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినదంతా అబద్ధమేనా? కుంభవృష్టితో చిగురుటాకులా వణుకుతున్న జిల్లాలపై సమీక్షించాల్సిందిపోయి ఆయన సినిమా ఫంక్షన్‌పై దృష్టి పెట్టారా? ఫలితంగా ఖమ్మం ఎన్నడూ లేనంత జలవిలయంలో కూరుకుపోయిందా? ప్రభుత్వం నుంచి సకాలంలో స్పందన లేకపోవటమే విపత్తు తీవ్రతకు కారణమా? అంటే విశ్వసనీయ వర్గాలు అవుననే అంటున్నాయి. రాష్ట్రానికి భారీ వర్షాల ముప్పు ఉన్నదని వాతావరణశాఖ హెచ్చరించినా పట్టించుకోలేదని.. ఆదివారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నా.. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం తదితర జిల్లాల్లో కుంభవృష్టి కురుస్తున్నా.. రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సీఎం వస్తున్నారంటూ లైవ్ లింక్

బాలకృష్ణ సినీ పరిశ్రమలో అడుగుపెట్టి 50 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో సినీ ప్రముఖులు ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆ కార్యక్రమానికి ఆదివారం రాత్రి 7.30 గంటల తర్వాత హాజరయ్యేందుకు రేవంత్ సిద్ధమయ్యారు. కార్యక్రమానికి తెలంగాణ సీఎం హాజరవుతున్నట్టు నిర్వాహకులకు సమాచారం కూడా అందింది. సీఎం కార్యక్రమాలను లైవ్ టెలికాస్ట్ చేసే సావీ (ఎస్‌ఏవీవై) మీడియా ఒక లైవ్ లింక్‌ను సాయంత్రం 5:18 గంటలకు సీఎంవో అధికారిక గ్రూప్‌లో వేసింది. సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం 7.30 గంటలకు బాలకృష్ణకు సంబంధించిన కార్యక్రమానికి హాజరవుతారని అందులో పేర్కొన్నారు. ఈ యూట్యూబ్ చానల్ సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితులదనే ప్రచారం ఉన్నది. అంతేకాదు.. ఎస్‌ఏవీవై మీడియాకు చెందిన ప్రతినిధులు సీఎం ప్రసంగాన్ని లైవ్ టెలికాస్ట్ చేయటం కోసం ఈవెంట్ జరుగుతున్న ప్రాంతానికి కూడా వెళ్లినట్టు తెలిసింది. అయితే.. అది సినిమా ఫంక్షన్ కావటంతో ఈవెంట్‌కు సంబంధించిన ప్రసార హక్కులను ఓ కంపెనీకి అమ్మేశామని, కాబట్టి లైవ్ టెలికాస్ట్ కుదరదని నిర్వాహకులు అభ్యంతర పెట్టినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో మాటామాటా పెరిగి, అక్కడున్న బౌన్సర్లు ఎస్‌ఏవీవై మీడియా ప్రతినిధులను బయటి తోసేశారని ప్రచారం జరుగుతున్నది. బౌన్సర్ల దాడిలో ఒకరిద్దరు గాయాలతో దవాఖానలో కూడా చేరాల్సి వచ్చిందట. ఏకంగా సీఎం సన్నిహితులకే చెందిన మీడియా సిబ్బందిపై దాడి జరగటంతో సంబంధీకులు ఆ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మన రాష్ట్రంలో మనం అధికారంలో ఉండగా మనల్ని ఎలా కొడతారని ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో సీఎం పునరాలోచనలో పడి వెళ్లేందుకు సిద్ధమైన వ్యక్తి కాస్తా.. ఆగిపోయారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు కూడా హాజరు కావాల్సి ఉన్నది. అయితే ఏపీలో భారీ వర్షాలు, విజయవాడలో వరదల కారణంగా ఆయన తన పర్యటన రద్దు చేసుకున్నారు. దీంతో 'బాబుగారు రావటం లేదు కదా నేను వస్తే బాగుండదు' అని చెప్పి రేవంత్ కార్యక్రమానికి గైర్హాజరయ్యారట.

నిద్రాహారాలు మాని.. శుద్ధ అబద్ధం!

నిజానికి రాష్ట్రానికి భారీ వర్షాల ముప్పు ఉన్నదని శనివారమే వాతావరణశాఖ నుంచి ప్రభుత్వానికి హెచ్చరికలు అందాయి. ఆదివారం ఉదయం నుంచే కుంభవృష్టి ప్రారంభమైంది. మధ్యాహ్నానికే వరదలు మొదలై సాయంత్రానికి పరిస్థితి అదుపు తప్పింది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇవేమీ పట్టనట్టు సాయంత్రం సినిమా కార్యక్రమానికి హాజరయ్యేందుకు సిద్ధమయ్యారంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. ఒకవేళ రేవంత్ రెడ్డి చెప్తున్నట్టు.. శనివారం రాత్రి నుంచే కంటిమీద కునుకు లేకుండా గడుపుతుంటే.. సహాయ చర్యలపై ఒక్క సమీక్ష గానీ, టెలికాన్ఫరెన్స్ గానీ ఎందుకు జరగలేదన్న ప్రశ్న వినిపిస్తున్నది. సీఎం వరద సమీక్షల్లో ఉంటే బాలకృష్ణ సినిమా కార్యక్రమానికి హాజరు కానున్నట్టు ప్రభుత్వం అధికారిక మీడియా లింక్ ఎలా విడుదల చేస్తుందని, సదరు మీడియా ప్రతినిధులు ఏకంగా 'లైవ్' ఇచ్చేందుకు ఎలా వెళ్తారని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకవేళ ఆదివారం ఉదయం గానీ, మధ్యాహ్నం గానీ బాలకృష్ణ కార్యక్రమానికి హాజరును రద్దు చేసి ఉంటే సాయంత్రం 5.18 గంటలకు లైవ్ లింక్ పడేది కాదన్నది వారి వాదన. ఒకవేళ పొరబాటు జరిగిందని భావించినా.. 'సీఎం పర్యటన రద్దయ్యింది' అని సీఎంవో అధికారిక గ్రూప్‌లో అయినా సమాచారం ఇచ్చేవారని చెప్తున్నారు. పోనీ నిర్వాహకులకైనా సమాచారం అందేదని అంటున్నారు. కానీ ఇవేమీ జరగలేదంటే.. కచ్చితంగా సినిమా కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం నిర్ణయించుకున్నారని అర్థమవుతుందని నొక్కిచెప్తున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే.. మూడు రోజులు నిద్రాహారాలు లేకుండా గడిపానని, నిరంతరం సమీక్షించానని చెప్పడం శుద్ధ అబద్ధమని నెటిజన్లు మండిపడుతున్నారు. పైగా ఆదివారం సీఎం ఇంటి నుంచి బయటికే వెళ్లలేదని, కనీసం ఉన్నతాధికారులను పిలిపించుకొని సమీక్షించిన దాఖలాలు కనిపించలేదని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. దీన్ని బట్టి సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వహించటం వల్లే ఖమ్మం మునిగిందని తీవ్రంగా చర్చ జరుగుతున్నది. దానిని కప్పి పుచ్చుకోవడానికే తూతూమంత్రంగా పరామర్శలకు వెళ్లారని, అయినా వైఫల్యంపై విమర్శలు తగ్గకపోవడంతో బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని ఆరోపణలు చేశారని అంటున్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్తు పునరుద్ధరణ : భట్టి విక్రమార్క



హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : వర్షాలు, వరదల నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్తు పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో విద్యుత్తుశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా డిస్కం సీఎండీల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమీక్షలో ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఓఎస్డీ సురేందర్‌రెడ్డి, సింగరేణి సంస్థ సీఎండీ బలరాంనాయక్ పాల్గొన్నారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరద ప్రమాదాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. ఈ విషయమై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజానీకం 8 లోక్‌సభ స్థానాలిచ్చి బీజేపీకి ప్రాణం పోశారని, ఇప్పుడు ప్రజలు ఆపదలో ఉన్నందున వారిని ఆదుకోవాలని కోరారు. వర్షాలకు 14 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని, 16 మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంట, ఆస్తుల నష్టం సంభవించిందని మంత్రి తెలిపారు. వరదల వల్ల రూ.5,500 కోట్ల నష్టం జరుగగా, తక్షణ సాయంగా కేంద్రం రూ.2,000 కోట్లు విడుదల చేయాలని కోరారు.

తల్లుల దీవెనలతోనే బయటపడ్డాం: సీతక్క



హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): సమ్మక్క సారలమ్మ దీవెనలతోనే ప్రజలంతా సురక్షితంగా బయటపడ్డారని, గ్రామాల వైపు సుడిగాలి మళ్లితే పెను విధ్వంసం జరిగేదని రాష్ట్ర మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తంచేశారు. ములుగు అటవీ ప్రాంతంలో 500 ఎకరాల్లో చెట్లు నేలకూలడంపై పీసీసీఎఫ్, డీఎఫ్‌వో, స్థానిక అటవీ అధికారులతో బుధవారం సచివాలయంలో సమీక్షించారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవ తీసుకోవాలని, తిరిగి చెట్లు పెంచేలా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సీతక్క విజ్ఞప్తి చేశారు.

రెండు కేంద్ర బృందాలతో ఏరియల్ సర్వే

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు కేంద్ర బృందాలు త్వరలో పర్యటించి ఏరియల్ సర్వే చేస్తాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్‌లో మాట్లాడారు. ఖమ్మం, హైదరాబాద్, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో ఆస్తి, ప్రాణనష్టం జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. నష్టం వివరాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి వివరిస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నేరుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. బీజేపీ నాయకులు, శ్రేణులు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే నివేదిక ఆధారంగా కేంద్రం తగిన సాయం అందిస్తుందని వెల్లడించారు.

ముంచుకొస్తున్న వానముప్పు

- నేడు వాయవ్య బంగాళా ఖాతంలో అల్పపీడనం
- ఈ నెల 8 వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు
- ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): వర్షబీభత్సం నుంచి తెలుగు రాష్ట్రాలు తేరుకోకముందే మరోసారి భారీ వర్షాలని వాతావరణ శాఖ చేసిన ప్రకటనతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గురువారం వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, రాబోయే ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు కొన్ని జిల్లాలకు ఆరెంజ్, మరి కొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. గడిచిన 24గంటల్లో అత్యధికంగా సిద్దిపేట జిల్లా కోహెడలో 22.3 సెం.మీ వర్షపాతం నమోదయిందని టీజీడీపీఎస్ వివరించింది.

ఏపీకి మళ్లీ హెచ్చరికలు

వాతావరణ శాఖ ఏపీకి మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. కోస్తాంధ్ర, యానాం పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, రాగల 24 గంటల్లో వాయవ్య బంగాళాఖాతం ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణశాఖ కేంద్రం ప్రకటించింది. దీని ప్రభావంతో ఏపీలో గురువారం నుంచి 8వతేదీ వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

పరిపాలనపై సీఎం రేవంత్‌కు బోధించండి

బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ హితవు


హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): బాధ్యతాయుతమైన పరిపాలకుడు ఎలా ఉంటాడో సీఎం రేవంత్‌రెడ్డికి నేర్పాలని బీఆర్ఎస్ పార్టీ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ సూచించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ విషప్రచారం మానుకోవాలని బుధవారం ఆయన ఎక్స్ వేదికగా హితవుపలికారు. ప్రతిపక్ష నేత కనబడుటలేదని మెట్రో పిల్లర్‌పై కేసీఆర్ పోస్టర్ అతికించడంపై దాసోజు ఫైర్ అయ్యారు. నీచమైన, దారుణమైన ప్రయత్నానికి తెలంగాణ సీఎంవో ఒడిగట్టిందని విమర్శించారు. కేసీఆర్‌పై కన్నా వరద సహాయక చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ శ్రద్ధ పెట్టాలి కదా? అని ప్రశ్నించారు.



శరవేగంగా రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : భారీ వర్షాలతో వరంగల్-విజయవాడ మార్గంలోని ఇంటికన్నె-కేసముద్రం, తాడ్లపూసపల్లి-మహబూబాబాద్ స్టేషన్ల మధ్య 15 ప్రాంతాల్లో రైల్వే ట్రాకులు దెబ్బతిన్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. తాడ్లపూసపల్లి-మహబూబాబాద్ స్టేషన్ల మధ్య డబుల్ లైన్, ఇంటికన్నె-కేసముద్రం మధ్యలో సింగిల్‌లైన్ పునరుద్ధరించినట్టు చెప్పారు. ఈ ట్రాక్‌పై బుధవారం మధ్యాహ్నం గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను నడిపించినట్టు వెల్లడించారు. అలాగే వరంగల్-మహబూబాబాద్ మధ్య దెబ్బతిన్న రైల్వేట్రాక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సికింద్రాబాద్-విజయవాడ మధ్య నిలిచిపోయిన రైళ్లను యథావిధిగా నడిపించాలన్న లక్ష్యంతో పనులు కొనసాగుతన్నట్టు అధికారులు తెలిపారు. కాగా, సికింద్రాబాద్ నుంచి వెళ్లాల్సిన పలు రైళ్లను సౌత్ సెంట్రల్ రైల్వే రద్దు చేసింది. సికింద్రాబాద్-దర్భంగా స్టేషన్ల మధ్య ఈ నెల 10 నుంచి 17 వరకు రైళ్ల రద్దు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. గుంతకల్-చిక్‌జాజూర్ స్టేషన్ల మధ్య మరో 2 రైళ్లను ఈ నెల 8 నుంచి అక్టోబర్ 6 వరకు రద్దుచేసినట్టు వెల్లడించారు. మరోవైపు, అహ్మదాబాద్-తిరుచిరాపల్లి, ఓఖా-మధురై రైల్వేస్టేషన్ల మధ్య 4 ప్రత్యేక రైళ్లు నడుస్తాయని అధికారులు వెల్లడించారు.

'వరద' సాయానికి 'కొవిడ్' సర్టిఫికెట్!



వరద బాధితులకు కొందరు దాతలు సీఎం సహాయ నిధికి తోచిన సహాయాన్ని పంపించారు. అయితే వారిని అభినందిస్తూ ప్రభుత్వం నుంచి వచ్చిన సర్టిఫికెట్‌ను చూసి దాతలు అవాక్కయ్యారు. 'వరద' బాధితులకు సహాయం చేస్తే.. 'కొవిడ్-19'పై పోరాటానికి సాయం అందించినట్టు ప్రభుత్వం నుంచి అభినందన పత్రం అందింది. ఈ సర్టిఫికెట్లను కొందరు సోషల్ మీడియాలో పెట్టడంతో ఆ పోస్టులు వైరల్ అయ్యాయి. - హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ)

పొంగులేటికి నిరసన సెగ

- వరదలు తగ్గిన నాలుగు రోజులకొస్తారా ? అని నిలదీత
- సొంత నియోజకవర్గంలోనే ఎదురైన వ్యతిరేకత
- న్యాయం చేసే వరకు కారును కదలనివ్వమని పట్టు
- కాలనీలోకి వెళ్లకుండానే వెనుదిరిగిన మంత్రి
- ఆపదలో రాలేదు.. ఇప్పుడెందుకు వస్తున్నారు ?
- అధికారులను అడ్డుకున్న మధిర మున్సిపల్ కాలనీవాసులు


ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రామన్నపేటలో తమ వరద సమస్యలను మంత్రి పొంగులేటికి వివరిస్తున్న కాలనీవాసులు

ఖమ్మం రూరల్/మధిర, సెప్టెంబర్ 4: ఖమ్మం జిల్లాలోని మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చుక్కెదురైంది. సాక్షాత్తూ సొంత నియోజకవర్గంలోనే నిరసన సెగ తగిలింది. 'వరద తగ్గి నాలుగు రోజులయ్యాక ఇప్పుడొస్తారా ?' అంటూ నిలదీశారు. సత్వరమే తమకు సాయం అందించాలని డిమాండ్ చేశారు. మున్నేరు వరద ముంపునకు ప్రభావితమైన రామన్నపేట, దానవాయిగూడెం, తీర్థాల గ్రామాల్లో మంత్రి పొంగులేటి బుధవారం పర్యటించారు. తొలుత రామన్నపేట కాలనీకి మంత్రి కాన్వాయ్ రావడంతో స్థానికులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మూడు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చి కనీసం జీపు దిగకుండానే వెళ్లిపోయారని, కనీసం తమ బాధలు చూడలేదని విమర్శించారు. ప్రాణాలు అరచేత పట్టుకొని కట్టుబట్టలతో తాము బయట పడితే.. దర్జాగా జీపులో చేతులూపుకుంటూ వెళ్లిపోయారని దుయ్యబట్టారు. నాలుగురోజులయ్యాక మీరు వచ్చి కూడా అలాగే చేస్తున్నారని మండిపడ్డారు. మా ఇళ్లలోకి వచ్చి మా దుస్థితిని ఎందుకు చూడలేదని ప్రశ్నించారు. ఇదే క్రమంలో ఆయన వారి కాలనీలోకి ప్రవేశించబోగా కాలనీవాసులు అడ్డుకున్నారు. దీంతో కారు దిగిన మంత్రి పొంగులేటి.. వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అధికారులతో సత్వరమే సర్వే ప్రక్రియను పూర్తి చేయిస్తామని, సర్టిఫికెట్లు, పుస్తకాలు నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని అన్నారు. తడిసిన బియ్యం స్థానంలో సన్నబియ్యం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతులకు చర్యలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మంత్రి మాటలను విశ్వసించని బాధితులు.. తమకు న్యాయం జరిగే వరకు కారును కదలనివ్వబోమని భీష్మించారు. పరిస్థితిని గమనించిన పొంగులేటి.. కాలనీలో పర్యటించకుండానే వెనుదిరిగారు. అనంతరం ఆయన కాన్వాయ్ తీర్థాల వైపు వెళ్లిపోయింది.

మా కాలనీకి రావొద్దు..

వరదలతో నిరాశ్రయులమైన తమకు కనీసం సహాయక చర్యలు చేపట్టకపోవడంపై ఖమ్మం జిల్లా మధిర మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌నగర్, ముస్లిం కాలనీకి చెందిన బాధితులు అధికారులను బుధవారం అడ్డుకున్నారు. కాలనీకి మున్సిపల్ కమిషనర్‌తోపాటు తహసీల్దార్ రాంబాబు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ వీపీ గౌతమ్ వస్తున్నారని తెలుసుకున్న వరద బాధితులు వారిని నిలదీశారు. 'మీరు మా కాలనీకి రావొద్దు.. గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. నాలుగు రోజులుగా పట్టించుకోకుండా ఇప్పుడు వచ్చి ఏం చేస్తారని ప్రశ్నించారు. దీంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిపోయారు. దీంతో అక్కడికి చేరుకున్న బాధితులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బీఆర్ఎస్ నాయకుడు మొండితోక జయాకర్, సీపీఐ నాయకుడు బెజవాడ రవిబాబు వరద బాధితులను శాంతింపజేశారు. అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు.


పాలమూరు ప్రాజెక్టు పరిధిలోని వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్‌లో ముంపునకు గురైన పంప్‌హౌస్‌ను త్వరగా పునరుద్ధరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో నీటమునిగిన వట్టెం పంప్‌హౌస్‌ను ఆయన పరిశీలించారు. మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ప్రాజెక్టుల సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్‌సీ అనిల్‌కుమారన్, సీఈ వెంకటకృష్ణ ఉన్నారు. -నాగర్‌కర్నూల్/కోడేరు


జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలో పత్తిపొలంలోకి చేరిన వర్షపునీరు


మూసీ ప్రాజెక్టు ఏడు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కేన్స్ తరలిపోవడం వాస్తవం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): కేన్స్ టెక్నాలజీ సంస్థకు చెందిన అధునాతనమైన (ఓఎస్ఏటీ) యూనిట్ తెలంగాణ నుంచి గుజరాత్‌కు తరలిపోతుండటం నిజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ అంశానికి సంబంధించి తాను ట్వీట్ చేసిన తర్వాత సంబంధిత మంత్రి ప్రజలను తప్పుదోవ పట్టించేలా కేన్స్ సంస్థ తెలంగాణలోనే ఉంటుందన్నట్టుగా ప్రకటన చేశారని మండిపడ్డారు. గుజరాత్‌కు తరలిపోతున్న ఓఎస్ఏటీ యూనిట్‌ను కొంగర్‌కలాన్‌లోనే ఏర్పాటు చేసి ఉంటే సెమీ కండక్టర్ల రంగానికి హైదరాబాద్‌లో మంచి భవిష్యత్ ఉండేదని అభిప్రాయపడ్డారు. కీలకమైన ఓఎస్ఏటీ, పీసీబీ యూనిట్లు తరలిపోతున్నప్పటికీ ఏమీ జరగలేదన్నట్టుగా మంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని, అసమర్థ, గందరగోళ నిర్ణయాల కారణంగా రెండు పెద్ద ప్రాజెక్ట్‌లను కోల్పోతున్నామని విమర్శించారు. కేన్స్ సంస్థ పెట్టుబడుల విషయంలో ప్రజల ముందు నిజాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

సివిల్ సప్లయిస్‌లో భారీ అవినీతి

హైకోర్టులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పిల్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పౌరసరఫరాల కార్పొరేషన్ (టీజీసీఎస్సీఎల్)లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఖజానాకు రూ.1,100 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉన్నదని పేర్కొంటూ ఆ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వం వద్ద ఉన్న వడ్లను తక్కువ ధరతో మిల్లర్లకు విక్రయించడం, వారి నుంచి అత్యధిక ధరకు బియ్యాన్ని కొనుగోలు చేయడం వల్ల ప్రతి మెట్రిక్ టన్నుకు రూ.32,799 మేర ప్రభుత్వానికి నష్టం వస్తున్నదని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి, పౌరసరఫరాల కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ, కమిషనర్ తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ జరుపనున్నది.

ఐఐసీటీ ఆధ్వర్యంలో ఎకో పాలిథిన్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : ఫుడ్, ఫ్రూట్ ప్యాకింగ్‌కు అనువైన, పర్యావరణహితమైన పాలిథిన్(పాలిప్రొప్లీన్ కార్బొనేట్)ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు ఆవిష్కరించారు. సంస్థకు చెందిన పరిశోధకుడు జయరాముడు బృందం పర్యావరణహితమైన, మన్నికైన ప్యాకింగ్ ఉపకరణాలపై పరిశోధనలు చేస్తున్నారు. పాలిథిన్ కవర్లతో కలిగే దుష్పరిణామాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్యాకింగ్ అప్లికేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. సాధారణ పాలిథిన్ కవర్లతో పోల్చితే ఇందులో తేమ నిర్వహణ, యాంటీ రైపింగ్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. పీపీసీ ద్వారా భవిష్యత్తులో పండ్లు, ఆహార పదార్థాల నిల్వ కోసం వినియోగించే ప్యాకింగ్ ఉత్పత్తులు మారిపోనున్నాయని, దీంతో వాటి మన్నిక కాలం పెరుగుతుందని భావిస్తున్నట్టు చెప్పారు.

జూబ్లీహిల్స్‌లో ‘డైనమైట్స్’పై నోటీసులు

కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఉన్న కొండరాళ్ల తొలగింపునకు రేయింబవళ్లు పేలుడు పదార్థాలను వినియోగించడంపై దాఖలైన పిల్ పై హైకోర్టు స్పందించింది. రాత్రింబవళ్లు పేలుడు పదార్థాలను వినియోగిస్తుండటంపై పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించిం ది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలో క్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం దీనిపై బుధవారం విచారణ చేపట్టింది. ప్రతివాదులకు నో టీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన భూగర్భ గనుల శాఖ, పర్యావరణ మంత్రిత్వశాఖ, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శులు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, గనులశాఖ డైరెక్టర్, హైదరాబాద్ కలెక్టర్, జీహెచ్ఎంసీలకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. కొండరాళ్లను పగులగొట్టేందుకు పేలుడు పదార్థాలను వినియోగిస్తుండంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారంటూ పత్రికల్లో వచ్చిన వార్తను న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ చదివి ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన న్యాయమూర్తుల కమిటీ ఆ లేఖను పిల్‌గా స్వీకరించి విచారణ చేపట్టింది.

పచ్చని పల్లెల్లో ఫార్మా చిచ్చు

- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో 1983 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్
- బలవంతపు భూసేకరణపై తిరగబడుతున్న రైతులు
- రెవెన్యూ అధికారుల ఘెరావ్
- ఇప్పటికే నిమ్జ్ కోసం 9 వేల ఎకరాల సేకరణకు చర్యలు
- ఇప్పుడు ఫార్మాసిటీ పేరుతో మరో పిడుగు
- రోడ్డున పడనున్న వేల కుటుంబాలు



నాడు నిమ్జ్.. నేడు పార్మాసిటీ ముప్పు

సంగారెడ్డి సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ): పచ్చని పల్లెల్లో ఫార్మాసిటీ చిచ్చుపెడుతున్నది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై రైతులు, ప్రజలు భగ్గుమంటున్నారు. డప్పూరు, వడ్డీ, మాల్గి పరిధిలో 1,983 ఎకరాల్లో ఫార్మాసిటీ, లైఫ్‌సైన్సెస్ హబ్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఫార్మాసిటీ పేరుతో తమ భూములను బలవంతంగా లాక్కోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల ఫార్మా భూములను చూసేందుకు వచ్చిన అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రాజు, ఇతర రెవెన్యూ అధికారులను అడ్డుకుని ఘెరావ్ చేశారు. భూసేకరణను నిలిపివేయాలంటూ మంగళవారం ధర్నాకు దిగారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తున్నది.

జహీరాబాద్ నియోజకవర్గంలో మంజీరా నదికి సమీపంలో ఉన్న న్యాల్‌కల్ మండలం పచ్చని పంటలకు నెలవు. నల్లరేగడి భూముల్లో రెండు పంటలతో సంతోషంగా ఉన్న న్యాల్‌కల్ మండల రైతులపై మొదట నిమ్జ్ పిడుగుపడింది. నిమ్జ్ ఏర్పాటు కోసం రేజింతల్, న్యామతాబాద్, హద్నూర్, బసంత్‌పూర్, రుక్మాపూర్, ముంగి తదితర గ్రామాల్లో తొమ్మిది వేల ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఇప్పటికే సుమారు రెండువేల ఎకరాల భూ సేకరణ పూర్తయ్యింది. భూసేకరణ ప్రకియ కొనసాగుతున్నది. నిమ్జ్ భూసేకరణకు వ్యతిరేకంగా ఇప్పటికే రైతులు ఆందోళనచేయడంతోపాటు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి సర్కార్ న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇప్పటికే నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన న్యాల్‌కల్ మండల రైతులు తాజాగా ఫార్మాసిటీ ఏర్పాటుతో సారవంతమైన భూములను కోల్పోనున్నారు. హైదరాబాద్ సమీపంలో తలపెట్టిన అతిపెద్ద ఫార్మాసిటీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసి, న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటుపై స్థానికులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. హైదరాబాద్ సమీపంలో జీరో డిశ్చార్జ్ కంపెనీల ఏర్పాటుకు ఫార్మా కంపెనీలు ముందుకొచ్చిన నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి సమీపంలో కాకుండా న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం ఎవరి లాభం కోసం అనే చర్చ నడుస్తున్నది.

భూములు కోల్పోనున్న పేద, దళిత రైతులు

న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు 1,983 ఎకరాల భూ సేకరణ కోసం గత నెల 21, 23 తేదీల్లో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా 1,070 ఎకరాల పట్టా భూమిని, 912 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించనున్నారు. డప్పూరు గ్రామంలో 930 ఎకరాల పట్టా, 516 ఎకరాల అసైన్డ్‌భూమి, వడ్డి గ్రామంలో 61.30 ఎకరాల పట్టా, 220.23 ఎకరాల అసైన్డ్‌భూమి, మాల్గి గ్రామంలో 79.33 ఎకరాల పట్టా, 176.8 ఎకరాల అసైన్డ్‌భూమిని సేకరించనున్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో అసైన్డ్‌భూముల్లో పంటలు సాగు చేసుకుని జీవిస్తున్న 1,000కిపైగా పేద కుటుంబాలు భూసేకరణతో రోడ్డున పడనున్నాయి. ప్రస్తుతం ఫార్మాసిటీ కోసం సేకరిస్తున్న భూముల విలువ ఎకరాకు రూ.40 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుంది. రెండు పంటలు పండే ఇంత విలువైన భూముల్లో కాలుష్యకారకమైన ఫార్మా కంపెనీలకు ఇస్తే తమ బతుకులు ఏమి కావాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

> **భూములు ఇవ్వం**
>
> మాకు ఉన్నదే ఎకరం భూమి. దీనిని కూడా ఫార్మాసిటీకి లాక్కుంటే ఎలా బతకాలి? మా కుటుంబ జీవనం అస్తవ్యస్తమవుతుంది. అందుకే ప్రాణాలు పోయినా సరే భూములను ఇచ్చేది లేదు. ప్రభుత్వం ఫార్మాసిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.
>
> – బేగరి విఠల్, రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం

ప్రాణాలు పోయినా భూములిచ్చేది లేదు!

- ఫార్మాసిటీ నిర్వాసిత రైతుల కన్నెర్ర
- పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్బంధం



జీపీ కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపడుతున్న నాయకులు, భూబాధితులు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 4: తమకు తెలియకుండానే ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేపడుతున్నారని, ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో భూ బాధితులు, ప్రజలు అధికారులను నిర్బంధించారు. న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామ శివారులో ఏర్పాటయ్యే ఫార్మాసిటీ భూ బాధితులు, ప్రజలు బుధవారం డప్పూర్ పంచాయతీ కార్యదర్శి జైసింగ్‌ను పంచాయతీ కార్యాలయంలో గంటన్నరకు పైగా నిర్బంధించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఫార్మాసిటీకి సంబంధించి తనకు సంబంధం లేదని పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో ఆగ్రహించిన బాధితులు కలిసి ఆయనను నిర్బంధించారు. ఉన్నతాధికారులు వచ్చేదాకా విడిచేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. మండల ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్ చేరుకొని వారితో మాట్లాడారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వచ్చేదాకా ఇద్దరూ కదిలేది లేదని తెగేసిచెప్పారు. తమ జీవనాధారమైన భూములను ఫార్మాసిటీకి తీసుకొని తీరని అన్యాయం చేస్తున్న విషయం ముందే తెలిసినా తమకేందుకు చెప్పడం లేదని నిలదీశారు. వెంటనే ఎంపీడీవో సురేశ్ హద్నూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని నిర్బంధంలో ఉన్న ఎంపీడీవో, కార్యదర్శిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించగా బాధితులు, ప్రజలు అడ్డుకున్నారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు చేరుకుని నాయకులతో మాట్లాడారు. కలెక్టర్‌తో మాట్లాడేందుకు నిర్వాసితులు ఎప్పుడు వస్తారో చెప్పాలని, అప్పటిదాకా అధికారులు ఎవరూ ఇక్కడికి రారని చెప్పి ఎంపీడీవో, కార్యదర్శిని పోలీసులు విడిపించి తీసుకెళ్లారు. సమాచారం లేకుండా అధికారులు గ్రామాలకు రావద్దని నిర్వాసితులు ఎంపీడీవో, పోలీసులకు వినతిపత్రాన్ని అందజేశారు.

అర్చకుల వేతనాలకు బ్రేక్

- ధూప దీప నైవేద్యాలకు అంతరాయం
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులదీ అదే పరిస్థితి

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): అర్చకులకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం అందజేసిన వేతనాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. రాష్ట్రంలోని దాదాపు 13వేల పైచిలుకు ఆలయాల్లో అర్చకులు, అర్చక ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా 3,500, ధూప దీప నైవేద్య(డీడీఎన్) పథకం ద్వారా 9,771 ఆలయాల్లో వేతనాలు ఇవ్వాల్సి ఉన్నది. కేసీఆర్ హయాంలో క్రమం తప్పకుండా వేతనాలు అందుకున్న అర్చకులకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. దేవాదాయ శాఖ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో పనిచేస్తున్న సుమారు 100మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం రెండు నెలలుగా వేతనాలు అందలేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే ఇస్తామని చెబుతున్నారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని, ఆలయాల్లో ధూప దీప నైవేద్య కార్యక్రమాలు నిలిపివేయాల్సిన పరిస్థితి వస్తున్నదని అర్చకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రుణమాఫీ కోసం రైతుల ఆందోళన



రుణమాఫీ అందడం లేదంటూ బుధవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ సహకార సంఘం కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని అన్ని బ్యాంకులకు రుణమాఫీ వస్తే, తమకెందుకు రావడం లేదని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సుమారు గంటపాటు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. – రామాయంపేట

తాగునీటి కోసం మూడు జిల్లాల్లో నిరసనలు



మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంటలో కురుస్తున్న వర్షాలతో బోరుబావులు పూడుకుపోయి.. మోటర్లు కొట్టుకుపోయాయి. పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లు వచ్చినప్పుడు మహిళలు బిందెలతో యుద్ధం చేయాల్సి వస్తున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దతండావాసులు కూడా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. పది రోజులుగా బుడగజంగం కాల నీకి నీళ్లు రావడంలేదని వాపోయారు. – దేవరకద్రరూరల్ (చిన్నచింతకుంట)/మల్దకల్/పెద్దకొడప్‌గల్



ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో ధర్నా చేస్తున్న జేఏసీ నేతలు

‘విద్యుత్తు’ పదోన్నతులపై న్యాయవిచారణ చేపట్టాలి

విద్యుత్తు సౌధ మహాధర్నాలో జేఏసీ నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులపై న్యాయవిచారణ చేపట్టాలని బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో భారీ ధర్నా నిర్వహించారు. విద్యుత్తు సంస్థల్లో సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులను అమలుచేయకుండా కొన్ని ఏండ్లుగా కండీషన్ల పేరుతో పదోన్నతులు కల్పిస్తున్నారని, ఇది సరికాదని జేఏసీ చైర్మన్ కోడెపాక కుమారస్వామి ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల యాజమాన్యాలు 3,830 మందికి పదోన్నతులు కల్పించాయని, ఇది పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్ చొరవ తీసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ ధర్నాకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మద్దతు ప్రకటించారు. అనంతరం నేతలంతా జేఎండీ శ్రీనివాస్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కో చైర్మన్ ఆర్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో కన్వీనర్ సీ భానుప్రకాశ్, రాజేందర్, సోమయాజులు, విజయ్‌కుమార్, యాదగిరి, మారం శ్రీనివాస్, బ్రహ్మేందర్‌రావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల నిరసన



రెగ్యులర్ వీసీని నియమించాలని నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో బుధవారం విద్యార్థులు నిరసన చేపట్టారు. తమ 17 డిమాండ్లను నెరవేర్చాలంటూ క్యాంపస్‌లో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట ఆందోళన చేశారు. డిమాండ్లు నెరవేర్చేంత వరకు రోజూ ర్యాలీ నిర్వహించి నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. – బాసర

వివక్షకు పాల్పడితే దేశద్రోహులే: కేఎన్‌వీ

హైదరాబాద్, సెప్టెంబర్4 (నమస్తే తెలంగాణ): కుల వివక్షకు పాల్పడే వారిని దేశద్రోహులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు నాగరాజు బుధవారం ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రియల్‌ఎస్టేట్ పేరుతో ఎస్సీ, ఎస్టీల భూముల ఆక్రమణ, కుల బహిష్కరణ, లైంగికదాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వివక్షకు పాల్పడిన వారిని దేశద్రోహులుగా ప్రకటించేలా పార్లమెంట్‌లో చట్టం చేసేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పీఎం కిసాన్ లింక్‌తో ఫోన్ హ్యాక్

ములుగు రూరల్, సెప్టెంబర్ 4: ‘పీఎం కిసాన్ న్యూ రిజిస్ట్రేషన్ కేవైసీ’ పేరుతో వాట్సప్‌లో వస్తున్న లింక్‌తో మొబైల్స్ హ్యాక్ అవుతున్నాయి. వారం రోజులుగా వాట్సప్‌లోని గ్రూప్‌ల ద్వారా ఈ యాప్ వివరాలు వస్తున్నాయి. కొందరు పీఎం కిసాన్ కేవైసీ అనుకొని వివరాలు నమోదు చేసే క్రమంలో మొబైల్‌లోని ఇతర వాట్సప్ గ్రూపుల్లోకి యాప్ లింక్ ఫార్వర్డ్ అవుతున్నది. మొబైల్‌లోని వ్యక్తిగత డాటాతోపాటు బ్యాంకు అకౌంట్లు, పిన్ నంబర్లు, ఫోన్‌పే, గూగూల్‌పే వంటి యాప్‌ల పాస్‌వర్డ్‌లు దొంగిలించేందుకు కారణంగా నిలుస్తున్నది.

దళితులపై చిన్నచూపు!

- ఆకలినైనా సహిస్తా.. అవమానాన్ని భరించను
- ప్రొటోకాల్ వివాదంపై నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం
- పోలీసు అధికారులపై స్పీకర్‌కు ప్రివిలేజ్ మోషన్



హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో దళిత ఎమ్మెల్యేలకు అవమానాలు జరగకుండా చూడాలని, తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఖూనీ చేయొద్దని కాంగ్రెస్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. ఎమ్మెల్యేగా తన హక్కులను కాలరాసి, విధులకు ఆటంకపరిచిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం స్పీకర్‌ను కలిసిన ఆయన ప్రొటోకాల్ పాటించని పోలీసు అధికారులపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆకలినైనా సహిస్తా కానీ అవమానాన్ని భరించబోనని చెప్పారు. ఆగస్టు 30న భువనగిరిలో ఇరిగేషన్ శాఖ సమీక్షకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌ను కలిసేందుకు పోలీసులు తనను అనుమతించలేదని తెలిపారు. ఆ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరినట్టు తెలిపారు. వారిని పిలిచి విచారిస్తామని స్పీకర్ హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఈ విషయంలో ఉన్నతాధికారులను వదిలేసి కానిస్టేబుళ్లకే నోటీసులు ఇస్తున్నారని, దీనిని ఖండిస్తున్నట్టు ఎమ్మెల్యే వీరేశం తెలిపారు.

కరీంనగర్ సీపీ వ్యవహారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సంచలన వ్యాఖ్యలు



కరీంనగర్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): భువనగిరిలో దళిత ఎమ్మెల్యే వేముల వీరేశం(నకిరేకల్)కు పోలీసుల వల్ల జరిగిన ఘోర అవమానంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. దురహంకార పోకడలు ఉన్న పోలీసు అధికారులు అక్కడక్కడా ఉన్నారని, కరీంనగర్ సీపీ కూడా ఇదే తరహా పోకడలను అనుసరిస్తున్నారని ఆరోపించారు. మానకొండూర్ సీఐ పోస్టు ఖాళీగా ఉండడంతో సీఎం సహకారంతో నియమిస్తే దాన్ని కరీంనగర్ సీపీ రద్దు చేశారని వాపోయారు. అయినా పోస్టింగ్ తెచ్చుకున్న సీఐని, తాను కాదన్నా ఎలా పోస్టింగ్ తెచ్చుకున్నావంటూ సీపీ బెదిరిస్తున్నారని ఆరోపించారు. దళిత ఎమ్మెల్యే ఇంకో దళిత అధికారికి సీఐ పోస్టింగ్ వేయిస్తారా..? అనే చిన్నచూపు, దురహంకారమే సీపీ అభ్యంతరానికి కారణమని వాపోయారు. ఈ వ్యవహారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు.

రోడ్డెక్కిన కాంగ్రెస్ కార్యకర్తలు



ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను చేర్చుకోవద్దని డిమాండ్ చేస్తూ అధిష్ఠానానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డెక్కారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని సోమగూడెంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిష్ఠానానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నిరసన వ్యక్తం చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా, గుట్టుచప్పుడు కాకుండా పార్టీలో చేర్చుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ హైదరాబాద్‌లో చేరికల కార్యక్రమాన్ని రద్దు చేసుకోవడంతో ఆందోళన విరమించారు. – కాసిపేట

వానల్లో మండుతున్న ఇసుక!

- ధరలకు మళ్లీ రెక్కలు
- 2200కు చేరిన టన్ను ధర
- వర్షాలతో నిలిచిన సరఫరా

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో ఇసుక ధరలకు రెక్కలొచ్చాయి. టన్ను ఇసుక ధర మళ్లీ రూ.2,200 నుంచి రూ.2,500 వరకు ఎగబాకింది. గత ఆగస్టులో వర్షాల సందర్భంగా రూ.2,500కు చేరుకున్నప్పటికీ, వర్షాలు తగ్గాక ధరలు రూ.1,500కు దిగివచ్చాయి. ఇప్పుడు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మళ్లీ రూ.2,200కు చేరింది. కొన్నిచోట్ల రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ఇసుక రీచ్‌ల నుంచి ప్రతి నెలా 10 నుంచి 15 లక్షల టన్నుల ఇసుకను తవ్వితీస్తారు. వర్షాకాలంలో కొంత తక్కువగా, వేసవిలో కొంత ఎక్కువగా ఇసుకను తీయడం పరిపాటి. ఆగస్టు చివరి వారం నుంచి ఇప్పటివరకు వర్షాల వల్ల రీచ్‌ల వద్ద ఇసుక తీయడం సాధ్యం కాలేదు. దాదాపు వారం రోజులుగా ఇసుక తీయడం నిలిచిపోవడంతో స్టాక్‌యార్డ్‌ల వద్ద కూడా నిల్వలు అడుగంటిపోయాయి. వర్షాల వల్ల కొద్దిరోజులుగా 19 రీచ్‌లు మాత్రమే అందుబాటులో ఉండగా, ఇటీవలి వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదల కారణంగా అక్కడ కూడా ఇసుక తోడటం నిలిపివేశారు. టెండర్లు ఖరారై ఇసుక తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న మేడిగడ్డ ప్రాంతంలో నీటి ప్రవాహం నిలిచిపోయేవరకు ఇసుక తీయడం సాధ్యంకాదని ఇదివరకే అధికారులు తేల్చారు. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతించడం వల్ల మరో 25 రీచ్‌ల్లో ఇసుక తీసుకునే వీలున్నప్పటికీ నీటి ప్రవాహం వల్ల అక్కడ కూడా ప్రస్తుతం సాధ్యం కావడం లేదని అధికారులు తెలిపారు.



నీట మునిగిన ఇసుక రీచ్‌లతో ఇబ్బందులు

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మంచిర్యాల, ములుగు, పెద్దపల్లి తదితర ప్రాంతాల నుంచి అధికంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సరఫరా అవుతున్నది. ఈ ప్రాంతాలన్నీ ప్రస్తుత వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాలుగా మారిపోయాయి. ఎగువ ప్రాంతాల్లో కూడా కురుస్తున్న అధిక వర్షాల వల్ల నదులకు వరద పోటెత్తడంతో ఇసుక తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది.

ఈ ఏడాది 350 కోట్ల ఆదాయం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 85.62 లక్షల టన్నుల ఇసుక విక్రయాలు జరుగగా, వాటిపై టీజీఎండీసీకి రూ.350.57 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో 69.03 లక్షల టన్నుల విక్రయం ద్వారా రూ.280.70 కోట్ల ఆదాయం రావడం విశేషం. గత ఏడాదితో పోల్చుకుంటే సుమారు రూ.70 కోట్ల ఆదాయం అధికంగా వచ్చినట్టయ్యింది.

ఐదు నెలల్లో ఇసుక విక్రయాలు

నెల	ఇసుక (లక్షల టన్నులు)	ఆదాయం (రూ.కోట్లలో)
ఏప్రిల్	19.60	80.40
మే	19.13	78.35
జూన్	23.75	97.20
జూలై	13.04	53.47
ఆగస్టు	10.10	41.15
మొత్తం	85.62	350.57

వరద బాధితులకు అండగా బీఆర్ఎస్

ప్రజాప్రతినిధుల నెల జీతం వితరణ.. పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం

500 నిత్యావసరాల కిట్లు.. సిద్దిపేట ఐఎంఏ రూ.లక్ష సాయం : హరీశ్‌రావు



సిద్దిపేట/నారాయణరావుపేట/హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): వరద బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలిచింది. పార్టీ పరంగా బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నెల జీతాన్ని వరద బాధితులకు వితరణగా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'వరద బాధితులను ఆదుకోవాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల నెల జీతం విరాళం ఇవ్వాలని నిర్ణయించాం' అని ప్రకటించారు. ఎప్పుడూ ప్రజలకు తోడుండే బీఆర్ఎస్, ఇప్పుడు విలయం సృష్టించిన విపత్తులోనూ ప్రజల పక్షాన నిలబడిందని పేర్కొన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఎవరికి తోచిన రీతిలో వారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రేవంత్‌కు పాలనపై పట్టులేదు

సీఎం రేవంత్‌కు కక్షసాధింపు రాజకీయాలు తప్ప పాలనపై పట్టులేదని హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా నారాయణపేట మండలంలోని గోపులాపూర్‌లో తురకవానికుంట తెగి రైతు దేవయ్యకు చెందిన 2 ఎకరాల పంట పొలం నష్టపోయింది. హరీశ్‌రావు బుధవారం ఆ రైతు పొలాన్ని పరిశీలించి.. తక్షణ సహాయంగా రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో వరద బాధితులకు సహాయం చేద్దామని వెళ్తే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులకు పాల్పడ్డారని మండిపడ్డారు.సిద్దిపేట జిల్లావ్యాప్తంగా 700 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వివరించారు.సిద్దిపేట అమర్నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో ఖమ్మం వరద బాధితులకు 500 నిత్యావసర కిట్లు పంపనున్నట్టు తెలిపారు. గురువారం ఉదయం 6 లారీల్లో అవి బయలుదేరుతాయని వెల్లడించారు. సిద్దిపేట పట్టణ ఐఎంఏ తమవంతు సహాయంగా రూ.లక్ష విరాళం అందజేసిందని వివరించారు. సిద్దిపేటకు చెందిన చాలామంది వ్యాపారులు తమవంతుగా సహాయంగా వస్తువులు, నిత్యవసర సరుకులు ఇవ్వటానికి ముందుకు వచ్చారని చెప్పారు. అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి 13 ఏండ్లుగా అమర్‌నాథ్ యాత్రికులకు అన్నదానం చేస్తున్నదని, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నదని, ఇప్పటికే 10 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేసిందని తెలిపారు.

జస్టిస్ ఎన్వీ రమణ 10లక్షల విరాళం



- పలువురు ప్రముఖుల వితరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. న్యూఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌కు బుధవారం చెక్కును అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు సైతం జస్టిస్ ఎన్వీ రమణ రూ.10లక్షల ఆర్థికసాయం చేశారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ నుంచి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు రూ.కోటి చొప్పున సీఎం సహాయ నిధికి ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు రామోజీ గ్రూప్ రూ.5కోట్లతో 'ఈనాడు సహాయ నిధిని ప్రకటించింది. ఏపీలో వదర బాధితుల సహాయార్థం ఏపీ ఉద్యోగుల జేఏసీ రూ.120కోట్లు విరాళం ప్రకటించింది. భారత్ బయోటెక్ సంస్థ రూ.కోటి విరాళం ప్రకటించింది. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ఖాతాకు జమచేసినట్లు భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్ల, ఎండీ సుచిత్ర ఎల్ల ఓ ప్రకటనలో తెలిపారు.





పూర్తిగా తడిచి ఇంటి ముందు పోగుపడిన సామగ్రిని ఎలా తీసుకెళ్లాలో తెలియక దీనంగా చూస్తున్న ఖమ్మం కాల్వొడ్డుకు చెందిన వృద్ధురాలు, పక్కన ఖమ్మంలోని కాల్వొడ్డులో బురదతో నిండిన వీధి

4 రోజులైనా నరకమే

మొదటిపేజీ తరువాయి...

రోజులైన బురద బాధ తొలగలేదు. ప్రభుత్వం 10 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందిస్తున్నా కాంగ్రెస్ నాయకులు వారికి అనుకూలమైన వారికే వాటిని అందజేస్తున్నట్టు స్థానిక వరద బాధితులు ఆరోపిస్తున్నారు. నష్టపరిహారం అందించేందుక అధికారులు బాధితుల ఇళ్లకు వెళ్లి వారి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. బురదతో కూరుకుపోయి మట్టిపట్టిన వాహనాలను వాటి యజమానులు మరమ్మతుల కోసం షెడ్లకు తరలిస్తున్నారు. ఎఫ్‌సీఐ రోడ్డులో నిలిపి ఉన్న లారీల్లో బురద పట్టడంతో వాటిని అక్కడే నిలిపి మెకానిక్‌లతో మరమ్మతులు చేస్తున్నారు.



ఖమ్మం కాల్వొడ్డులో తడిచిన పనికిరాని సామగ్రిని రోడ్డుపై కుప్ప వేసిన కాలనీవాసులు



పేరుకే ముగ్గురు మంత్రులు

జిల్లాలో ముగ్గురు మంత్రులు పేరుకే ఉన్నారు. వారి వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు. భారీ వర్షాలు, వరదల గురించి అధికారులు మంత్రులకు చెప్పలేదా? చెబితే మంత్రులు మమ్మలను ఎందుకు పట్టించుకోలేదు? మంత్రుల బంధువులో, కుటుంబ సభ్యులో ఈ ప్రాంతంలో ఉంటే ఇలాగే చేస్తారా చెప్పండి? ఎన్నికలప్పుడు నీతి మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. మాకు కష్టాలు రాగానే కనీసం కన్పించడం లేదు.

-మంగ, కాల్వొడ్డు, ఖమ్మం



నిరుడు వరదల్లో.. కేసీఆర్ కాపాడారు

నిరుడు వరదలొచ్చినప్పుడు కేసీఆర్ కాపాడారు. వరదలు వస్తాయని ముందే చెప్పడంతో మా వస్తువులను మేం కాపాడుకోగలిగాం. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. వరదలు వస్తాయని ప్రభుత్వం చెప్పలేదు. అందు వల్లనే మాకు ఇంత నష్టం జరిగింది.

- చెరుకూరి జ్యోతి, పద్మావతినగర్, ఖమ్మం



రోడ్లను శుభ్రం చేయట్లేదు

వరద తగ్గి నాలుగు రోజులవుతున్నా రోడ్లను ఇంకా శుభ్రం చేయట్లేదు. నిరుడు వరదలోనే అప్పటి మంత్రి అజయ్‌కుమార్ ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. వరదల సమయంలో ఆయన కూడా మాతోనే ఉన్నారు. పునరావాస కేంద్రాల్లో మాతోనే తిన్నారు. ఇప్పటి నాయకులెవరూ అలా చేయలేరు.

-జయమ్మ, వెంకటేశ్వరనగర్, ఖమ్మం



చీకట్లోనే ఉంటున్నాం

4 రోజుల నుంచి చీకట్లోనే ఉంటున్నాం. మా ప్రాంతానికి అధికారులు సరిగా లేరు. అండగా ఉండే నాయకులూ లేరు. కొందరైతే అంతా అయిపోయాక వచ్చి ఫొటోలకు ఫోజులిస్తున్నారు. ముఖ్యమంత్రి ఇస్తామన్న రూ.పది వేల సాయం ఇంకా ఇవ్వనే లేదు. సరుకులు ఇస్తామన్నారు. అవి కూడా కొద్దిమందికే ఇస్తున్నారట.

-సత్యవతి, బొక్కలగడ్డ, ఖమ్మం



రూ.పది వేలు ఏవీ?

మా ఇంట్లో వస్తువులన్నీ పాడైపోయాయి. క్వింటాళ్ల కొద్దీ బియ్యం తడిసి ముద్దయ్యాయి. ముఖ్యమంత్రి ఇచ్చే రూ.పది వేలు దేనికి సరిపోతాయి? నాలుగు రోజులైనా గ్యాస్ ముట్టించలేదు. ఆకలితోనే ఉంటున్నాం. కనీసం నీళ్లు ఇచ్చేవాళ్లు కూడా లేరు.

-అప్పమ్మ, మోతీనగర్, ఖమ్మం

• ఆకలైతుంది సారూ...



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాంతండాలో సారు మాకు మరో పది రోజులు భోజనం పెట్టండి సార్ అని ప్రత్యేక అధికారి ప్రత్యేక అధికారి నర్సింహారావును వేడుకుంటున్న మహిళ



రావిరాలలో చెరువు కట్ట తెగి వరద గ్రామాన్ని ముంచెత్తడంతో అరుగుపై ఆరబెట్టిన తడిసిన పుస్తకాలు

పది రోజులు అన్నం పెట్టండి సారూ!

అధికారులను వేడుకుంటున్న వరద బాధితులు.. మానుకోటలో ఇంకా మానని వరదగాయం

ఇంకా తగ్గని బురద.. భరించలేని దుర్వాసన.. రైతు వేదికలోనే సీతారాంతండా బాధితుల బస



మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాలలో ట్యాంకర్ నుంచి నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

మహబూబాబాద్/నర్సింహులపేట/కురవి, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): 'వండుకునేందుకు పాత్రలు లేవు.. సరుకులు పెట్టుకునే స్థలంలేదు.. ముట్టిద్దామంటే గ్యాస్ పొయ్యి లేదు.. మరో పదిరోజులు అన్నం పెట్టండి సార్' అంటూ మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండలం సీతారాంతండాలోని ఓ మహిళ బుధవారం గ్రామానికి వచ్చిన ప్రత్యేకాధికారి నర్సింహారావును దీనంగా వేడుకున్నది. ఈ ఘటన వరద బీభత్సం సృష్టించి నాలుగు రోజులు గడుస్తున్నా అక్కడి ప్రజల దయనీయ పరిస్థితికి అద్దం పడుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించిన తర్వాత పది రోజులకు సరిపడానిత్యావసర సరుకులు పంపిణీ చేసినా వారికి వండుకునే పరిస్థితిలేదు. ప్రస్తుతం సీతరాంతండా ప్రజలకు సమీపంలోని లక్ష్యతండాలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రైతువేదికే దిక్కయ్యింది. అక్కడే అన్నం తింటూ బస చేస్తున్నారు. తండాలో దుర్వాసన భరించలేకుండా ఉంది. సీఎం వచ్చిపోయిన తర్వాత అధికారులు తూతూ మంత్రంగానే పనులు నిర్వహిస్తున్నారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో ఇప్పుడిప్పుడే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి ఒక కుటుంబానికి రెండు మూడు బిందెల కంటే ఎక్కువ ఇవ్వడం లేదు. కేసముద్రం, డోర్నకల్ తదితర మండలాల్లో పంటపొలాల్లో ఇసుక మేటలు వేసి ఎడారిలా కనిపిస్తున్నాయి. నర్సింహులపేట మండలంలో పెసరపంట చేనులోనే మొలకెత్తింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

రావిరాలలో మాజీ ఎంపీ కవిత..

వర్షాలకు నీట మునిగిన నెల్లికుదురు మండలం రావిరాల గ్రామాన్ని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత బుధవారం సందర్శించారు. వరద బీభత్సానికి కూలిన ఇండ్లు, కొట్టుకుపోయిన గొర్లు, ద్విచక్ర వాహనాలు, కట్ట తెగి చుక్క నీరులేని చెరువును పరిశీలించారు. గడప, గడపకూ తిరిగి బాధితులను అక్కున చేర్చుకుని వారి కన్నీళ్లను తుడిచి ఓదార్చారు. ఈ సందర్భంగా 150 బాధిత కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.



మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాలలో బాధిత కుటుంబాలను ఓదార్చుతున్న మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత

• రైతువేదికలే దిక్కు..



మహబూబాబాద్ జిల్లా లక్ష్యతండాలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రైతువేదికలో భోజనాలు చేస్తున్న సీతారాంతండా వరద బాధితులు. భారీ వర్షాలతో ఇల్లు మునిగి కట్టుబట్టలతో వచ్చిన తమను కేసీఆర్ నిర్మించిన రైతువేదికే ఆసరాగా నిలిచిందని వరదబాధితులు కన్నీటిపర్యంతమయ్యారు.



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరి సూరారం చెరువు వద్ద పంట పొలాల్లో ఇసుక, కంకర మేటలు



గింజ కూడా చేతికిరాదు

రెండు ఎకరాల్లో పెసర పంట వేసిన. తెంపుదామనుకున్న సమయంలో వాన మొదలై పంట మొత్తం నేల పాలైంది. వరదకు తడిసి కాయ మొలకెత్తింది. రెండెకరాల్లో పుట్టెడు పెసళ్లు వస్తాయనుకున్నా. గింజ కూడా చేతికి వచ్చే అవకాశం లేదు. నాకు రూ. 60 వేల వరకు నష్టమైంది. ఇంత జరిగినా అధికారులు మా పంటలు చూసేందుకు రాలేదు.

- గుగులోతు పట్టాభి, దూప్యతండా, నర్సింహులపేట మండలం, మహబూబాబాద్ జిల్లా


జీఎస్‌డీపీలో తెలంగాణ టాప్

నిరుడు రాష్ట్రంలో 9.2% వృద్ధిరేటు • జాతీయ సగటు కంటే 1% అధికం • తర్వాతి స్థానాల్లో తమిళనాడు, రాజస్థాన్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ దూసుకెళ్తున్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) రాష్ట్ర సంపద (జీఎస్‌డీపీ) 9.2% వృద్ధి చెందింది. ఇది 8.2 శాతంగా ఉన్న జాతీయ సగటు వృద్ధిరేటు కంటే 1% అధికం. తద్వారా దేశంలో అత్యధిక ఆర్థిక వృద్ధిరేటు సాధించిన 10 పెద్ద రాష్ట్రాల జాబితాలో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రూ.7.9 లక్షల కోట్ల వాస్తవిక జీఎస్‌డీపీతో దేశంలో తొమ్మిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. రూ.15.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీతో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న తమిళనాడు నిరుడు 8.2 శాతం వృద్ధిరేటును సాధించగా.. ఏడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న రాజస్థాన్ 8 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. ఈ మూడు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి సేవల రంగమే ప్రధాన కారణం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో 63% వాటాను కలిగివున్న సేవల రంగం నిరుడు 11% వృద్ధిరేటును సాధించింది. రూ.24.1 లక్షల కోట్ల జీఎస్‌డీపీతో దేశంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న మహారాష్ట్రతోపాటు తమిళనాడులో నిరుడు సేవల రంగం వృద్ధిరేటు 9 శాతానికే పరిమితమైంది.

వ్యవసాయ రంగంలో మాంద్యం

ఎల్‌నినో ప్రభావం వల్ల నిరుడు చాలా రాష్ట్రాల్లో వ్యవసాయ రంగం వృద్ధిరేటు తగ్గినట్టు 'ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్' సీనియర్ ఆర్థిక విశ్లేషకుడు పారస్ జస్రాయ్ తెలిపారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధికి సేవల రంగంతోపాటు రియల్ ఎస్టేట్ రంగాలు.. తమిళనాడు ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ, నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాలు దోహదపడినట్టు పేర్కొన్నారు. 2020-23 వరకు మాంద్యాన్ని ఎదుర్కొన్న తయారీరంగం కూడా 2024లో పుంజుకున్నట్టు చెప్పారు.



ముంచెత్తిన వాన

- జోగుళాంబ గద్వాల, నిజామాబాద్ జిల్లాలో వర్షం
- పొంగిన వాగులు, వంకలు.. రాకపోకలు బంద్


నిజామాబాద్ నుంచి ఖానాపూర్ వెళ్లే మార్గంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు.. వాహనదారుల తిప్పలు

అయిజ/వడ్డేపల్లి/ఖలీల్‌వాడి/కంఠేశ్వర్, సెప్టెంబర్ 4 : జోగుళాంబ గద్వాల, నిజామాబాద్ జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి వాన దంచికొట్టింది. భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అయిజ, వడ్డేపల్లిలో, నిజామాబాద్ శివారులోని మాలపల్లి, ఆటోనగర్‌లో ఇండ్లలోకి నీళ్లు చేరాయి. అయిజ-ఎమ్మిగనూరు అంతర్రాష్ట్ర రహదారి డైవర్షన్ కొట్టుకుపోయింది. ఖానాపూర్, మానిక్ బండార్, రేడియోస్టేషన్ ప్రాంతాల్లోకి వరద పోటెత్తింది. ఖానాపూర్‌కు వెళ్లే రోడ్డుపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మానిక్‌భండార్ వద్ద నిజామాబాద్-ఆర్మూర్ ప్రధాన రహదారిపై భారీగా వరద చేరడంతో అధికారులు వాహనాలను మళ్లించారు. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 6.11 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా డొంకేశ్వర్‌లో 16.23 వర్షపాతం నమోదైంది.

ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతి

ములుగు రూరల్ : ములుగు జిల్లా ములుగు మండలం భూపాలనగర్(పందికుంట) గ్రామంలో ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామానికి చెందిన సున్నం ఆగమ్మ (75)ఇంటి గోడలు నానిపోయాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఇంటి గోడ కూలి మీద పడడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఆగమ్మ ఒంటరిగానే ఇంట్లో ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శ్రీశైలం కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో స్పార్క్

శ్రీశైలం, సెప్టెంబర్ 4 : శ్రీశైలం డ్యాం జెన్‌కో కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంలో శబ్దం వచ్చింది. దీనిపై చీఫ్ ఇంజినీర్ కాంతారావు స్పందిస్తూ మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో 7వ నెంబర్ జనరేటర్‌లో సాంకేతిక సమస్య తలెత్తి స్పార్క్ ఏర్పడినట్లు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం ఆ జనరేటర్ తోపాటు మిగతా ఆరు జనరేటర్ల ద్వారా విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మొద్దని సీఈ సూచించారు.


నేలకూలిన చెట్లను వీడియో తీస్తున్న పీసీసీఫ్ డోబ్రియాల్

సుడిగాలి బీభత్సం

ములుగు, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా సమ్మక్క-సారక్క తాడ్వాయి మండలంలోని మేడారం అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు తోడు గాలి దుమారానికి 16 విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపడ్డాయి. ఏటూరునాగారం అభయారణ్యంలో తాడ్వాయి నుంచి మేడారం వెళ్లే రహదారికి ఇరువైపులా 200 హెక్టార్లలో అటవీ ప్రాంతం పూర్తిగా ధ్వంసమైంది. దీనిపై మంత్రి సీతక్క బుధవారం 500 ఎకరాల్లో చెట్లు నేలకొరగడంపై పీసీసీఎఫ్, డీఎఫ్‌వోలతో సమీక్షించారు. లక్ష చెట్ల వరకు నేలకూలడంపై డ్రోన్ కెమెరాల సహాయంతో నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. తాడ్వాయి-మేడారం మధ్య అడవిలో జరిగిన విధ్వంసం రాష్ట్రంలోనే మొదటిదని పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ పేర్కొన్నారు. ధ్వంసమైన అటవీ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు.

వరదలో చిక్కుకున్న పశువుల కాపరులు

ఒకరు గల్లంతు, ఆరుగురు సురక్షితం • కిన్నెరసాని-ముర్రేడు వాగుల మధ్య ఘటన

పాల్వంచ రూరల్/సారపాక, సెప్టెంబర్ 4 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని దంతెలబోర గ్రామం వద్ద కిన్నెరసాని, ముర్రేడు వాగులు కలిసే చోట ఏడుగురు పశువుల కాపరులు బుధవారం వరద నీటిలో చిక్కుకున్నారు. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పాల్వంచ, బూర్గంపాడు మండలాల రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. పశువులకాపరుల్లో ఉప్పుసాకకు చెందిన జారే సాయికృష్ణ గల్లంతు కాగా, మిగతా వారు క్షేమంగా ఒడ్డుకు చేరారు. దంతెలబోర, గంగదేవి గుప్ప, ఉప్పుసాక ప్రాంతాలకు చెందిన దాదాపు 90మేకలు, పశువులు మేత కోసం దంతెలబోర నుంచి వాగులోకి వెళ్లాయి. ఆ సమయంలో కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి 53 వేల క్యూసెక్కుల నీరు వెళ్తున్నది. పశువులను తోలుకుని వచ్చేందుకు పశువుల కాపరులు వెళ్లిన సమయంలోనే ముర్రేడు వాగు ఉధృతి పెరిగి వారిని చుట్టుముట్టింది. సమాచారం తెలుసుకున్న దంతెలబోరవాసులు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. పశువుల కాపరుల్లో దంతెలబోరకు చెందిన తటుకుల కేదారి, దేశబోయిన ఈశ్వరయ్య, మంచినీళ్ల ముసలయ్య, గంగదేవిగుప్పకు చెందిన కుంజా భద్రయ్య, ఇర్పా నగేశ్, మసం కళ్యాణ్, ఉప్పుసాకకు చెదిన జారే సాయి కృష్ణ ఉన్నారు. కలెక్టర్‌తోపాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు సంగం వైపు, బూర్గంపాడు అధికారులు సోంపేట వద్ద బోట్లు, పడవలు, తాళ్ళతో రక్షణ చర్యలు ప్రారంభించారు. కిన్నెరసాని గేట్లను మూయించి నీటి విడుదలను ఆపేశారు. ముగ్గురు కాపరులు ఈత కొట్టుకుంటూ సంగం వైపు వస్తుండగా.. సాయికృష్ణ గల్లంతయ్యాడు. మరో నలుగురు తాళ్లసాయంతో బూర్గంపాడు మండలం సోంపేటకు చేరుకున్నారు. గల్లంతైన సాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఊహకందని విపత్తు

- మేడారం అటవీ ప్రాంతంలో చెట్లు కూలడంపై మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ ఆవేదన



హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలతో మేడారం అటవీప్రాంతంలో వేల సంఖ్యలో చెట్లు కూలిన ఘటనపై బీఆర్ఎస్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. 'భారీ వర్షాల కారణంగా మేడారం అటవీప్రాంతంలో లక్ష చెట్లు కూలిపోవడం ఊహకు సైతం అందని విషాదం. ఇది తీవ్రంగా బాధిస్తున్నది. పర్యావరణానికి జరిగిన పెను నష్టాన్ని తక్షణమే పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తు చేస్తున్నది. సుస్థిరమైన భవిష్యత్తు కోసం మొక్కలు నాటి, అటవీ ప్రాంతాన్ని పునరుద్ధరించేందుకు ఏకమవుదాం' అని ఆయన 'ఎక్స్'లో పిలుపునిచ్చారు.


ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం జిల్లాలో 7,500 ఇండ్ల మునక

బాధితులందరికీ అండగా ఉంటాం : తుమ్మల

ఖమ్మం, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కూసుమంచి : మున్నేరు వరదల కారణంగా ఖమ్మం నగరంలో సుమారు 5 వేల ఇండ్లు, ఇతర ప్రాంతాల్లో మరో 2,500 కలిపి మొత్తం 7,500 ఇండ్లు ముంపునకు గురయ్యాయని ప్రాథమికంగా అంచనా వేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదికలు వస్తాయని తెలిపారు. వరద బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఖమ్మంలోని కేఎంసీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గురువారం నుంచి బాధితుల ఖాతాల్లో నగదు జమచేస్తామన్నారు. బురద తొలగింపు కోసం 100 ట్రాక్టర్లు, 50 జేసీబీలు, 70 ట్యాంకర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్ దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ పాల్గొన్నారు.

గుండెను పిండేసే బాధ ఇది : పొంగులేటి

'నాయకన్‌గూడెంలో తమను రక్షించాలని నాకు కూడా ఫోన్ చేశారు. చాలా ప్రయత్నం చేశాం.. చివరకు వరదలో కొట్టుకుపోయారనే సమాచారం చాలా బాధ కలిగించింది.. గుండెను పిండేసింది' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నాయకన్‌గూడేనికి చెందిన యాకూబ్, సైదాబీ దంపతులు వరదల్లో చనిపోగా వారి కుటుంబసభ్యులకు కూసుమంచిలో ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ వారిని బతికించాలని చాలా ప్రయత్నాలు చేశామని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, వ్యవసాయ, పంచాయతీరాజ్‌శాఖ సహకారంతో ఒకరి ప్రాణాన్ని కాపాడుకోగలిగామని చెప్పారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 3: రాష్ట్రంలో ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. తుంగభద్ర డ్యాం వద్ద 10 గేట్లు, జూరాల డ్యాం వద్ద 15 గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం డ్యాంకు వరద తగ్గుముఖం పట్టింది. ఉదయం 6 గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగగా.. మధ్యాహ్నం తర్వాత గేట్లను మూసివేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. రెంజల్ మండలంలోని కందకుర్తి వద్ద వంతెనను తాకుతూ గోదావరి ఉధృతంగా ప్రవహించింది. దీంతో 41 గేట్లు ఎత్తి 3.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

రగులుతున్న జైనూర్

మొదటిపేజీ తరువాయి...

తగులబెట్టారు. తాళాలను పగులగొట్టి మరీ నిప్పు పెట్టడంతో దాదాపు 50కిపైగా షాపులు కాలి బూడిదయ్యాయి. రోడ్లపై కనిపించిన ద్విచక్రవాహనాలు, ఓ బొలెరో కారును కూడా దగ్ధం చేశారు. దీంతో ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు ఆయుధాలు, కట్టెలు, రాడ్లు తీసుకొని రోడ్లపైకి వచ్చారు. దీంతో మండల కేంద్రంలో కొద్దిసేపు భయానక వాతావరణం నెలకొన్నది. ఈ హింసను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తుండగా.. ఆందోళనకారులు వాటిని లాక్కొని పగులగొట్టారు. ఈ క్రమంలో ఓ ఎస్సై ఫోన్ కూడా ధ్వంసమైంది. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను రప్పించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొటి జైనూర్ మండలంలో 144 సెక్షన్ విధించారు. మండల కేంద్రంలో దాదాపు ఇంటికో పోలీసును మోహరించారు. పరిస్థితిని సమీక్షేందుకు మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్, రామగుండం సీపీ శ్రీనివాస్, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ బుధవారం జైనూర్‌కు వచ్చినట్టు సమాచారం.

బంద్‌కు పిలుపు.. ఆపై విధ్వంసం

జైనూర్ మండలంలోని దేవుగూడకు చెందిన ఆదివాసీ మహిళపై జరిగిన లైంగిక దాడి యత్నం, హత్యాయత్నం ఘటనలో ప్రభుత్వ, పోలీసుల తీరును నిరసిస్తూ తుడుం దెబ్బ సహా ఆదివాసీ సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఆదివాసులు ఇతర వర్గాల ఆస్తులపై దాడులు ప్రారంభించగా, ప్రతిదాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పరస్పర రాళ్ల దాడులతో ఆస్తుల నష్టం సంభవించింది. బంద్‌లో పాల్గొనేందుకు లింగాపూర్, సిర్పూర్, జైనూర్, ఉట్నూర్ మండలాల్లోని వివిధ గ్రామాలు, గూడేల నుంచి ఆదివాసులు, ఎక్కువ శాతం మంది మహిళలు జైనూర్ మండల కేంద్రానికి తరలివచ్చారు. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సోనూపటేల్‌గూడలో 200 మంది ఆదివాసులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని నిందితుడైన ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేశామని, చట్ట ప్రకారం శిక్షలు పడేలా చూసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివాసీలు డీఎస్పీతోనూ వాగ్వాదానికి దిగారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా ఇక్కడ స్థిరపడిన కొందరు ఆదివాసీ మహిళలపై దాడులు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అలాంటి వారందరినీ ఇక్కడి నుంచి పంపించేయాలని డిమాండ్ చేశారు. ఇది జరిగిన కాసేపటికే జైనూర్ మండల కేంద్రంలో వ్యాపార సముదాయాలకు నిప్పు పెట్టారు. రోడ్లపై నిలిపి ఉన్న వాహనాలను ధ్వంసం చేసి దగ్ధం చేశారు. పోలీసులు వారిని చెదరగొట్టడంతో ఆదివాసులు చుట్టు పక్కల ఉన్న గోండు గూడేల్లోకి వెళ్లిపోయారు. ఇంతలో పోలీసులు వచ్చారని తెలుసుకున్న ఆటోడ్రైవర్ వర్గం వారు ఆయుధాలతో రోడ్లపైకి వచ్చారు. ఎవరు కనిపించినా దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. ఎప్పుడేం జరుగుతుందోనని స్థానికులు భయంతో వణికిపోయారు. బుధవారం రాత్రి వరకు ఇదే వాతావరణం నెలకొంది. వార్తా సేకరణకు జైనూర్ వెళ్లిన మీడియా సిబ్బందిని పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు. ఇతరులెవరినీ జైనూర్‌లోకి రానివ్వడం లేదు. దాడుల నేపథ్యంలో విద్యుత్తు తీగలు కాలిపోయి తెగిపోవడంతో మధ్యాహ్నం రెండు గంటల నుంచి జైనూర్‌కు విద్యుత్తు సరఫరా నిలిచింది. వదంతులు, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఉద్రిక్త ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటుచేశారు. పోలీసు బలగాలు ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నాయి. ప్రార్థన స్థలాల వద్ద హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

మరో మహిళపై లైంగికదాడి?

ఆదివాసీ నిరసనకారుల దాడులకు ప్రతీకారంగా రాత్రివేళ మరో ఆదివాసీ మహిళపై లైంగికదాడి జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ మేరకు ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దీనిపై జైనూర్ ఎస్సై డీ సాగర్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా అలాంటిదేమీ జరగలేదని చెప్పారు. జైనూర్ విధ్వంసంపై పోలీసులు ఎలాంటి సమాచారాన్ని వెల్లడించడం లేదు. కావాలనే రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజులుగా ఈ విషయాన్ని దాచేందుకే ప్రయత్నిస్తున్నదని కొన్ని ఆదివాసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా.. సున్నితమైన విషయం కావడంతో ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఏవీ బయటికి చెప్పడం లేదని పోలీసువర్గాలు చెప్తున్నాయి.


జైనూర్ మండల కేంద్రంలో దగ్ధమవుతున్న వ్యాపార సముదాయాలు

పలుచోట్ల ఆదివాసీల ఆందోళన

గాదిగూడ మండలం లోకారి(కే)లోని కుమ్రంభీం చౌరస్తా వద్ద జరిగిన నిరసనలో తుడుందెబ్బ గాదిగూడ మండల అధ్యక్షుడు మడావి చంద్రహరి మాట్లాడుతూ.. ఆదివాసులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసిన నిందితుడికి నడిరోడ్డుపై ఉరిశిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు పెద్ద ఎత్తున చేపడుతామని హెచ్చరించారు. ఇంకా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి.. ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లో కూడా ఆందోళన కార్యక్రమాలు కొనసాగాయి.


జైనూర్ మండల కేంద్రంలో తిరుగుతున్న పోలీసు యంత్రాంగం

సంయమనం పాటించాలి: ఎస్పీ

బాధిత ఆదివాసీ మహిళకు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో వైద్యం కొనసాగుతుండగా, ప్రభుత్వ ఖర్చులు భరిస్తున్నదని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. వెల్లడించారు. బాధితురాలికి ఇప్పటికే లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించినట్టు తెలిపారు. ఆమెపై దాడి చేసిన నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఆదివాసీలతోపాటు ఇతర వర్గాలు ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జైనూర్‌లో 144 సెక్షన్ విధించామని, ప్రజలు గుంపులుగా చేరడం, ధర్నాలు, రాస్తారోకోలు చేయడం నిషిద్ధమని, ఎవరైనా ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

• నాలుగు గంటలు.. నరకయాతన


మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో కరెంట్ లేక రోగులు తీవ్రఅవస్థలు పడ్డారు. బుధవారం మధ్యాహ్నం నాలుగు గంటలపాటు నవజాత శిశువులు, రోగులు నరకయాతన అనుభవించారు. చీకట్లో బిక్కుబిక్కుమంటూ గడిపారు. టవల్ ఊపుతూ రోగులు, శిశువులకు కుటుంబసభ్యులు ఉపశమనం కలిగించారు. చీకట్లోనే వైద్యులు చికిత్స అందించాల్సిన దుస్థితి వచ్చింది. ఈ విషయంపై సూపరింటెండెంట్ హరీశ్చంద్రారెడ్డిని వివరణ కోరగా దవాఖాన పాత భవనం కావడంతో లేబర్ రూంలో కేబుల్ సమస్య వచ్చినట్టు తెలిపారు. – మంచిర్యాల అర్బన్

రాష్ట్రంలో పోలీసులు ఏం చేస్తున్నట్టు?

తెలంగాణలో మతపరంగా హైదరాబాద్ తరువాత అత్యంత సున్నితమైన ప్రదేశమది. రాఖీ పౌర్ణమినాడు ఓ ఆదివాసీ మహిళపై మరో వర్గానికి చెందిన ఆటోడ్రైవర్ లైంగికదాడికి ప్రయత్నించి, ఆపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాడు స్పృహ కోల్పోయిన బాధిత మహిళ మూడు రోజుల క్రితమే స్పృహలోకి వచ్చి తనకు జరిగిన ఘటనను వివరించింది. దీంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. అయినా స్థానిక పోలీసులు నిర్లిప్తంగానే ఉన్నారు. తమ జాతి మహిళపై జరిగిన ఘటనకు వ్యతిరేకంగా ఆదివాసీలు పెద్ద ఎత్తున నిర్వహించిన ఆందోళనను 'నమస్తే తెలంగాణ' ప్రముఖంగా ప్రచురిస్తూ.. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నట్టు హెచ్చరించింది. అయినప్పటికీ పోలీసులు ఎటువంటి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టలేదు. దీంతో ఒక్కసారిగా చిచ్చురేగింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో బుధవారం పెద్ద ఎత్తున హింస ప్రజ్వరిల్లింది. ఐదు గృహాలు అగ్నికి ఆహుతయ్యాయి. మండల కేంద్రంలో 50కిపైగా దుకాణాలు కాలి బూడిదయ్యాయి. ఓ స్కార్పియో సహా అనేక వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రత్యర్థి వర్గానికి చెందినవారు ఆయుధాలు, కట్టెలు, రాళ్లు తీసుకొని రోడ్లపైకి వచ్చారు. పరస్పరం రాళ్ల దాడులు, ఇండ్లు, షాపుల దగ్ధంతో జైనూర్ మండల కేంద్రం రణరంగాన్ని తలపించింది. ఇటీవలి కాలంలో మతకల్లోలాలకు దారితీసే ఘటనలు వరుసగా నాలుగు జరిగాయి. అయినప్పటికీ హింసను అరికట్టడంలో నిఘావర్గాల వైఫల్యం, పోలీసుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హైదరాబాద్, సెప్టెంబర్4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గడచిన నెలరోజులుగా చోటుచేసుకుంటున్న వరుస సంఘటనలు పట్టుతప్పుతున్న శాంతిభద్రతలకు దర్పణం పడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా, పోలీసు ఉన్నతాధికారుల వైఫల్యాలను బట్టబయలు చేస్తున్నాయి. గత పదేండ్లలో ఎన్నడూలేనివిధంగా వర్గవైషమ్యాలు చెలరేగిపోవటం ఆందోళన కలిగిస్తున్నది.

ఘటనలను తొక్కిపెడుతున్న వైనం..

తాజాగా జైనూర్‌లో చోటుచేసుకున్న సంఘటన రాష్ట్రంలో నెలకొంటున్న అశాంతి వాతావరణానికి అద్దం పడుతున్నది. పోలీసులు, నిఘా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఓ ఆదివాసీ మహిళపై వేరొక వర్గానికి చెందిన ఆటోడ్రైవర్ లైంగికదాడి, హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇదొక్కటే కాదు గత నెల మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లోనూ ఇరు వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అది మరువక ముందే ఓల్డ్ సిటీలో, ఆపై గోషామహల్ పరిధిలో రెండు వర్గాల ప్రజలు పరస్పరం దాడులకు తెగబడ్డారు. జైనూర్ తరహాలనే ఈ ఘటనలేవీ బయటకు రాకుండా పోలీసులు తొక్కిపెడుతున్నారు. తమ వైఫల్యాలన్ని కప్పిపుచ్చుకుంటున్నారు.

సీఎం, పోలీసుల వైఫల్యం..

ప్రస్తుతం వెలుగుచూస్తున్న వరుస సంఘటనలు రాష్ట్రంలోని నిఘా వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైపోయిందనే సంకేతాన్ని ఇస్తున్నది. ఇది ప్రధానంగా హోంశాఖను తన వద్దనే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ పరిపాలన వైఫల్యమేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. హోంశాఖపై సీఎం ఎన్నడూ పూర్తిస్థాయిలో సమీక్ష చేయలేదు. డీజీపీ సైతం శాంతి భద్రతల పరిస్థితులు, తాజాగా వెలుగుచూస్తున్న ఘటనలపై ఆరా తీసిన ఆనవాళ్లు కనిపించలేదు. నిఘా వ్యవస్థపై సమీక్ష అంతంతమాత్రమేనని సమాచారం. దీంతో దిగువ స్థాయి పోలీసు ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలను గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. సీనియర్ పోలీస్ ఆఫీసర్ల లోటు శాంతిభద్రతలు దిగజారిపోవడానికి కారణమని పోలీసు వర్గాలే బాహాటంగానే చర్చించుకుంటున్నాయి. సర్కారు స్పందించకపోతే తీవ్ర పరిణామాలు చోటుచేసుకునే అవకాశముంటుందని తెలంగాణ మేధావులు హెచ్చరిస్తున్నారు.

- అందమైన యువతీయువకులతో జాగ్రత్త: చైనా హెచ్చరిక
- ఉ.కొరియాలో వరదలను అడ్డుకోని 30 మందికి ఉరిశిక్ష
- ఉగ్రవాదుల చేతుల్లోకి నాటో ఆయుధాలు!
- వెయ్యి పేజీల ఫిర్యాదు పత్రాలతో పోర్లుదండాలు
- నిద్రపోతే రూ.10 లక్షల స్టైపెండ్: వేక్‌ఫిట్

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు



ఇక 9 క్యారెట్ల బంగారం!

గొలుసు దొంగతనాలు పెరుగుతున్న క్రమంలో త్వరలో తీసుకొచ్చే యోచనలో కేంద్రం › 7

10 గ్రాముల ధర రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు

గురువారం THURSDAY 5.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 92 ‖ వెల (Price) రూ.6.50

ఉపాధ్యాయ దినోత్సవం

గురువారం, సూర్యోదయం: 6-03, సూర్యాస్తమయం: 6-26. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: విదియ పగలు 12-22 వరకు. నక్షత్రం: ఉత్తరఫల్గుణి ఉదయం: 6-13 వరకు, తదుపరి హస్త. వర్జ్యం: పగలు 3-46 నుంచి సాయంత్రం 5-34 వరకు. రాహుకాలం: పగలు 1-47 నుంచి పగలు 3-19 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 10-10 నుంచి ఉదయం 11-00 వరకు, పగలు 3-07 నుంచి పగలు 3-57 వరకు. అమృతకాలం: రాత్రి 2-37 నుంచి రాత్రి 4-26 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

రగులుతున్న జైనూర్

విధ్వంసానికి దారితీసిన ఆదివాసీల బంద్

మహిళపై దాడి చేసిన నిందితుడి ఇంటికి నిప్పు

- ఆ ఇంటి సమీపంలోని మరో 4 ఇండ్లు దగ్ధం
- జైనూర్‌లో 50కి పైగా దుకాణాలు బూడిద
- పదుల సంఖ్యలో వాహనాలు ధ్వంసం
- 1/70ని అమలు చేయాలని డిమాండ్
- ఇతరులను వెళ్లగొట్టాలని పోలీసులకు వినతి
- ఆయుధాలు, కర్రలతో దిగిన ప్రత్యర్థి వర్గం
- ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు
- జైనూర్ మండల కేంద్రంలో 144 సెక్షన్
- పోలీసుల కస్టడీలో ఆటో డ్రైవర్
- బాధిత మహిళకు ప్రభుత్వ ఖర్చుతో చికిత్స
- లక్ష పరిహారం అందజేత: ఎస్పీ వెల్లడి

నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబర్ 4: ఆదివాసీ మహిళపై ఓ వర్గానికి చెందిన ఆటోడ్రైవర్ జరిపిన అమానుష దాడి కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో అగ్గి రాజేసింది. ఆదివాసీ మహిళపై లైంగికదాడి, హత్యాయత్నానికి పాల్పడిన ఆటో డ్రైవర్ ఇంటికి ఆదివాసీ ఆందోళనకారులు నిప్పు పెట్టారు. జైనూర్ మండలం కాశీపటేల్‌గూడలో జరిగిన ఈ ఘటనలో ఆ ఇంటి పక్కనున్న మరో నాలుగు ఇండ్లు కూడా దగ్ధమయ్యాయి. మండల కేంద్రంలో ఆదివాసీలు ఓ ప్రార్థనా మందిరంలోకి చొచ్చుకెళ్లి దానిని ధ్వంసం చేశారు. జైనూర్ ప్రధాని రహదారిపై ఉన్న వ్యాపార సముదాయాలను › 6వ పేజీలో



పోలీసులు ఏం చేస్తున్నట్టు?

- వరుసగా అవాంఛనీయ సంఘటనలు
- తొక్కిపెడుతున్న పోలీస్ ఉన్నతాధికారులు › 6
- రాష్ట్రంలో పట్టుతప్పుతున్న శాంతిభద్రతలు
- పదేండ్లలో ఎన్నడూ లేనంతగా వర్గవైషమ్యాలు
- సీఎం సహా ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం
- నెలరోజుల్లో వరుసగా 4 మతపరమైన ఘటనలు



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో దగ్ధమవుతున్న వ్యాపార సముదాయాలు. (ఇన్‌సెట్‌లో) ధ్వంసమైన బైకులు

- బురదలోనే బతుకు వెత



వర్షాలు కాస్తంత తెరిపినివ్వడంతో ఊపిరి పీల్చుకున్న ఖమ్మం వాసులు ఇంట్లోకి చేరిన బురద, చెత్తాచెదారాన్ని బుధవారం శుభ్రం చేసుకుంటూ కనిపించారు. నీళ్లు పోయినా వీధులన్నీ ఇంకా బురదమయంగానే దర్శనమిస్తున్నాయి

- ట్రాక్టర్ బియ్యం పారబోత



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాంతండాలో వరద నీటిలో తడిసి ముదిగిపోయిన బియ్యాన్ని పారబోసేందుకు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న జీపీ సిబ్బంది

4 రోజులైనా నరకమే!

అందని సర్కారు సాయం.. వరద బాధితుల దైన్యం

- ముఖ్యమంత్రి చెప్పిన 10 వేలు అందలేదు
- మురుగులోనే మగ్గుతున్న బతుకులు
- ఇంకా చీకట్లోనే ముంపు ప్రాంత కాలనీలు
- నిత్యావసరాల పంపిణీ అక్కడక్కడే
- ఖమ్మంలో 'మున్నేరు' బాధితుల అరిగోస
- జలదిగ్బంధంలో చిక్కుకున్న ఏడుగురు
- ఒకరు గల్లంతు.. ఆరుగురు సురక్షితం
- మానుకోటలోనూ మారని పరిస్థితులు
- నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం
- తెలుగు రాష్ట్రాలకు మరో వర్ష సూచన
- వాతావరణశాఖ ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ

ఖమ్మం, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం జిల్లా మున్నేరు పరీవాహక ప్రాంతాల ప్రజలకు ఇంకా వరద కష్టాలు తీరనేలేదు. ఇంట్లోని వస్తువులన్నీ కొట్టుకుపోయి, ఇంటి నిండా బురద పేరుకుపోయినా అంతులేని ఆవేదనను దిగమింగుకుంటూ ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. కాలనీలన్నీ చీకట్లోనే మగ్గిపోతున్నాయి. సర్కారు సహాయ సహకారాలు అందక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తామన్న రూ.10 వేల సాయం అందనే లేదు. ప్రధాన వీధుల్లోకి ట్యాంకర్లు వస్తున్నా లోపలి ప్రాంతాల్లోకి, కాస్త ఇరుకైన సందుల్లోకి వెళ్లడం లేదు. దీంతో ముంపు ప్రాంతాలైన గణేశ్‌నగర్, మాణిక్యనగర్, బొక్కలగడ్డ, మోతీనగర్ తదితర ప్రాంతాల్లో నాలుగు › 3వ పేజీలో

- మంత్రి పొంగులేటి నిలదీత



- వరదలు తగ్గిన నాలుగు రోజులకొస్తారా? అని ప్రశ్న
- సొంత నియోజకవర్గంలోనే ఎదురైన వ్యతిరేకత
- న్యాయం చేసే వరకు కారును కదలనివ్వబోమని పట్టు
- కాలనీలోకి వెళ్లకుండానే వెనుదిరిగిన మంత్రి › 5

సినిమా ఫంక్షన్ మూడ్‌లో సీఎం!

నిండా మునిగిన ఖమ్మం

- శనివారం రాత్రే రాష్ట్రానికి భారీవర్ష సూచన
- ఆదివారం ఉదయం నుంచే జిల్లాల్లో కుంభవృష్టి
- పర్యవేక్షణను పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి
- బాలకృష్ణ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు తయారు
- లైవ్ టెలికాస్ట్ విషయంలో నిర్వాహకులు, సావీ మీడియా మధ్య గొడవ.. సీఎం 'హర్ట్' › 5
- చంద్రబాబు రాకపోవడంతో ఫంక్షన్‌కు దూరం




బాధితులకు బాసటగా బీఆర్‌ఎస్ నేతలు

- ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల నెల వేతనం విరాళం
- బాధితులను అండగా నిలవాలని కేసీఆర్ నిర్ణయం

రేవంత్‌వి కక్షసాధింపు రాజకీయాలు

- ప్రతీకారమే తప్ప పాలనపై పట్టు లేదు
- సీఎం వైఫల్యానికి వరదలే ఉదాహరణ
- రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం › 3



అంగుళం ఆక్రమించినా వెంటనే కూల్చి పారేయండి

బీఆర్‌ఎస్‌పై దాడి చేస్తే ఖమ్మం ప్రజల బాధలు తీరుతయా?

- మీ ప్రభుత్వమే ఉందిగా, విచారణ జరిపించండి
- మా దవాఖాన ఖమ్మంకు ఉత్తర దిక్కున ఉన్నది.. దానికీ, మున్నేరు వరదలకు సంబంధమే లేదు
- ప్రభుత్వ భూమిలోనే పొంగులేటి ఎస్‌ఆర్ గార్డెన్
- వక్ఫ్‌బోర్డు భూముల్లో మరో మంత్రికి విల్లాలు
- మంత్రుల ఆక్రమణలను ఎప్పుడు కూలుస్తరు?
- సర్కార్‌కు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ సవాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): తాను ఇంచు ప్రభుత్వ భూమిని ఆక్రమించినా కూల్చేయండి అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున విచారణ జరిపి తొలగింపు చర్యలు చేపట్టవచ్చని పేర్కొన్నారు. బుధవారం ఆయన బీఆర్‌ఎస్ ప్రధాన కార్యాలయం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఖమ్మం పర్యటన సందర్భంగా › 2వ పేజీలో

ఏ బ్యాంక్‌నుంచైనా పింఛన్

- కేంద్రీకృత పెన్షన్ పేమెంట్ సిస్టమ్‌కు ఆమోదం › 8
- జనవరి 1 నుంచి అమల్లోకి
- కేంద్ర మంత్రి మాండవీయ

మీరేమీ రాజు కాదు!

- ఇది ఫ్యూడల్ వ్యవస్థ అంతకంటే కాదు › 7
- సీఎం అయితే ఏం చేసినా చెల్లుతుందా?
- ఐఎఫ్‌ఎస్ అధికారి పోస్టింగ్ విషయంలో ఉత్తరాఖండ్ సీఎం ధామీకి సుప్రీం తలంటు

ఇసుక ధరలకు మళ్లీ రెక్కలు

- 2200కు చేరిన టన్ను ధర › 11
- వర్షాలతో నిలిచిన సరఫరా

కాంగ్రెస్‌లో హైడ్రా చిచ్చు

ముఖ్యమంత్రి నిర్ణయంపై సొంత పార్టీలోనే వ్యతిరేకత

రేవంత్‌రెడ్డిపై మంత్రులు, ఎమ్మెల్యేల గుస్సా.. పార్టీలో రెండు గ్రూపులుగా విడిపోయిన నేతలు

- పార్టీలో కీలక నేతలు టార్గెట్‌గా రేవంత్ పావులు
- వాళ్లను లొంగదీసుకొనేందుకు 'హైడ్రా' ఎత్తులు
- హైడ్రా పేరుతో ఇతర పార్టీ నేతలకు బెదిరింపులు
- తనకు చెప్పడం లేదని సీనియర్ మంత్రి కినుక
- ఢిల్లీ చేరిన పంచాయితీ.. అధిష్ఠానానికి ఫిర్యాదులు
- సీఎం రేవంత్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఫోన్
- రాష్ట్రంలో ఏం జరుగుతున్నదంటూ మొట్టికాయలు
- సొంత పార్టీపైనే సీనియర్ నేత పల్లం రాజు విమర్శ



హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): హైడ్రా వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో కాకరేపుతున్నది. పెద్దల భవనాల కూల్చివేతతో మొదలైన హైడ్రా బుల్డోజర్ ఇప్పుడు సామాన్య జనంపైకి దూసుకురావటంతో పార్టీలో చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయం పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెంచుతున్నదనే ఆందోళన పార్టీవర్గాల్లో వ్యక్తమవుతున్నది. పార్టీకి చెందిన మెజార్టీ నేతలే హైడ్రాపై పెదవి విరుస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. ఒక్కొక్కరుగా గళం విప్పుతున్నారు. ఇప్పటికే పలువురు సీనియర్ మంత్రులు ఈ వ్యవహారంపై నేరుగా › 2వ పేజీలో



'కోర్టు ఆదేశాలా.. డోంట్‌కేర్'

- న్యాయస్థానాల స్టేలను సైతం లెక్కచేయని రేవంత్ సర్కార్
- సంచలనంతో ప్రజల దృష్టి మరల్చేందుకే కూల్చివేతల పర్వం
- నాడు అయ్యప్ప సొసైటీ కూల్చివేతల సమయంలో ఓ నీతి
- ఇప్పుడు సీఎం కుర్చీలో కూర్చున్న తర్వాత బుల్డోజర్ రీతి › 2
- ఒక్క కాంగ్రెస్ నేత అక్రమ నిర్మాణం జోలికీ వెళ్లని ప్రభుత్వం
- గండిపేట ఎఫ్‌టీఎల్‌లో నిక్షేపంగా పల్లంరాజు అక్రమ నిర్మాణం
- హైడ్రా కూల్చివేసిందంటూ సీఎం, బాకాపత్రిక తప్పుడు ప్రచారం



గద్వాల కలెక్టరేట్ ఎదుట గురుకుల పాఠశాల పార్ట్‌టైమ్ ఉద్యోగుల నిరసన

రాత్రికి రాత్రే రోడ్లమీద పడేస్తరా?

- అర్ధాంతరంగా తొలగిస్తే మా బతుకులు ఏం కావాలి?
- విద్యా సంవత్సరం మధ్యలో తీసేస్తే ఎక్కడికిపోవాలి?
- ఉత్తర్వులు రద్దుచేసి మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలి
- మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి
- ఎస్సీ గురుకుల సొసైటీ ఎదుట పార్ట్‌టైం టీచర్ల ధర్నా
- సెక్రటరీ తీరుపై టీచర్ల ఆగ్రహం.. హెచ్చార్సీకి ఫిర్యాదు
- హరీశ్‌రావును కలిసి గోడు వెల్లబోసుకున్న సిబ్బంది › 10
- అప్పటికప్పుడే సీఎం రేవంత్‌కు హరీశ్ బహిరంగ లేఖ

గురుకులాలను ధ్వంసం చేసే కుట్ర



- రేవంత్ పోకడతో దళిత పిల్లలే సమిధలు
- 2,000 మంది గెస్ట్ ఫ్యాకల్టీలు రోడ్డుపాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకోవద్దా?
- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ › 10

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు పింఛన్ బంద్

- బిల్లుకు హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఆమోదం
- ఫిరాయింపులపై సుఖు సర్కారు కఠిన వైఖరి
- పలు రాష్ట్రాల్లో మాత్రం ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్

సిమ్లా, సెప్టెంబర్ 4: ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించి అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యేలకు పింఛన్ ఇవ్వొద్దని హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యేలు అందరికీ ఇది వర్తిస్తుంది. ఫిబ్రవరిలో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి కాకుండా బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారనే కారణంతో హిమాచల్‌ప్రదేశ్‌లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. తర్వాత జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో ఈ ఆరుగురిలో ఇద్దరు మళ్లీ గెలవగా, నలుగురు ఓడిపోయారు. వీరి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు రాకుండా ఈ బిల్లును తీసుకొచ్చింది. పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా వ్యవహరిస్తున్నది. హిమాచల్‌ప్రదేశ్‌లో తమ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటు వేశారని › 7వ పేజీలో

అమెరికాలో ముగ్గురు హైదరాబాదీల మృతి

- డల్లాస్‌లో కారును ఢీకొన్న ట్రక్కు › 7
- గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన మృతదేహాలు

విద్యుత్తు సర్‌చార్జీలతో


పరిశ్రమలు విలవిల

ఒక్కో యూనిట్‌పై రూ.1.40 భారం • బకాయిలపై 18 శాతం వడ్డీ వసూలు • ఇలాగైతే నడపలేమంటున్న ఇండస్ట్రీ వర్గాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు దెబ్బకు పరిశ్రమలు విలవిల్లాడుతున్నాయి. సర్‌చార్జ్‌ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇష్టమున్నట్లు వడ్డిస్తుండటంతో పారిశ్రామిక వర్గాలు ఆందోళన చెందుతున్నారు. ఓపెన్ యాక్సెస్ విద్యుత్తుపై అదనపు సర్‌చార్జ్ పేరుతో ఒక్కో యూనిట్‌కు రూ.1.40 వసూలు చేస్తున్నారు. ఇక బకాయిలపై కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ పేరుతో 18 శాతం వడ్డీని ముక్కుపిండి వసూలు చేస్తుండటంతో పరిశ్రమవర్గాలు లబోదిబోమంటున్నాయి. పరిశ్రమలు ప్రభుత్వ సంస్థల నుంచే కాకుండా ప్రైవేటు కంపెనీల నుంచి ఓపెన్ యాక్సెస్ పద్ధతిలో విద్యుత్తు కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రస్తుతం ఓపెన్ యాక్సెస్ పద్ధతిపై నిషేధం ఉండగా, ఇప్పటికే ఈ విధానంలో విద్యుత్తును కొనుగోలు చేస్తున్న పరిశ్రమల నుంచి సర్‌చార్జ్‌తో పాటు స్టాండర్డ్ అడిషనల్ సర్‌చార్జ్ పేరుతో అదనంగా ఒక్కో యూనిట్‌పై రూ.1.40 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది పరిశ్రమలకు తలకుమించిన భారంగా మారింది. ఓపెన్ యాక్సెస్ విద్యుత్తు కొనుగోలుపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని, అదనపు సర్‌చార్జిని ఎత్తివేయాలని పరిశ్రమవర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. వివిధ కారణాలతో మూతపడిన పరిశ్రమల విద్యుత్తు బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఆ బకాయిలపై 18 శాతం వడ్డీ భారాన్ని మోపుతున్నారు. నష్టాలతో మూతపడిన చాలా పరిశ్రమలు ఇప్పుడు మళ్లీ ప్రారంభించుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ ముందుగా తమ బకాయిలు తీర్చాలని విద్యుత్తు సంస్థలు పట్టుబడుతున్నాయి. వన్ టైమ్ సెటిల్‌మెంట్ పద్ధతిని ప్రవేశపెట్టి విద్యుత్తు బకాయిలను పరిష్కరించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి.

విద్యుదుత్పత్తికి అనుమతించండి

ఐఎస్‌టీఎస్(ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టం) పథకం కింద కేంద్రం రూఫ్‌టాప్ సోలార్ ఎనర్జీకి భారీగా రాయితీలు అందిస్తున్నది. అయితే మన రాష్ట్రంలో రూఫ్‌టాప్ విద్యుత్తును ఒక మెగా వాట్ సామర్థ్యం వరకు మాత్రమే అనుమతిస్తున్నారు. కాగా, దీన్ని ఐదు మెగావాట్ల సామర్థ్యానికి పెంచుకునేందుకు వీలుగా తమకు నిరభ్యంతర ధృవపత్రం(ఎన్‌ఓసీ) ఇవ్వాలని పరిశ్రమాధిపతులు కోరుతున్నారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఓపెన్ యాక్సెస్ గ్రీన్ పాలసీకి సంబంధించి మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు. అలాగే, పరిశ్రమల్లో బాయిలర్ల ద్వారా విడుదలయ్యే వేడి వాయువుల (డబ్ల్యూహెచ్‌ఆర్‌బీ-వేస్ట్ హీట్ రికవరీ బాయిలర్స్)నుంచి విద్యుత్తు తయారుచేసుకునే అవకాశం కూడా కల్పించాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ వాయువులను చల్లార్చి గాలిలోకి వదలాల్సి వస్తున్నదని, దీనివల్ల అదనంగా నిర్వహణ భారం పడుతున్నదని చెబుతున్నారు. తమకు అనుమతిస్తే ఎవరి పరిశ్రమలో వారు కొంత మేరకు విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే వీలు కలుగుతుందని అంటున్నారు. విద్యుత్తుకు సంబంధించి వివిధ సమస్యలపై ఇటీవల తాము టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి వినతి పత్రం సమర్పించినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తమ వినతులు పరిష్కరించకుంటే మునుముందు పరిశ్రమలు కొనసాగించడం మరింత కష్టమవుతుందని వారు వివరించారు.



నేటి నుంచే ఏఐ గ్లోబల్ సమ్మిట్

హెచ్‌ఐసీసీలో రెండ్రోజులు అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై దేశంలో తొలిసారి జరుగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యమిచ్చేందుకు హైదరాబాద్ సిద్ధమైంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. రెండ్రోజులపాటు జరిగే ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి దాదాపు 2 వేల మంది ఐటీ రంగ నిపుణులు రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఏఐ సిటీ ప్రాజెక్టుపై ఈ సదస్సులో ప్రత్యేక ప్రకటన చేసే అవకాశం ఉన్నది. ఈ సదస్సులో భాగంగా ఏఐ స్టార్టప్ షోకేస్‌ను ప్రారంభించనున్నారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఇండియా-ఇండియా ఏఐ 2047' అనే అంశంపై నాస్కామ్ ప్రెసిడెంట్ దేబాంజీ ఘోష్ కీలక ప్రసంగం చేయనున్నారు. 'మేకింగ్ జనరేటివ్ ఏఐ రియల్ ఫర్ భారత్' అనే అంశంపై చర్చించనున్నారు. దాదాపు 25 అంశాలపై ఐటీ రంగ నిపుణులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, వెంచర్ క్యాపిటలిస్టులు ప్రసంగించనున్నారు.



ప్రతి ఒక్కరికి కృత్రిమ మేథస్సు

'ప్రతి ఒక్కరికి కృత్రిమ మేథస్సు' అనే ఇతివృత్తం (థీమ్)తో నిర్వహించనున్న ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన ఏఐ రంగ ప్రముఖులు, సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఏఐ రంగం అభివృద్ధికి దోహదం చేసే ఆలోచనలను పరస్పరం పంచుకోవడంతో పాటు భవిష్యత్తు అవకాశాలు, కొత్త ఆవిష్కరణలపై చర్చించనున్నారు. హైదరాబాద్‌లో నిర్మించనున్న ఫోర్త్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిష్ఠాత్మకంగా ఏఐ సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రసంగించనున్నారు. రాష్ట్రాన్ని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు, ప్రపంచ దిగ్గజ సంస్థల నుంచి పెట్టుబడులను ఆహ్వానించేందుకు ఈ సదస్సు వేదికగా నిలవనున్నది. ఏఐ రంగంపై రోడ్ మ్యాప్‌ను ఈ సదస్సులో విడుదల చేయనున్నారు.

ఈ-జెన్‌సిస్‌లో నాట్కోకు వాటా


హైదరాబాద్, సెప్టెంబర్ 4: అమెరికాకు చెందిన బయోఫార్మా ఈ-జెన్‌సిస్‌కు చెందిన 40 మిలియన్ల షేర్లను కొనుగోలు చేసింది నాట్కో ఫార్మా. ఇందుకోసం సంస్థ 8 మిలియన్ డాలర్ల(రూ.70 కోట్లకు పైగా) నిధులు వెచ్చించింది. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్, కాలేయ వైఫల్యాలకు సంబంధించి ఔషధాల తయారీలో ఈ-జెన్‌సిస్ అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నది.

సెబీ చీఫ్‌పై ఉద్యోగుల ఫిర్యాదు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీలో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. సెబీ చీఫ్‌పై ఏకంగా ఉద్యోగులు ఆర్థిక మంత్రిత్వ శాఖ వద్ద మొరపెట్టుకున్నారు. సమావేశాల్లో అరవడం, తిట్టడం, బహిరంగంగా అవమానించడం, అనవాయితీగా మారిపోయిందని ఆగస్టు 6న రాసిన లేఖలో పేర్కొన్నారు. గ్రూపు సభ్యులపై అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి నిమిషం టీం సభ్యుల కదలికలను పర్యవేక్షిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. మానసికంగా కుంగిపోతున్నామని, వర్క్-లైఫ్‌ని బ్యాలెన్స్ చేయలేకపోతున్నామని వెల్లడించారు. మేనేజ్‌మెంట్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేకనే ఆర్థిక మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్లు వెల్లడించారు.

ఏ బ్యాంక్ నుంచైనా పింఛన్

దేశవ్యాప్తంగా పెన్షనర్లకు ఊరట
కేంద్రీకృత పెన్షన్ పేమెంట్ సిస్టమ్‌కు ఆమోదం
వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి
కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాండవియా



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: పెన్షనర్లకు శుభవార్త. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) నిర్వహిస్తున్న ఉద్యోగుల పింఛన్ పథకం (ఈపీఎస్) 1995లో ఉన్న పెన్షనర్లు త్వరలో దేశవ్యాప్తంగా ఏ బ్యాంక్ లేదా శాఖ నుంచైనా తమ పెన్షన్‌ను తీసుకోవచ్చు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ సదుపాయం అమల్లోకి వస్తుందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా బుధవారం ప్రకటించారు. ఈ మేరకు ఈపీఎస్ 1995 కోసం ప్రతిపాదించిన కేంద్రీకృత పెన్షన్ పేమెంట్ సిస్టమ్ (సీపీపీఎస్)కు మాండవియా నేతృత్వంలోని ఈపీఎఫ్‌వో ట్రస్టీల సెంట్రల్ బోర్డు ఆమోదం తెలిపినట్టు కార్మిక మంత్రిత్వ శాఖ సైతం ఓ ప్రకటన విడుదల చేసింది.

పింఛన్ కోసం తిప్పలుండవు

'సీపీపీఎస్ ఆమోదం ఈపీఎఫ్‌వో ఆధునికీకరణలో ఓ కీలక మైలురాయి. దేశంలోని ఏ బ్యాంక్ నుంచైనా లేదా ఏ బ్యాంక్ శాఖలోనైనా తమ పెన్షన్‌ను పొందే వెసులుబాటు పెన్షనర్లకు సీపీపీఎస్ ఇస్తున్నది. దీంతో పెన్షన్ల కోసం తిరిగే తిప్పలు, ఎదురుచూసే పరిస్థితులు, ఇతరత్రా సమస్యలు పింఛన్‌దారులకు తప్పనున్నాయి. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు ఎంతగానో కలిసి రానుంది. పదవీ విరమణానంతర జీవితం మరింత బాగుంటుంది. పింఛన్ పంపిణీని ప్రభావవంతంగా, వేగవంతంగా చేస్తున్నాం' అని సదరు ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈపీఎఫ్‌వో సభ్యులకు, పెన్షనర్లకు మరింత మెరుగైన సేవల్ని అందించే దిశగా తాము చేపట్టిన చర్యలు ఫలప్రదం అవుతున్నాయన్న ఆనందాన్నీ మాండవియా వ్యక్తం చేశారు.

ఆధార్ ద్వారా చెల్లింపులు

ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఏబీపీఎస్)కూ సీపీపీఎస్ మార్గం సుగమం చేయనుందని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ అంటున్నది. ఈపీఎఫ్‌వో చేపట్టిన ఐటీ ఆధునికీకరణ ప్రాజెక్ట్.. సెంట్రలైజ్డ్ ఐటీ ఎనబుల్డ్ సిస్టమ్ (సీఐటీఈఎస్ 2.01) తొలి దశ కింద సీపీపీఎస్‌ను తెచ్చామని, దీని ద్వారానే మలి దశలో ఏబీపీఎస్‌ను తెస్తామని చెప్తున్నది. నిజానికి ఇప్పుడున్న పెన్షన్ పంపిణీ ప్రక్రియ ఈపీఎఫ్‌వో జోనల్/ప్రాంతీయ కార్యాలయాల ఆధారంగా నడుస్తున్నది. కేవలం 3-4 బ్యాంకులతోనే ఇవి ప్రత్యేక ఒప్పందాలను చేసుకున్నాయి. దీంతో ఆయా బ్యాంకులు, శాఖల ద్వారానే పింఛన్ల పంపిణీ ఉంటున్నది. ఫలితంగా ఇతర బ్యాంకుల్లో ఖాతాలున్న పెన్షనర్లకు సమస్యలు తప్పడం లేదు. సీపీపీఎస్‌తో ఇక ఈ కష్టాలన్నీ తీరుతాయని కార్మిక శాఖ అంటున్నది. అంతేగాక పింఛన్ పంపిణీ కయ్యే ఖర్చూ తగ్గుతుందని ఈపీఎఫ్‌వో భావిస్తున్నది.

- సీపీపీఎస్‌తో ఈపీఎఫ్‌వోలో అడ్వాన్స్‌డ్ ఐటీ, బ్యాంకింగ్ టెక్నాలజీలు.
- పెరుగుతున్న డిజిటలైజేషన్‌తో దేశవ్యాప్తంగా పెన్షన్ పంపిణీ వేగవంతం.
- ఒక ఆఫీస్ నుంచి మరో ఆఫీస్‌కు పెన్షన్ పేమెంట్ ఆర్డర్లను బదిలీ అక్కర్లేదు.
- ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పెన్షనర్ వెళ్లినా ఏ రకమైన సమస్యలుండవు.
- బ్యాంక్ లేదా బ్యాంక్ శాఖలను మార్చుకోవాల్సిన అవసరం పెన్షనర్లకు రాదు.
- పెన్షన్ మొదలయ్యేటప్పుడు వెరిఫికేషన్ కోసం బ్యాంక్ శాఖలకు వెళ్లనక్కర్లేదు.
- పెన్షనర్ల ఖాతాలు ఏ బ్యాంక్ శాఖల్లో ఉన్నా అందులోనే పింఛన్ మొత్తాలు జమ.
- రిటైర్మెంట్ తర్వాత సొంత ప్రాంతాలకు వెళ్లే పెన్షనర్లకు గొప్ప ఊరట.
- సీపీపీఎస్‌తో 78 లక్షలకుపైగా ఈపీఎస్-95 పెన్షనర్లకు ప్రయోజనమన్న అంచనా.
- పెన్షనర్లకు యూజర్-ఫ్రెండ్లీ అనుభవం దక్కుతుందన్న ఆశాభావాన్ని కనబరుస్తున్న కార్మిక శాఖ.

తయారీ రంగంలో భారత్‌కు 'చిన్న' దెబ్బ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: జీడీపీ పెరుగుదలలో ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న భారత్.. తయారీ రంగంలో మాత్రం కొన్ని చిన్న దేశాల కంటే వెనుకబడిపోతున్నట్టు ప్రపంచ బ్యాంక్ తెలియజేసింది. రెడిమేడ్ దుస్తులు, తోలు, వస్త్ర, పాదరక్ష ఎగుమతుల్లో బంగ్లాదేశ్, వియత్నాంలు భారత్ కంటే మెరుగ్గా ఉన్నాయని పేర్కొన్నది. 2022లో భారత్ వాటా 3.5 శాతంగా ఉంటే.. బంగ్లాదేశ్ 5.1 శాతంతో, వియత్నాం 5.9 శాతంతో ఉన్నట్టు తెలిపింది. 2013లో భారత్ 4.5 శాతం వాటాను అందుకున్నా.. తర్వాతి కాలంలో ఇంకా దిగజారిందన్నది. ఇక చైనా నుంచి తరలిపోతున్న పరిశ్రమల్ని భారత్ అందిపుచ్చుకోవాలంటే పన్నుల భారం తగ్గించాలని, వాణిజ్య ఒప్పందాలనూ సవరించుకోవాల్సి ఉంటుందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. అప్పుడే మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా లక్ష్యాలు నెరవేరగలవన్నది.

బ్రెయిలీలో స్టార్ పాలసీ

చెన్నై, సెప్టెంబర్ 4: అంధులు, అంధత్వ సమస్యలున్నవారి కోసం ప్రముఖ ప్రైవేట్ రంగ ఆరోగ్య బీమా సంస్థ స్టార్ హెల్త్.. తొలిసారి బ్రెయిలీ లిపిలో ఓ బీమా పాలసీని బుధవారం ప్రారంభించింది. 'స్పెషల్ కేర్ గోల్డ్' పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ పాలసీతో ఆరోగ్య సమస్యలున్న అంధులకు సమగ్ర కవరేజీ లభిస్తుందని, తమ ఆరోగ్య బీమా సమాచారాన్ని వారు సొంతంగా తెలుసుకోవచ్చని స్టార్ హెల్త్ ఎండీ, సీఈవో ఆనంద్ రాయ్ అన్నారు. అలాగే ఆరోగ్య బీమా ఏజెంట్లకూ లాభించగలదన్న ఆశాభావాన్ని కనబర్చారు.

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్, పునియా పోటీ!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: భారత రెజ్లర్లు వినేశ్ ఫోగట్, భజరంగ్ పునియా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారు! బుధవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కలుసుకొని చర్చలు జరిపారు. త్వరలో జరుగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఇరువురు రెజ్లర్లు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయబోతున్నట్టు వార్తలు వెలువడ్డాయి. కాగా, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. 90 స్థానాలున్న హర్యానా అసెంబ్లీకి అక్టోబర్ 5న ఎన్నికలు జరగనున్నాయి. జులానా నియోజకవర్గం నుంచి వినేశ్ ఫోగట్, బాద్లి స్థానం నుంచి భజరంగ్ పునియా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయమై రాహుల్‌గాంధీతో వారు చర్చించినట్టు తెలిసింది.



మొసలి తాత హెన్రీ

ఆరుగురు భార్యలు.. 10 వేల సంతానం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: వయసు 123 ఏండ్లు.. పొడవు 16 అడుగులు.. బరువు 700 కేజీలు.. చూడగానే మినీ బస్సు సైజులో భారీ ఆకారంలో ఉన్న ఈ వర్ణన అంతా హెన్రీ అనే మొసలి తాత గురించి. తాత అని ఎందుకు పిలవాలంటే ప్రస్తుతం ప్రపంచంలో జీవించి ఉన్న మొసళ్లలో అత్యంత వృద్ధ మొసలిగా హెన్రీ రికార్డులకెక్కింది. అంతేకాదు, హెన్రీకి ఆరుగురు భాగస్వాములు, 10 వేల సంతానం అంటే ఆశ్చర్యమేస్తుంది. గత మూడు దశాబ్దాలుగా హెన్రీ స్కాట్ బర్గ్‌లోని ఒక మొసలి సంరక్షణ కేంద్రంలో నివసిస్తున్నది. దాని పొడవు, వయసును తెలుసుకుని సందర్శకులు అబ్బురపడుతుంటారు. మనుషుల్ని తినే దాని చీకటి గతంతో పోలిస్తే, ప్రస్తుతం ఆకర్షణగా ఉన్న జూలో దాని స్థితి దర్జాగా ఉందని చెప్పవచ్చు. యునెస్కో ప్రపంచ హెరిటేజ్ కేంద్రం బోట్స్‌వానాలో 1900లో పుట్టిన హెన్రీ అనంతరం భయంకరమైన దంతాలతో, భారీ ఆకారంతో భయపెట్టేది. అప్పట్లో బోట్స్‌వానాలో స్థానిక గిరిజనులను భయభ్రాంతులను చేసేది. అంతేకాక అక్కడి పిల్లలకు తీవ్ర ముప్పుగా ఉండేది. దాంతో రక్తం రుచి మరిగిన ఈ మొసలి బారి నుంచి రక్షించాలంటూ గిరిజనులు వేటగాడు సర్ హెన్రీ న్యూమన్‌ను వేడుకున్నారు. అయితే అతడు దానిని చంపకుండా జీవితాంతం బందీగా చేశాడు. ఆయనే ఆ మొసలికి హెన్రీ అని పేరుపెట్టాడు.

సీసా గుంజుడే గుంజుడు

- మద్యంపై ఖర్చులో తెలంగాణ టాప్
- లిక్కర్‌పై తలసరి ఖర్చు రూ.1,623
- సీఎంఐఈ అధ్యయనంలో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజలు సీసాలకు సీసాల మద్యాన్ని గుంజుతున్నారు. మద్యంపై ఖర్చు చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉండటమే దీనికి నిదర్శనం. ఈ విషయం కన్జూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వే(ఎస్పీహెచ్‌ఎస్) పేరిట సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) సంస్థ చేసిన తాజా సర్వేలో వెల్లడైంది. ప్రస్తుత ధరలను బట్టి ఏడాదికి తెలంగాణలో ఒక్కో పౌరుడు మద్యంపై సగటున ఖర్చు చేస్తున్న మొత్తం రూ.1,623గా ఉన్నట్టు వెల్లడైంది. తెలంగాణ తర్వాత ఏపీ, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు మద్యంపై ఎక్కువగా ఖర్చు చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. ఇదే సమయంలో బెంగాల్‌కు చెందిన వ్యక్తి ఏడాదికి సగటున మద్యంపై నాలుగు రూపాయలు మాత్రమే ఖర్చు చేస్తుండటం గమనార్హం.



మహిళలూ మద్యం ప్రియులే

మద్యం తాగే మహిళలు ఎక్కువగా ఉన్న టాప్-5 రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉన్నది. అరుణాచల్ ప్రదేశ్‌లోని మొత్తం మహిళా జనాభాలో 24 శాతం మంది మహిళలు మద్యం తాగుతున్నట్టు ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 నివేదిక వెల్లడించింది. అరుణాచల్ తర్వాతి స్థానాల్లో వరుసగా సిక్కిం (16.2 శాతం), అస్సాం (7.3 శాతం), తెలంగాణ (6.7 శాతం), జార్ఖండ్ (6.1 శాతం) రాష్ట్రాలు ఉన్నాయి

మద్యంపై ఎక్కువ ఖర్చు చేస్తున్న టాప్-5 రాష్ట్రాల పౌరులు

రాష్ట్రం	ఖర్చు (రూ.ల్లో)
తెలంగాణ	1,623
ఆంధ్రప్రదేశ్	1,306
పంజాబ్	1,245
ఛత్తీస్‌గఢ్	1,227
ఒడిశా	1,156

మద్యంపై తక్కువ ఖర్చు చేస్తున్న టాప్-5 రాష్ట్రాల పౌరులు

రాష్ట్రం	ఖర్చు (రూ.ల్లో)
పశ్చిమబెంగాల్	4
ఉత్తరప్రదేశ్	49
రాజస్థాన్	140
త్రిపుర	148
మధ్యప్రదేశ్	197

ఇంత కాఠిన్యం అవసరమా?

- నిందితులకు పత్రాలు నిరాకరించడం హక్కుల ఉల్లంఘన కాదా?
- ఈడీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని సుప్రీంకోర్టు కొన్ని ఇరుకునపెట్టే ప్రశ్నలు వేసింది. పీఎంఎల్‌ఏ (హవాలా) కేసులో స్వాధీనం చేసుకున్న పత్రాలను నిందితుడికి ఇవ్వడానికి నిరాకరించడం అతడి వ్యక్తిగత స్వేచ్ఛను, జీవించే ప్రాథమిక హక్కును ఉల్లంఘించడం కాదా? అని సుప్రీంకోర్టు ఈడీని ప్రశ్నించింది. కేవలం సాంకేతిక కారణాలతో పత్రాలు ఇచ్చేందుకు ఎందుకు నిరాకరించాలని, అంతా పారదర్శకంగా ఉండవచ్చు కదా అని అభిప్రాయపడింది. రెండేండ్ల క్రితం నమోదైన సరళా గుప్తా వర్సెస్ ఈడీ కేసుపై జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ ఏ అమానుల్లా, జస్టిస్ ఏజీ మసీహ్‌తో కూడిన ధర్మాసనం ముందు బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఈడీ పక్షాన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. 'పత్రాలున్నాయన్న సంగతి నిందితుడికి తెలిసే అడగొచ్చు. కానీ ఏదీ తెలియకుండా కేవలం ఊహాగానాలతో పత్రాలను కోరలేరు' అని అన్నారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. వ్యక్తిగత స్వేచ్ఛను, జీవించే హక్కును కల్పిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని ఇది ఉల్లంఘించడం లేదా? అని ప్రశ్నించింది. 'హవాలా కేసులో మీరు వేల సంఖ్యలో పత్రాలను స్వాధీనం చేసుకొని ఉండవచ్చు. కానీ వాటిలోని కేవలం 50 పత్రాలపైనే మీ కేసు ఆధారపడి ఉండవచ్చు. అప్పుడతడు తన నుంచి స్వాధీనం చేసుకున్న ప్రతిపత్రాన్ని అడగవచ్చు' అని పేర్కొంది. 'కాలం మారుతున్నది. మనకు, అవతలి పక్షం అడ్వకేట్లకు కూడా న్యాయం జరిగించాల్సిన బాధ్యత ఉన్నది. పత్రాలు అత్యంత రహస్యం వాటిని ఇవ్వలేమంటూ మనం నిందితుని పట్ల ఇంత కఠినంగా ఉండటం అవసరమా? ఇది న్యాయమా? గతంలో అత్యంత దారుణమైన కేసుల్లో కూడా బెయిల్ లభించేది. కానీ ఇప్పుడు మేజిస్ట్రేట్ కేసుల్లో కూడా బెయిల్ లభించడం లేదు. కాలం మారుతున్నది, ధర్మాసనంగా మనం అంత కఠినంగా ఉండవచ్చా?' అని జస్టిస్ ఓకా అభిప్రాయపడ్డారు. బెయిల్ పొందేందుకు లేదా తన కేసును కొట్టివేసేందుకు అవసరమైన పత్రాలను అడిగే హక్కు నిందితులకు ఉన్నది అని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో తీర్పును కోర్టు రిజర్వ్‌లో ఉంచింది.

అంబులెన్స్‌లో అఘాయిత్యం

రోగి భార్యపై డ్రైవర్ లైంగిక వేధింపులు
ప్రతిఘటించినందుకు భర్త ఆక్సిజన్ తొలగింపు

సిద్ధార్థనగర్, సెప్టెంబర్ 4: జబ్బుపడిన భర్తను అంబులెన్స్‌లో ఇంటికి తీసుకువెళ్తున్న మహిళపై డ్రైవర్, అతని సహాయకుడు లైంగిక వేధింపులకు పాల్పడటమే కాక, భర్త ఆక్సిజన్‌ను నిలిపి చంపేసిన అమానుష ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. జబ్బుపడ్డ భర్తకు లక్నోలో ఒక ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించిన ఒక మహిళ భర్తను డిశ్చార్జి చేయించి ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో సొంతూరుకు తీసుకువెళ్తుండగా, అంబులెన్స్ డ్రైవర్, అతని సహాయకుడు ఆమెను లైంగికంగా వేధించడం ప్రారంభించారు. దీనిని ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతో బస్తీ జిల్లాలో ఆమెను, ఆమె సోదరుడిని అంబులెన్స్‌లోంచి కిందకు దించేశారు. అలాగే ఆక్సిజన్ పైపు లాగేసి భర్తను కూడా రోడ్డుపై పడేసారు. పోలీసులు ఇంకో అంబులెన్స్ ఏర్పాటుచేయడంతో గోరఖ్‌పూర్ మెడికల్ కాలేజీకి తరలించారు. అయితే అప్పటికే భర్త మరణించినట్టు డాక్టర్లు ప్రకటించారు.

గ్రెటా థన్‌బర్గ్ అరెస్ట్

కోపెన్‌హెగెన్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడికి వ్యతిరేకంగా డెన్మార్క్‌లో నిరసనకు దిగిన పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హెగెన్ అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద గ్రెటా థన్‌బర్గ్ సహా 20 మంది నిరసన ప్రదర్శన చేపట్టారు. 'పాలస్తీనాలో పరిస్థితి దిగజారుతుండగా, కోపెన్‌హెగెన్ వర్సిటీ ఇజ్రాయెల్‌లోని విద్యా సంస్థలతో సహకారాన్ని కొనసాగిస్తున్నది' అని స్టూడెంట్ గ్రూప్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

స్కూల్ పనిష్మెంట్లపై విద్యార్థినుల నిరసన

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో ఉన్న ప్రభుత్వ సరోజినీ నాయుడు బాలికల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బడికి కనీసం ఒక నిమిషం ఆలస్యమైనా తమను పాఠశాలలోనికి రానివ్వడం లేదని, బయట రెండు గంటలసేపు నిల్చోబెడుతున్నారని ఆరోపించారు. పాఠశాల తరగతులు, ప్రాంగణాన్ని తుడవటం; గడ్డిని కత్తిరించడం వంటి శిక్షలు విధిస్తున్నారని చెప్పారు.


రాయదుర్గంలో హైడ్రా కూల్చివేతలతో నిరాశ్రయులైన బాధితులు


అమీన్‌పూర్ మున్సిపాలిటీ మండల పరిధి ఐలాపూర్ తాండ పంచాయతీ పరిధిలో కోర్టు వివాదంలో ఉన్న సర్వేనంబరు 462లో నిర్మాణాలను కూల్చిన అధికారులు


మెహిదీపట్నం డివిజన్ అయోధ్యనగర్ కాలనీలో కూల్చివేతలు చేపడుతున్న జీహెచ్ఎంసీ సర్కిల్ -12 టౌన్‌ప్లానింగ్ అధికారులు

‘కోర్టు ఆదేశాలా.. వియ్ డోంట్‌కేర్’

న్యాయస్థానాల స్టేలను సైతం లెక్కచేయని రేవంత్ సర్కార్.. సంచలనంతో ప్రజల దృష్టి మరల్చేందుకే కూల్చివేతల పర్వం

- నాడు అయ్యప్ప సొసైటీ కూల్చివేతల సమయంలో ఓ నీతి
- ఇప్పుడు సీఎం కుర్చీలో బుల్డోజర్ రీతి
- కాంగ్రెస్ నేతల జోలికి వెళ్లని ప్రభుత్వం
- గండిపేట ఎఫ్‌టీఎల్‌లో నిక్షేపంగా పల్లంరాజు అక్రమ నిర్మాణం
- హైడ్రా కూల్చివేసిందంటూ సీఎం, బాకా పత్రిక తప్పుడు ప్రచారం

శేరిలింగంపల్లి మండల పరిధిలోని రాయదుర్గం 1 నుంచి 41 వరకు ఉన్న సర్వే నంబర్లలో 37.08 ఎకరాల భూమి ఉన్నది. ఇది హైదరాబాద్ టెన్నెరీస్‌కు చెందినదని, దాని పూర్తి హక్కులు తమ వంశపారపర్యంగా వస్తున్నాయంటూ కొన్ని కుటుంబాలు అక్కడ ఇండ్లు కట్టుకొని ఉంటున్నారు. ఈ వ్యవహారం హైకోర్టు పరిధిలో ఉన్నది. హైకోర్టు స్టే కూడా కొనసాగుతుంది. కానీ ఇవేమీ పట్టించుకోకుండా గత నెల 26న తెల్లారుజామున ఉదయం 5 గంటలకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ, లిడ్‌క్యాబ్, టీఎస్ఐఐసీ అధికారులు సుమారు వంద మంది పోలీసు బలగాల మోహరింపుతో మూడు కుటుంబాలను నిర్బంధించి బుల్డోజర్లతో ఇండ్లను నేలమట్టం చేశారు. దీంతో ఆ కుటుంబాలు కట్టుబట్టలతో వీధినపడ్డాయి.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 462లో ఇటీవల రెవెన్యూశాఖ కొన్ని నిర్మాణాలను కూల్చివేసింది. వాస్తవానికి ఈ నిర్మాణాలపై హైకోర్టు స్టే ఉన్నది. ఇందుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు, స్టే ఉత్తర్వులను యజమానులు అధికార యంత్రాంగానికి కూడా సమర్పించారు. ఇవేమీ పట్టించుకోకుండా, నోటీసులూ ఇవ్వకుండా అధికారులు ఆ నిర్మాణాలను కూల్చివేశారు.

గత నెల 18న హైడ్రా గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలంటూ కొన్నింటిని కూల్చివేసింది. ఈ సందర్భంగా ఒక యజమాని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను సంప్రదించారు. హైకోర్టు స్టే ఉన్నప్పుడు నిబంధనల ప్రకారం ముందుగా నోటీసులు ఇవ్వాలి కదా సార్! అన్నారు. ‘ముందస్తు నోటీసులు ఇస్తే మీరు కోర్టుకు పోతారు కదా!’ అని కమిషనర్ సెలవిచ్చారట.

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ, అధికార యంత్రాంగం కక్షపూరితంగా వ్యవహరించినపుడు సామాన్యుడికి దిక్కయ్యేది న్యాయస్థానాలే. మరి.. అలాంటి న్యాయస్థానాల ఆదేశాలను సైతం రేవంత్ సర్కారు బేఖాతరు చేస్తుంది. ‘అంతా మా ఇష్టం.. కోర్టు స్టేలను సైతం ధిక్కరిస్తాం..’ అన్నట్టు ఇష్టానుసారంగా నిర్మాణాలను కూల్చివేస్తున్నది. యథా రాజా... తథా ప్రజా అన్నట్టు రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా, ఇతర శాఖలు సైతం ఒకవైపు నిర్మాణాలపై బుల్డోజర్లతో దాడిచేయడంతో పాటు న్యాయస్థానాల ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకపోవటం గమనార్హం. రాజ్యాంగబద్ధంగా న్యాయస్థానాలను ఆశ్రయించే ప్రాథమిక హక్కులను సైతం ప్రభుత్వం కాలరాయటం శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఆదేశాలను పరిగణనలోనికి తీసుకోకుండా ముందుకు పోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. సామాన్యుడు కోర్టు తలుపులు తట్టడమే నేరంగా.. ఆ దారులు మూసివేస్తాం! అన్నట్టు హైడ్రా, ప్రభుత్వ వైఖరి ఉండటం విపరీత పరిణామాలకు దారి తీస్తుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

నాడు ఒక నీతి... ఇప్పుడు మరో రీతి

‘సోమేశ్‌కుమార్ అంత పొడుగు.. ఇంత పొడుగు అంటడు. పొయ్యి అయ్యప్ప సొసైటీలో ఉన్నపళంగా రూపాయి.. రూపాయి.. జమ చేసుకొని ఉద్యోగస్థులు 200 గజాలు, 400 గజాల్లో ఇండ్లు కట్టుకుంటే జేసీబీలు, పెద్దపెద్ద మిషన్లు తీస్కపోయి నేలమట్టం చేసిండు. చట్టంలో అక్రమాలు జరిగినా క్రమబద్ధీకరించే (రెగ్యులర్) నిబంధన ఉన్నది. వాళ్లేం దోపిడీ చేయలే.. వాళ్లేం దేశద్రోహం చేయలే.. వాళ్లు అమాయకంగా కొనుక్కున్నరు. దాంట్లో కట్టుకున్నరు. అనుమతులు లేకపోతే రెగ్యులరైజ్ చేయటానికి నిబంధన ఉన్నది. నేలమట్టం చేయాల్సిన అవసరం ఉన్నదా సార్? ఇయాల ప్రభుత్వ భూముల్లో ఉంటే మీరు రెగ్యులరైజ్ చేయించుకోండి, బిల్డింగ్‌లు కట్టుకుంటే రెగ్యులరైజ్ చేయించుకోండి. నువ్వు అయ్యప్ప సొసైటీ కాడికి ఒక ఫార్ములా ఇచ్చేదుండె! కటాఫ్ డేట్ ఇచ్చేదుండె’



- **నాటి బీఆర్ఎస్ సర్కారుపై రేవంత్ చేసిన వ్యాఖ్యలివి. ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ ప్రభుత్వం అక్రమ నిర్మాణాల్ని కూల్చివేయడాన్ని తప్పుబడుతూ క్రమబద్ధీకరణ చేయొచ్చు కదా! అని ఉచిత సలహా ఇచ్చారు. ఎండీ రాధాకృష్ణ సైతం అందుకు వంత పాడారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నీతులు, ఉచిత సలహాలను రేవంత్ విస్మరించటం గమనార్హం. మరి ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కూల్చివేతలకు పాల్పడకుండా క్రమబద్ధీకరణ విధానాన్ని అవలంబించవచ్చు కదా అని సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.**

కూడబలుక్కున్నా నిజం దాగుతుందా?

రేవంత్ ప్రభుత్వం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నది. పైగా బాకాపత్రికతో అదే గాంభీర్యాన్ని ప్రచారం చేసుకుంటున్నది. గత నెల 18న గండిపేటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయంటూ పలు నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. ఖానాపూర్ గ్రామపరిధిలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు గెస్ట్ హౌస్, దానికి కొంతదూరంలో ఆయన సోదరుడికి చెందిన ఓరో స్పోర్ట్స్‌విలేజ్ ఉన్నది. హైడ్రా అధికారులు కేవలం ఓరో స్పోర్ట్స్ విలేజ్ నిర్మాణాల్ని కూల్చివేశారు. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టంచేశారు. కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సైతం తన ట్వీట్‌లో కూడా తన సోదరుడి నిర్మాణాన్ని కూల్చివేసినట్టు ప్రకటించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి, కొందరు మంత్రులు మాత్రం పల్లంరాజు గెస్ట్‌హౌస్‌ను కూల్చేసినట్టుగా చెప్తున్నారు. హైడ్రా అక్కడికి వెళ్లిన సమయంలో పల్లం రాజు ఢిల్లీ నుంచి ఫోన్ చేయించి తన నిర్మాణాన్ని కూల్చివేయకుండా ఆపించినట్టు ప్రచారం జరిగింది. అయినా పల్లం నిర్మాణాన్ని కూల్చివేసినట్టు రేవంత్‌రెడ్డి చెప్పుకోవడం విడ్డూరం. ఇప్పటికీ ఆయన నిర్మాణం నిక్షేపంగా అక్కడే ఉన్నది. రేవంత్ బాకాపత్రిక ఆంధ్రజ్యోతిలోనూ పదేపదే పల్లం రాజు నిర్మాణాన్ని కూల్చివేసినట్టు ప్రచారం చేస్తున్నారు. కానీ ఫొటోలు చూస్తే వాస్తవమేదో అర్థమవుతుంది.

కాంగ్రెస్ నేతల దరిచేరని కూల్చివేతలు

పారదర్శకంగా, రాజకీయ కక్షలకు తావులేకుండా కూల్చివేతలు చేపడుతున్నామని ఇటు హైడ్రా.. అటు రేవంత్ ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నది. కానీ.. హైడ్రాతో పాటు రెవెన్యూ, నీటిపారుదల శాఖలు జారీ చేస్తున్న నోటీసుల్లో ఏ ఒక్క కాంగ్రెస్ నేత అక్రమ నిర్మాణాలు లేకపోవటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జంట జలాశయాల పరిధిలో కాంగ్రెస్ మంత్రులు, నేతలకు చెందిన అక్రమ నిర్మాణాలపై పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ఆధారాలతో సహా బయటపడ్డా హైడ్రా, ఇతర సంబంధిత శాఖలు అటువైపు అడుగులు వేయకపోవటాన్ని ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

హైడ్రాది రాజకీయ లక్ష్యం!

హైదరాబాద్ పరిధిలో చెరువులు కాలగర్భంలో కలిశాయంటే అది సమైక్య పాలకుల పుణ్యమే. మూసీనదిని మురికికూపంగా మార్చిన ఘనత వారిదే. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో అధికారాన్ని వెలగబెట్టిన పార్టీలు రెండే రెండు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పాలిస్తే, మిగిలిన కాలం తెలుగుదేశం పార్టీదే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలన్నీ గత పదేండ్లలోనే వెలిసినట్టు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నది. రాజకీయ కోణంలోనే హైడ్రాను ఏర్పాటు చేశారన్న విమర్శలకు కొన్ని ఘటనలు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఒక విధానమంటూ లేకపోవడం హైడ్రా లక్ష్యంపై అనుమానాలు కలిగిస్తున్నాయి. ఒక ప్రాంతం, చెరువు, జలాశయాలు.. ఏదో ఒకటి ప్రామాణికంగా అక్రమ నిర్మాణాల్ని గుర్తించి రాజకీయాలకు అతీతంగా కూల్చివేతలు చేపట్టాలి. కానీ విధానమంటూ లేకుండా హైడ్రా కూల్చివేతలు చేపట్టడం, వివిధ శాఖలు కక్షపూరితంగా నోటీసులు జారీచేయడం అందరినీ విస్మయానికి గురిచేస్తున్నది.



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
కరీంనగర్	31.0°c	25.0°c
ఆదిలాబాద్	30.2°c	23.5°c
నల్లగొండ	29.0°c	24.0°c
వరంగల్	29.0°c	24.0°c
మహబూబ్‌నగర్	28.1°c	23.4°c
ఖమ్మం	28.0°c	23.0°c
హైదరాబాద్	28.0°c	23.0°c
రంగారెడ్డి	27.1°c	22.0°c
మెదక్	27.0°c	22.0°c
నిజామాబాద్	25.6°c	23.3°c

హైడ్రా పేరుతో బెదిరింపులు


నిందితుడు విప్లవ్

హైదరాబాద్ సిటీ బ్యూరో/ సంగారెడ్డి, సెప్టెంబర్ 4: హైడ్రా పేరు చెప్పి వసూళ్లకు పాల్పడిన ఫిజియోథెరపిస్ట్ బండ్ల విప్లవ్‌ను సంగారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ రూపేశ్ బుధవారం సంగారెడ్డిలో వివరాలు వెల్లడించారు. అమీన్‌పూర్‌లో విల్లా నిర్మాణాలు చేపట్టిన రాజేందర్ అనే యజమానిని సాయివిల్లాస్ కాలనీలో ఉండే బండ్ల విప్లవ్ రూ.20లక్షలు డిమాండ్ చేశాడు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తనకు దగ్గరని బెదిరించాడు. ఈ నెల 3న రాజేందర్, అతని పార్ట్‌నర్ మంజునాథ్‌రెడ్డి మరో ఇద్దరితో కలిసి బండ్ల విప్లవ్ సిన్హా ఇంటికి వెళ్లి రూ.2లక్షలు అడ్వాన్సుగా ఇస్తుండగా టాస్క్‌ఫోర్స్, అమీన్‌పూర్ పోలీసులు పట్టుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

హైడ్రా పేరుతో దందాలకు దిగితే జైలే: రంగనాథ్

హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలుకు పంపిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. బ్లాక్‌మెయిలింగ్‌లకు పాల్పడితే స్థానిక పోలీస్‌స్టేషన్, ఎస్పీ, సీపీలు, హైడ్రా కమిషనర్, ఏసీబీకి ఫిర్యాదు చేయాలని రంగనాథ్ సూచించారు.

లంచమడిగితే ఫోన్‌చేయండి: ఏసీబీ డీజీ

హైడ్రా పేరిట ఎవరైనా లంచమడిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ తెలిపారు. భూ, ఇండ్ల యజమానులకు గతంలో జారీ చేసిన నోటీసులను అడ్డుపెట్టుకొని కొందరు ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. నకిలీ నోటీసులు పంపించినా, ఫోన్‌కాల్స్ చేసినా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్18001064కు ఫోన్‌చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో హైడ్రా చిచ్చు

మొదటిపేజీ తరువాయి...

అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్టు తెలిసింది. దీనిపై స్పందించిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే.. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి క్లాస్ ఇచ్చినట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. ఏకపక్ష, విచ్చలవిడి నిర్ణయాలతో పార్టీకి, ప్రభుత్వానికి నష్టం చేయొద్దని గట్టిగానే చెప్పినట్టు తెలిసింది.

మాకు మాట మాత్రమైనా చెప్పలేదు

పార్టీలో ఏకపక్ష నిర్ణయాలతో ముందుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. హైడ్రా వ్యవహారంలోనూ ఏకపక్షంగానే నిర్ణయం తీసుకున్నట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది. పార్టీలో ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే దీన్ని అమల్లోకి తీసుకొచ్చినట్టు తెలిసింది. కనీసం మంత్రులకు కూడా సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు, మంత్రులు సీఎం నిర్ణయంపై గుర్రుగా ఉన్నారు. ఈ వ్యవహారాన్ని ఢిల్లీలోనే తేల్చుకోవాలని వాళ్లంతా నిర్ణయించి, అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. హైడ్రా విధానాలు తన శాఖ పరిధిలోకి వస్తున్నప్పటికీ ఆ శాఖ మంత్రిగా ఉన్న తనకు కనీసం మాట కూడా చెప్పలేదని ఓ సీనియర్ మంత్రి అధిష్ఠానం వద్ద తన ఆవేదనను వ్యక్తం చేసినట్టు సమాచారం. హైడ్రాతో సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదని ఓ మంత్రి వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

రాష్ట్రంలో ఏం జరుగుతున్నది: ఖర్గే క్లాస్!

హైడ్రా కూల్చివేతల్లో భాగంగా పల్లం రాజు తమ్ముడు ఆనంద్‌కు చెందిన స్పోర్ట్స్ విలేజ్‌ను కూల్చివేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన పల్లం రాజు నేరుగా ఖర్గేను కలిసి ఫిర్యాదు చేశారు. కష్టపడి సంపాదించిన డబ్బులతో తన తమ్ముడు ఏడెకరాల స్థలంలో స్పోర్ట్స్ విలేజ్‌ను ఏర్పాటు చేశారని, కనీసం నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు, సీనియర్ నేతలతో పాటు పల్లం రాజు కూడా ఫిర్యాదు చేయటంతో రేవంత్‌పై ఖర్గే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి.. ‘అసలు రాష్ట్రంలో ఏం జరుగుతున్నది?’ అని ప్రశ్నించినట్టు సమాచారం. హైడ్రా వంటి కీలక నిర్ణయం తీసుకున్నప్పుడు పార్టీ అధ్యక్షుడిగా తనకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని నిలదీసినట్టు తెలిసింది. రాహుల్‌గాంధీకి చెప్పి అనుమతి తీసుకొన్నానని రేవంత్ బదులిచ్చినట్టు తెలిసింది. రేవంత్ మాటలతో ఖర్గే విసుగెత్తి తన పక్కనే ఉన్న పల్లంరాజుతో ‘ఆయన తలతిక్కగా మాట్లాడుతున్నారు. మీ ఆగ్రహాన్ని ట్విటర్‌లో పెట్టండి’ అంటూ సూచించినట్టు తెలిసింది. దీంతో వెంటనే పల్లం రాజు.. ఖర్గేను కలిసిన ఫొటోను ట్విటర్‌లో షేర్ చేసి హైడ్రాతో రేవంత్ ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని ఎండగట్టారు. ఖర్గేతో వివాదాన్ని డైవర్ట్ చేసేందుకు తనకు అనుకూలమైన పత్రికలో దాని అధిపతి రాసే కాలమ్‌లో.. హైడ్రాకు రాహుల్‌గాంధీ సపోర్ట్ ఉన్నట్టు రాయించుకున్నారనే ప్రచారం జరుగుతున్నది. రేవంత్‌రెడ్డికి కొన్ని నెలలుగా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంటే దొరకటం లేదని, అలాంటప్పుడు హైడ్రాపై ఆయన అనుమతి ఏ విధంగా తీసుకుంటారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఖర్గేను తప్పుదోవ పట్టించేందుకు రాహుల్ పేరును సీఎం రేవంత్‌రెడ్డి ఉపయోగించుకున్నారనే ప్రచారం జరుగుతున్నది.


ఆగస్టు 27న ఖర్గేను కలిసిన పల్లంరాజు

ఆ నేతలే టార్గెట్‌గా హైడ్రా

ఎమ్మెల్యేగా ఉన్న ఓ మీడియా అధిపతి, కీలక మంత్రి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలకు దగ్గరగా ఉండే మంత్రి టార్గెట్‌గా హైడ్రాను తీసుకొచ్చినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు మంత్రి.. షర్మిల సహాయంతో ఢిల్లీలో తన పరపతిని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే అనుమానం రేవంత్‌రెడ్డిలో నెలకొన్నదని తెలిసింది. ఆ మంత్రికి ఆర్థిక బలం, నాడు అధిష్ఠానంతో దగ్గరగా మెలిగిన నేత రామసహాయం సురేందర్‌రెడ్డి కుటుంబంతో బంధుత్వం కూడా ఉన్నది. ఆ మంత్రి.. తనకు పోటీ అవుతారనే ఉద్దేశం రేవంత్‌రెడ్డిలో ఉన్నదని తెలిసింది. ఆయనను హైడ్రా ద్వారా లొంగదీసుకోవాలని భావించినట్టు తెలిసింది. ఇతర పార్టీలకు చెందిన నేతలను భయపెట్టేందుకూ హైడ్రాను బూచిగా చూపెడుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. చేరితే పార్టీలో చేరండి.. లేదంటే హైడ్రా బుల్డోజర్ దూసుకొస్తదని బెదిరింపులు చేస్తున్నారన్న గుసగుసలు పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి.

‘ఇప్పుడెందుకీ వ్యవహారం?’

హైడ్రా పేరుతో అక్రమ భవనాలను కూల్చివేయడంపై కాంగ్రెస్‌లోనే తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ముందుగా బడాబాబుల ఇండ్లపై హైడ్రా బుల్డోజర్ వెళ్లినప్పుడు పెద్దగా ఎవరూ స్పందించలేదు. కానీ ఇది పేదల ఇండ్లపైకి మళ్లటంతో పార్టీ నేతల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు, ప్రభుత్వ పనితీరుతో ప్రజల్లో వ్యతిరేకత నెలకొన్నదని, హైడ్రా వ్యవహారంతో ఇది మరింత పెరిగే ప్రమాదం ఉన్నదని వాళ్లంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్న పరిస్థితుల్లో హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చితే పార్టీ పరిస్థితి ఏమిటని నేతలు తలలు పట్టుకుంటున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో పలువురు మంత్రులు అధిష్ఠానం వద్ద మొరపెట్టుకొని.. ఇప్పుడీ తలనొప్పి అవసరమా! అని అన్నట్టు సమాచారం.

.. వెంటనే కూల్చి పారేయండి

మొదటిపేజీ తరువాయి...

సీఎం, మంత్రులు చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. అజయ్ ఆక్రమణల వల్లే ఖమ్మం మునిగిందంటూ సీఎం చేస్తున్న ఆరోపణల్లో పస లేదని పేర్కొన్నారు. తన దవాఖాన ఖమ్మం ఉత్తర దిక్కున ఉన్నదని, మున్నేరుకు దానికి అసలు సంబంధమే లేదని వివరించారు. హాస్పిటల్ నిర్మించి 25 ఏండ్లు అయిందని, ఆ ప్రాంతాల్లోకి చుక్క నీరు రాలేదని తెలిపారు. మున్నేరుకు వరద ఎక్కడి నుంచి వస్తున్నదో రేవంత్‌రెడ్డికి తెలుసా? అని ప్రశ్నించారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో రాజీవ్ గృహకల్ప, జలగంనగర్ కాలనీలు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్. చిత్రంలో బీఆర్ఎస్ నేతలు

రిటైనింగ్ వాల్‌కు కేసీఆర్ 650 కోట్లు ఇచ్చారు

పాకాల సరస్సు వద్ద పుట్టిన మున్నేరులో ఆకేరు, వైరా ప్రవాహాలు కలుస్తాయని, ఏటా మున్నేరు పొంగడం సహజమేనని పువ్వాడ వివరించారు. బీఆర్ఎస్ పాలనలో మున్నేరు వరద పొంగినప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి అక్కడి నుంచి తరలించేవారమని తెలిపారు. ఇప్పుడు వాతావరణ శాఖ హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తరలించడంలో విఫలమైందని విమర్శించారు. వరదలకు శాశ్వత పరిష్కారం లభించాలనే ఉద్దేశంతో మున్నేరుకు రెండువైపులా రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కారు రూ.650 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. వాల్ నిర్మాణ పనులను రేవంత్ ప్రభుత్వం పునరుద్ధరించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అజయ్‌ను అంతమొందిస్తే బాధలు పోతయా?

అజయ్‌ను అంతమొందిస్తే వరద బాధితుల బాధలు తీరుతయా? అని పువ్వాడ ప్రశ్నించారు. వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్తే కాంగ్రెస్ నేతలు తమపై దాడులు చేశారని, వారి పేర్లతోపాటు సీపీకి ఫిర్యాదు చేశామని చెప్పారు. ఖమ్మంలో తుమ్మల మనుషులే తమపై దాడి చేశారని చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం మోకాళ్లలోతు బురదలో దిగి బాధితులను పరామర్శిస్తే, ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం ఎన్నికల పర్యటనకు వచ్చినట్టు వచ్చి వెళ్లారని మండిపడ్డారు. మూడు రోజులైనా మున్నేరు వరద బాధితులకు విద్యుత్తు, తాగునీరు అందలేదని విమర్శించారు.

ఒక్కరినైనా ఎందుకు అరెస్టు చేయలేదు: గోపాల్

ఖమ్మంలో బీఆర్ఎస్ బృందంపై దాడి కాంగ్రెస్ గూండాల పని అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆరోపించారు. ఖమ్మంలో కబ్జాలన్నీ కాంగ్రెస్ నేతల చలవేనని విమర్శించారు. సీఎం రేవంత్‌కు దమ్ముంటే ముందు కాంగ్రెస్ నేతల అక్రమ కట్టడాలు కూల్చాలని సవాల్ చేశారు. వరద బాధితులను ఆదుకొనే చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం గూండాయిజాన్ని ప్రోత్సహించడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు.

దాడికి దర్శకుడు రేవంతే: బాల్క సుమన్

ఖమ్మంలో బీఆర్ఎస్ బృందంపై జరిగిన దాడికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం రేవంత్‌రెడ్డి, నిర్మాత పొంగులేటి అని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. చివరి రక్తపు బొట్టు వరకు తెలంగాణ ప్రజల కోసమే పనిచేస్తామని స్పష్టంచేశారు. ఇప్పటి వరకు ఈ ఘటనపై డీజీపీ స్పందించలేదని, పోలీసులు అతిగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నేతల కబ్జా చిట్టా బయటపెడతామని చెప్పారు. హైడ్రా పేరిట కొంతమందిని లక్ష్యంగా చేసుకొని కూల్చివేతలు చేస్తున్నారని ఆరోపించారు.

2 నెలలకు సరిపడా సరుకులివ్వాలి: నవీన్

మున్నేరు వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేలు ఏ మూలకు సరిపోవని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఇల్లు నీట మునిగిన కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వడంతోపాటు నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నాడు హెలికాప్టర్ తెప్పించాలని కోరిన సీతక్క నేడు మంత్రిగా ఉండి ఎందుకు తెప్పించలేకపోయారని ప్రశ్నించారు.

పొంగులేటి ఎస్ఆర్ గార్డెన్ సంగతేమిటి?

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి, ఫంక్షన్ హాల్ నిర్మించారని, జిల్లాకు చెందిన మరో మంత్రి వక్ఫ్‌బోర్డు భూములు ఆక్రమించి విల్లాలు కట్టారని పువ్వాడ అజయ్ ఆరోపించారు. పొంగులేటి నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను ఎప్పుడు కూల్చి వేస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. మంత్రి పొంగులేటి ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామంలో సర్వే నంబర్ 140/2లో అర ఎకరానికిపైగా నీటిపారుదల శాఖ (నాగార్జునసాగర్ ప్రాజెక్టు కెనాల్)కు చెందిన భూమిని ఆక్రమించి ఎస్ఆర్ గార్డెన్ నిర్మించారని ఆరోపించారు. గతంలో ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్ సర్వే చేసి కబ్జా విషయాన్ని నిర్ధారించారని, దీనిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలకు దిగగా, పొంగులేటి హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు చూపించారు. కంచె చేను మేసినట్టు మంత్రులే ప్రభుత్వ భూములను ఆక్రమించి, పైగా తాను ఆక్రమించినట్టు బట్టకాల్చి మీదేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమించి, కట్టిన నిర్మాణాలను తొలగించాలనుకొంటే ముందుగా పొంగులేటి ఎస్ఆర్ గార్డెన్‌ను కూల్చాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు.

కాంగ్రెస్ దాడి సిగ్గుమాలిన చర్య



ఖమ్మంలో వరద బాధితుల పరామర్శకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ గూండాల దాడి సిగ్గుమాలిన చర్య. బురద రాజకీయం చేయొద్దన్న సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నదేమిటి? ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోదు.. ప్రతిపక్షం ఆదుకునేందుకు ముందుకొస్తే కాంగ్రెస్ కార్యకర్తలతో దాడులు చేయిస్తారా? మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, సబితాఇంద్రారెడ్డి కార్లపై దాడిచేసిన కాంగ్రెస్ కార్యకర్తను అరెస్టు చేయాలి.

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

దాడి పిరికిపందల చర్య

ఖమ్మం జిల్లాలో మంత్రుల బృందంపై ప్రభుత్వం దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న. విపత్కర పరిస్థితిలో ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి రాజకీయం చేయడం తగదు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే దాడులు చేస్తున్నారు. బీఆర్ఎస్‌ని చూసి ఓర్వలేక ఆడలేక మద్దెలవోడు అన్నట్టుగా సర్కారు తీరు ఉన్నది. దాడిచేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి.

-బీఆర్ఎస్ నేత, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

సీఎం కనుసన్నల్లోనే బీఆర్ఎస్‌పై దాడి

- నిందితులను అరెస్టు చేయాలి
- డీజీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఖమ్మంలో వరద బాధితులకు సాయం అందించేందుకు వెళ్లిన ప్రతిపక్ష బృందంపై పోలీసుల అండతోనే కాంగ్రెస్ మూకలు దాడి చేశాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు బుధవారం డీజీపీ కార్యాలయంలో అడిషనల్ డీజీ మహేశ్ భగవత్‌కు మెమోరాండం సమర్పించారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ.. దాడులకు పాల్పడ్డ వారి పేర్లు సహా వివరాలు పోలీసులకు అందజేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని చెప్పారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని కోరామని తెలిపారు.





తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. పక్కన బాల్క సుమన్, గువ్వల బాలరాజు

గురుకులాలను ధ్వంసం చేసే కుట్ర

- రేవంత్ నియంత పోకడతో దళిత పిల్లలే సమిధలు
- 2,000 మంది గెస్ట్ ఫ్యాకల్టీలు రోడ్డుపాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకోవద్దా?
- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం
- రేవంత్ రక్తంలోనే నియంతృత్వ ఆలోచన : బాల్క
- కేసీఆర్ గుర్తులు చెరపలేరు గువ్వల బాలరాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): నాడు కేసీఆర్ హయాంలో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించిన గురుకులాలను నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధ్వంసం చేయాలని కుట్రలు పన్నుతున్నదని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి నియంత పోకడలతో దళిత బిడ్డలే సమిధలు అవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గువ్వల బాలరాజుతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ గురుకులాల్లోని 2,000 మంది గెస్ట్ ఫ్యాకల్టీ ఇతర సిబ్బందిని రాత్రికి రాత్రే ఒక్క జీవోతో ఉద్యోగాల నుంచి తొలగించారని మండిపడ్డారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి ఒక్కరోజు ముందే టీచర్ల జీవితాల్లో సీఎం రేవంత్‌రెడ్డి మట్టిగొట్టి, వారి కుటుంబాలను రోడ్డు పాల్జేశారని విమర్శించారు. నిబంధనలకు లోబడి నియామకాలు జరిగిన వారిని ఎలా తొలగిస్తారని నిలదీశారు. తక్షణమే తొలగించిన ఆ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గతంలో ఇంజినీర్లు, డాక్ట ర్లు, నేవీ ఆఫీసర్లు అయితే.. ఇపుడు మళ్లీ పశువులు కాసే పరిస్థితికి తీసుకొచ్చారని మండిపడ్డారు. వెయ్యి మంది డాక్టర్లను తయారుచేసిన గౌలిదొడ్డి గురుకులంలో ఇప్పుడు ఉపాధ్యాయులు సమ్మె చేసే పరిస్థితిని తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

తిరుపతికి ఆర్థికసాయం చేస్తారా.. లేదా?

అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన హ్యాండ్ బాల్ క్రీడాకారుడు తిరుపతికి రూ.2 లక్షల సాయం అందించని ప్రభుత్వం ఎందుకని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నిలదీశారు. తిరుపతికి ప్రభుత్వం ఆర్థికసాయం చేయకపోతే తానే సాయం చేస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతుల పిల్లలు చదువుకోవద్దా? అని ప్రశ్నించారు. అన్ని వర్గాలవారు మేల్కొని రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కుట్రల నుంచి గురుకులాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ గుర్తులను చెరపాలనే కుట్రలో భాగంగానే గురుకులాల ధ్వంసరచన చేస్తున్నారని, ఏనాటికీ ఆయన గుర్తులను చెరపలేరని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన గురుకులాలను దెబ్బతీస్తే 10 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి అంధకారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి రక్తంలోనే దేశ్‌ముఖ్, రాజరికం, నియంతృత్వ ఆలోచనలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలకు వరంగా మారిన గురుకులాల నిర్వీర్యానికి రేవంత్‌రెడ్డి సర్కారు కుట్రలను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. గురుకులాల పరిరక్షణ బీఆర్‌ఎస్ తరపున ఉద్యమిస్తామని తెలిపారు.

రాత్రికి రాత్రే రోడ్లమీద పడేస్తరా?

- అర్ధాంతరంగా తొలగిస్తే మా బతుకులు ఏంకావాలి?
- ఎస్సీ గురుకుల సొసైటీ ఎదుట పార్ట్‌టైం టీచర్ల ధర్నా
- పట్టించుకోకుండా వెళ్లిన సెక్రటరీ
- టీచర్ల ఆగ్రహం, హెచ్చార్సీకి ఫిర్యాదు
- హరీశ్‌రావును కలిసి గోడు వెళ్లబోసుకున్న సిబ్బంది
- అప్పటికప్పడే సీఎం రేవంత్‌కు లేఖ



హైదరాబాద్‌లో బుధవారం బీఆర్‌ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్ టైం, గెస్ట్ ఫ్యాకల్టీలు, ఇతర సిబ్బంది

హైదరాబాద్, సెప్టెంబర్4 (నమస్తే తెలంగాణ) : 'ఆరేడేండ్లుగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్నం.. ఈ ఏడాది కూడా మా సర్వీసులను కొనసాగిస్తూ జూన్‌లోనే సెక్రటరీ ఉత్తర్వులిచ్చింండ్రు.. అనేక చోట్ల భారీగా ఖాళీలున్నా మమ్మల్ని అర్ధాంతరంగా విద్యా సంవత్సరం మధ్యలో రాత్రికి రాత్రే తొలగించడంలో ఆంతర్యమేమిటి?..వుయ్ వాంట్ జస్టిస్.. మమ్మల్ని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి.. మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి' అంటూ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీల్లోని సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లు, నాన్ సీవోఈలు, ప్రత్యేక, వొకేషనల్ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం సిబ్బంది, గెస్ట్ ఫ్యాకల్టీ, సబ్జెక్ట్ అసోసియేట్లు, ఫిజికల్ డైరెక్టర్లు డిమాండ్ చేశారు. తమను తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సొసైటీ తక్షణం వెనక్కి తీసుకోవాలని నినదించారు. ఎస్సీ గురుకులాల్లోని పార్ట్‌టైం సిబ్బందిని తొలగిస్తూ సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ వారంతా మాసబ్ ట్యాంక్‌లోని డీఎస్‌ఎస్ భవన్‌కు బుధవారం భారీగా తరలివచ్చారు. సొసైటీ గేటు ఎదుట ధర్నాకు దిగారు. తమను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, సెక్రటరీని వెంటనే తొలగించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ తాము రెగ్యులర్ ఉపాధ్యాయలతో సమానంగా పనిచేస్తూ చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. గత సెక్రటరీలతో ఎన్నడూ తమకు ఇబ్బంది రాలేదని, తమ శ్రమను గుర్తించి అభినందించారు తప్ప ఎప్పుడూ చేటు చేయలేదని వివరించారు. ప్రస్తుత సెక్రటరీ వచ్చాకే తమకు కష్టాలు మొదలయ్యాయని, అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ తమను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ ఏడాది కూడా తమ సర్వీసులను కొనసాగిస్తూ జూన్‌లోనే సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి ఉత్తర్వులిచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు మైనార్టీ, ఎంజేపీ, ట్రైబల్ ఇలా ఏ గురుకుల సొసైటీలో లేనివిధంగా కేవలం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలోనే పార్ట్ టైం, గెస్ట్ ఫ్యాకల్టీలను రాత్రికి రాత్రే తొలగించారని ఆవేదన వ్యక్తంచేశారు. రెగ్యులర్ స్టాఫ్ వస్తున్నారని సెక్రటరీ చెబుతున్నా గురుకులాల్లో అనేక చోట్ల భారీగా ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. అయినా తమను అర్ధాంతరంగా, విద్యాసంవత్సరం మధ్యలో రాత్రికి రాత్రే తొలగించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నంటి ఉండి గెలిపించుకున్నందుకు తమకు తగిన శాస్తి జరిగిందని వాపోయారు. సెక్రటరీ నిర్ణయం వల్లే తమ కుటుంబాలు రోడ్డు పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సొసైటీ గేటుకు తాళం

తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, సబ్జెక్ట్ అసోసియేట్లు, ఫిజికల్ డైరెక్టర్లు ఉదయం నుంచి డీఎస్‌ఎస్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్నా సోషల్‌వెల్ఫేర్ సెక్రటరీ వర్షిణి, సొసైటీ ఉన్నతాధికారులెవరూ స్పందించలేదు. అదీగాక పోలీసులకు సమాచారమిచ్చి వారిద్వారా సదరు సిబ్బంది ఎవరూ సొసైటీ కార్యాలయం లోనికి రాకుండా గేటు వద్దే అడ్డగించారు. సొసైటీ గేట్లకు సైతం తాళం వేశారు. అయినా ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో సొసైటీ అధికారులు ఓ ఐదుగురిని లోపలికి పిలిపించుకున్నారు. సెక్రటరీ వచ్చి మాట్లాడతారని చెప్పి దాదాపు అరగంటసేపు వెయిట్ చేయించారు. వారు అక్కడ కూర్చుని ఉన్నా.. భవన్ ఎదుట ధర్నా కొనసాగుతున్నా ఆదేమీ పట్టించుకోకుండా మళ్లీ వస్తానని చెప్పి గురుకుల సొసైటీ సెక్రటరీ వర్షిణి మరో గేటు ద్వారా వెళ్లిపోయారు. దీంతో పార్ట్‌టైం సిబ్బంది మరింత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంత నిర్లక్ష్యమా? అంటూ నిప్పులు చెరిగారు. అక్కడి నుంచి నేరుగా మానవ హక్కుల కమిషన్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఒక్క డీఎస్‌ఎస్ భవన్ వద్దే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఆయా జోనల్ ఆఫీసర్ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపారు.

సిబ్బందిని కొనసాగించాలి: కొప్పుల

కరీంనగర్ కార్పొరేషన్: గురుకుల పాఠశాలల గెస్ట్, పార్ట్ టైం ఉద్యోగులను కొనసాగించాల్సిందేనని, వారిని తీసేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం ఓ ప్రకటన హెచ్చరించారు. ఓవైపు సరైన వసతులు కరువై గురుకులాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే, విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నపలంగా టీచర్లను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాతవారిని తొలగించి, కొత్తవారి వద్ద రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ఉన్నతాధికారులు అభ్యర్థుల నుంచి డబ్బు వసూలు చేసి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ చేశారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయాలతో దాదాపు 2లక్షల మంది ఎస్సీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని విచారం వ్యక్తం చేశారు.

గద్వాలలో నిరసన

గద్వాల: తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట గురుకులాల పార్ట్ టైం టీచర్లు, గెస్ట్ ఫ్యాకల్టీ, పీఈటీలు బుధవారం ఆందోళన చేపట్టారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న తమను అకస్మాత్తుగా తొలగించడంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నెలల జీతాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు.

తొలగింపు అప్రజాస్వామికం : ఏఐవైఎఫ్

హైదరాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో పనిచేస్తున్న 6 వేల మంది పార్ట్ టైమ్ టీచర్లను, 33 సీఓఈల్లో పనిచేస్తున్న 216 సబ్జెక్ట్ అసోసియేట్ టీచర్లను తొలగించడం దారుణమని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మండిపడ్డారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వారినే విధుల్లోకి తీసుకుంటాం..

'నమస్తే' కథనంతో సెక్రటరీ ప్రకటన ● తాత్కాలికంగా పక్కన పెట్టామని వివరణ

హైదరాబాద్: తొలగించిన ఉద్యోగులనే మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి ప్రకటించారు. సొసైటీ ఉత్తర్వులపై 'గురుకుల గెస్ట్ లెక్చరర్లు వెయ్యిమందిపై వేటు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో బుధవారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల గురుకుల సొసైటీ కొత్తగా రెగ్యులర్ ఉద్యోగుల నియామకాలను చేపట్టిందని, బదిలీలు కూడా నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో పార్ట్‌టైం, గౌరవవేతనంపై పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ సిబ్బందిని తాత్కాలికంగా తొలగించామని వెల్లడించారు. గురుకులాల్లో మిగిలిన ఖాళీల వివరాలను ప్రిన్సిపాళ్ల నుంచి తెప్పించుకొని, అవసరాల మేరకు తిరిగి నాన్ రెగ్యులర్ ఉద్యోగులను నియమించేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. అంతేగాని పూర్తిగా తొలగిస్తున్నట్టు ఆదేశాలివ్వలేదని స్పష్టం చేశారు.

మీరిచ్చే కానుక ఇదేనా రేవంత్?

- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్: ఎస్సీ గురుకుల సొసైటీలో ఉద్యోగుల తొలగింపు అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఉద్యోగాలు కోల్పోయిన పలువురు హరీశ్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకోగా ఆయన వెంటనే స్పందించారు. సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో పనిచేస్తున్న 6,200 మంది పార్ట్ టైమ్ టీచర్లు, పార్ట్ టైం లెక్చరర్లు, డీఈవోలను ఏకకాలంలో విధుల నుంచి తొలగించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సెప్టెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం టీచర్లకు అదనపు ప్రోత్సాహకాలు అందిచడం ఆనవాయితీ అని, కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యాబుద్ధులు నేర్పే గురువులను అర్ధాంతరంగా తొలగించి వారికి, వారి కుటుంబాలకు అంతులేని క్షోభను కలిగించిందని నిప్పులు చెరిగారు. 3నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, అడిగిన పాపానికి ఏకంగా వారిని ఉద్యోగాల నుంచే తొలగించడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. ఐఐటీ, ఎన్ఐటీ కోచింగ్‌ను పునరుద్ధరించాలని, తొలగించిన పార్ట్ టైమ్ లెక్చరర్లు, టీచర్లందరినీ విధుల్లోకి తీసుకోవాలని, మూడు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

సొసైటీలో జరుగుతున్నదేమిటి?

- 3 నెలలుగా అర్థం కాని పరిస్థితి!
- ప్రభుత్వ విధానమా? సొంత నిర్ణయమా?
- ఓ వైపు విద్యార్థులకు అసౌకర్యాలు
- మరోవైపు ఆందోళనలో గురువులు
- నిర్ణయాల్లో ఓ ఉన్నతాధికారి కీరోల్
- ఇటీవల డిప్యూటీ సీఎం చీవాట్లు



మాసబ్ ట్యాంక్‌లోని ఎస్సీ గురుకుల సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న పార్ట్‌టైం టీచర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మైనార్టీ, బీసీ, ఎస్టీ, ఎస్సీ, జనరల్ కలుపుకొని మొత్తం 1022 పైగా గురుకులాలున్నా ఒక్క ఎస్సీ సొసైటీలోనే అనేక వివాదాలు చెలరేగుతున్నాయి. 3నెలలుగా తారాస్థాయికి చేరాయి. ఇటీవల పుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలు రాష్ట్రమంతటా ఆందోళన కలిగించగా, తాజాగా ఎస్సీ గురుకుల సొసైటీలోని ఉద్యోగులు వివిధ అంశాలపై రోడ్డెక్కడం చర్చనీయాంశమైంది. ఈ సొసైటీపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నా సర్కారు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. వివాదాలకు దారితీస్తున్న నిర్ణయాలన్నీ ప్రభుత్వానివేనా? లేక సొసైటీ సెక్రటరీ, ఉన్నతాధికారుల సొంత విధానాలా? అని ఉద్యోగ, ఉపాధ్యాయ యూనియన్లు చర్చించుకుంటున్నాయి.

వరుసగా వివాదాలు

- ఎస్సీ సొసైటీ పరిధిలో ఇటీవల వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు నమోదయ్యాయి. సమస్యలకు తాళలేక విద్యార్థులే రోడ్డెక్కుతున్న దుస్థితి నెలకొన్నది.
- అన్నిశాఖలు చేపట్టిన మాదిరిగానే గురుకుల సొసైటీలోనూ ఇటీవల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహించారు. కానీ ఏ సొసైటీలో లేనివిధంగా ఎస్సీ గురుకుల సొసైటీలోనే ఈ అంశం తీవ్ర వివాదాస్పదమైంది. జీవో 80 ప్రకారం వెబ్ కౌన్సిలింగ్ ద్వారా కాకుండా ఎస్సీ గురుకుల సొసైటీలో మాన్యువల్‌గా ప్రక్రియ నిర్వహించడమే అందుకు కారణమని తెలుస్తున్నది. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా ఎలా నిర్వహించారని అడిగితే సొసైటీ వద్ద సమాధానం లేదు. అదేమంటే అసోసియేషన్ల సూచనతో చేశామని సొసైటీ ఉన్నతాధికారులు బదులిచ్చి చేతులు దులుపుకొన్నారు. బదిలీలు, ప్రమోషన్లలో అవకతవకలు జరిగాయని ఆరోపణలున్నాయి.
- రాత్రికే రాత్రే ఎస్సీ సొసైటీలోని 317 జీవో బాధిత ఉద్యోగులు, మెరిట్ ఆధారంగా డిస్ లొకేట్ అయినవారిని ఎలాంటి పోస్టింగ్ లేకుండా రిలీవ్ చేశారు. వారంతా ఆందోళనకు దిగారు. ధర్నాకు దిగిన ఓ టీచర్‌ను సస్పెండ్ చేయడంతోపాటు, 144 మంది టీచర్లకు వార్నింగ్ లెటర్లును జారీ చేసి మరో వివాదానికి అధికారులు తెరలేపారు. బాధిత టీచర్లందరూ ప్రజాభవన్, ఆపై సీఎంవో అధికారుల వరకూ వెళ్లారు. ఆ తర్వాత సొసైటీ అధికారులు ఎక్కడి వారిని అక్కడే కొనసాగిస్తామంటూ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.
- ప్రమోషన్లు, బదిలీలు కొనసాగుతున్న క్రమంలోనే సెలవుల మంజూరు నిబంధనలన్నింటినీ సొసైటీ అధికారులు మార్చారు. ఆర్సీవోలు, జోనల్ ఆఫీసర్లకు, ఆపై జాయింట్ సెక్రటరీలకు మొత్తం అధికారాలను కట్టబెట్టారు. దీంతో గురుకుల ప్రిన్సిపాళ్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతున్నది. ఇదో వివాదాన్ని రేపింది.
- తాజాగా ఎస్సీ గురుకులాల్లోని నాన్ రెగ్యులర్ సిబ్బందిని తొలగించడం మరోవివాదానికి దారి తీసింది.
- ఇక సొసైటీ ఉన్నతాధికారులు ఏ ఆదేశాలు జారీ చేసినా అర్ధరాత్రే అమలు చేస్తున్నారు. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించినవే కాకుండా ఆఖరికి పత్రికల్లో వచ్చిన కథనాలపై వివరణాలను సైతం అర్ధరాత్రే ఇవ్వడం గమనార్హం.

సొసైటీలో పవర్ సెంటర్లు..

వరుస వివాదాలకు సొసైటీ ప్రధాన కార్యాలయంలో పవర్ సెంటర్లుగా మారిన కొందరు ఉన్నతాధికారులే కారణమని ఉద్యోగులు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రధానంగా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ ఉన్నతాధికారిపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా వచ్చిన సెక్రటరీని పూర్తిగా తప్పుదోవపట్టిస్తూ తప్పుడు నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారని సిబ్బంది వివరిస్తున్నారు. కావాల్సినవారికి ప్రధాన కార్యాలయంలోనే డిప్యూటేషన్లు ఇప్పించుకుని వారితో వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నారని, ప్రశ్నిస్తే కక్షసాధింపులకు దిగుతున్నారని ఉద్యోగులు వెల్లడిస్తున్నారు. ఇటీవల సదరు ఉన్నతాధికారి అతిపై డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు, వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించినట్టు సమాచారం.

సర్కారు మొద్దునిద్ర

సొసైటీలో వరుస వివాదాలు తలెత్తుతున్నా సర్కారు మొద్దు నిద్ర వీడడం లేదు. జీవోలకు వ్యతిరేకంగా సొసైటీ ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నా సర్కార్ స్పందించకపోవడంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెదవివిరుస్తున్నారు. సొసైటీ ఉన్నతాధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

టీవీవీపీలో ఉద్యోగుల కొనసాగింపు

- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట
- 2,600 మందిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనానికి స్పందన

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ)లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 'పనిచేస్తున్నాం.. వేతనం ఇస్తారా?' అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఆగస్టు 31న ప్రచురితమైన ప్రత్యేక కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. 2,600 మంది ఉద్యోగులను ఈ ఆర్థిక సంవత్సరం కొనసాగిస్తూ బుధవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. వీరిలో 945 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో, 1,562 మంది ఔట్ సోర్సింగ్, 93 మంది ఎంటీఎస్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే ఉద్యోగుల కొనసాగింపు ఉత్తర్వులు రావాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ పేరిట మూడు నెలల కొనసాగింపుతో జారీ అయిన ఉత్తర్వులు జూన్‌తోనే ముగిశాయి. జూలై, ఆగస్టు నెలల్లో ఉత్తర్వులు లేకున్నా పనిచేయాల్సి వచ్చింది. దీంతో చేసిన పనికి వేతనం వస్తుందో.. లేదో? అని ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారు. వారి వేదనను వివరిస్తూ 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించి కొనసాగింపు ఉత్తర్వులను జారీ చేసింది. దీనిపై తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ హర్షం వ్యక్తంచేసింది.

117 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందజేసే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఈ ఏడాది 117 మందిని వరించాయి. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం వేర్వేరు జీవోలు విడుదల చేశారు. ఉన్నత విద్యలో అత్యధికంగా 55 మంది అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎంపికయ్యారు. పాఠశాల విద్యలో 47, ఇంటర్ విద్యలో 11 మంది, సాంకేతిక విద్యలో నలుగురిని అవార్డులు వరించాయి. రూ.10వేల నగదు, సర్టిఫికెట్, మెడల్‌ను అందజేయడంతోపాటు రవీంద్ర భారతిలో గురువారం వీరిని సన్మానిస్తారు. విద్యాశాఖ మంత్రి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరుకానున్నారు. మోడల్ స్కూల్ టీచర్లు, డైట్ కాలే జీ లెక్చరర్లు, కేజీబీవీ టీచర్లను పరిగణనలోకి తీసుకోకపోవడంపై గెజిటెడ్ హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. అవార్డుల కోసం పైరవీలు సాగినట్టు ప్రచారం జరిగింది. ఆ తర్వాత మరో ఆరుగురితో ఇంకో జాబితా విడుదలైం ది. పెద్ద ఎత్తున ఒత్తిడి వల్లే మరో ఆరుగురికి చోటు కల్పించినట్టు సమాచారం.

పీఈటీల తుది ఫలితాలు ఎప్పుడో!

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న గురుకుల పీఈటీ ఫలితాలు విడుదల చేశారు.. కానీ రీలింక్విష్‌మెంట్ ఆప్షన్ ఇచ్చి.. ఆ తర్వాత తుది ఫలితాలు విడుదల చేయడం లేదని టీజీపీఎస్సీ అధికారులపై బాధిత అభ్యర్థులు మండిపడుతున్నారు. పీఈటీ పోస్టుల కోసం ఇప్పటికే ఎనిమిదేండ్ల నుంచి ఎదురు చూస్తున్నామని, ఇంకెన్నేండ్లు చూడాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రీలింక్విష్‌మెంట్ ఆప్షన్ ఇచ్చిన తర్వాత పోస్టులకు ఎంతమంది ముందుకు వచ్చారు? ఎన్ని పోస్టులు ఉన్నాయనే విషయంలో స్పష్టత ఇవ్వాలని, దీంతో పోస్టింగ్‌లో మార్పులకు అవకాశం ఉంటుందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. న్యాయం కోసం టీజీపీఎస్సీ ఎదుట రేపు(6న) ధర్నా చేస్తామని తెలిపారు.

రేవంత్‌రెడ్డి ఇలాకాలో బడుగులపై దాష్టీకం

- ఇంటి స్థలం కబ్జాకు యత్నం
- అడ్డొచ్చిన యువకుడిపై దాడి
- తీవ్రంగా గాయపడి ప్రైవేట్ దవాఖానలో చికిత్స
- బాధితుడు ఆర్మీ జవాన్: యాదవ సంఘం నేత రాములుయాదవ్



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న యాదవసంఘం నేత రాములుయాదవ్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 4: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో బీసీ వర్గాలపై అగ్రవర్ణాలకు చెందిన దుండగులు దాష్టీకానికి ఒడిగట్టారు. ఆరుగాలం కష్టపడి స్థలం కొనుక్కొని 20 ఏండ్ల క్రితం ఇల్లు కట్టుకొని జీవిస్తున్న ఓ కుటుంబంపై దాడి చేసి బలవంతంగా కబ్జా చేసేందుకు యత్నించారు. అడ్డొచ్చిన కుటుంబ సభ్యులపై తీవ్రంగా దాడులు చేసి గాయపర్చారు. వారి దాడిలో గాయపడిన ఇంటి యజమాని కొడుకు ప్రాణాపాయ స్థితిలో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఘటన వివరాలను యాదవ హక్కుల పోరాట సమితీ జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ హైదరాబాద్‌లో వెల్లడించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన బాధితులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కొడంగల్‌లోని మద్దూరు మండలం చింతల్‌దిన్నె గ్రామంలో మండి భీమప్పయాదవ్ 20 ఏండ్ల క్రితం 999 గజాల స్థలం కొనుగోలు చేశాడని తెలిపారు. అందులో చిన్న ఇల్లు కట్టుకొని భార్య, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడని చెప్పారు. గ్రామానికి చెందిన పల్లె చిన్న అనివిరెడ్డి, పల్లె వెంకట్‌రెడ్డి, పల్లె బుగ్గారెడ్డి, పల్లె రాజశేఖర్‌రెడ్డి, పల్లె రాజిరెడ్డి, పల్లె విష్ణువర్ధన్‌రెడ్డి ఆ భూమిపై కన్నేసి ఆక్రమించుకోవాలన్న కుట్రజేశారని చెప్పారు. గత నెల 25న ఆ ఇంటిపై దాడి చేసి భీమప్ప భార్య, ఆర్మీ జవాన్‌గా పనిచేస్తూ సెలవుల్లో వచ్చిన కొడుకు మండి శ్రీనివాస్‌యాదవ్‌పై దాడిచేశారని వివరించారు. వారి దాడిలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. దాడికి పాల్పడిన వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉన్నదని, ముఖ్యమంత్రి నియోజకవర్గంలో బడుగులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మీ జవాన్‌పై దాడిచేయడం సిగ్గుచేటని, తక్షణమే నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో యాదవ సంఘాలన్నింటినీ ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు.



చికిత్స పొందుతున్న శ్రీనివాస్ యాదవ్

ప్రాణహాని ఉంది: బసమ్మ



ప్రభుత్వ రికార్డుల్లోనూ తమ పేరిటే స్థలం ఉన్నదని, ఆస్థి పన్నుతోపాటు విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నామని మండి భీమప్పయాదవ్ భార్య, బాధితురాలైన బసమ్మ తెలిపారు. ఈ నెల 25న తమపై దాడి చేసిన వెంటనే మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారితో ప్రాణహాని ఉన్నదని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు.

'కడా' పరిహారంలో ఎందుకీ తేడా?

- కొడంగల్ భూ బాధితులకు తీరని అన్యాయం
- పరిహారం ఎకరాకు 10 లక్షలు.. ఇచ్చింది కేవలం 6 లక్షలే
- పంపిణీలో గందరగోళం.. ఆందోళనలో అన్నదాతలు



కొడంగల్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతులు, నాయకులు

కొడంగల్, సెప్టెంబర్ 04: ఎకరాకు ఇంటి స్థలం సహా రూ.10 లక్షలు ఇస్తామన్నరు.. తీరా రూ.6 లక్షలే ఇచ్చారు. రెండెకరాలుంటే రూ.15 లక్షలే ఇచ్చారు.. అని సీఎం ఇలాకాలోని బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని కడా (కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంలో అప్పాయిపల్లిలోని సర్వే నం 19కి సంబంధించిన రైతులకు ఎకరానికి రూ.10 లక్షలతోపాటు ఇంటి స్థలం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ కూడా పాల్గొన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లింపుల్లో గందరగోళం నెలకొన్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కాకుండా అరకొరగా పంపిణీ చేసినట్టు రైతులతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. సీఎం ఇలాకాలోనే ఇలా చేయడం అధికారుల నిర్లక్ష్యమా, పాలకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 నుంచి 25 మంది రైతులకు ఎకరాకు రూ.10 చొప్పున లక్షలు రావాల్సి ఉండగా రూ.6 లక్షలు, రూ.20 లక్షలు రావాల్సిన వారికి రూ.15 లక్షల చొప్పున అందించారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్ అభివృద్ధిని ఆశించి రైతులు సాగు భూమిని ప్రభుత్వానికి అప్పగించామని, తమకు తక్కువ పరిహారం ఎలా ఇస్తారని రైతులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, వెంకటయ్య, చంద్రయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారంరోజుల్లో విచారణ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు ఫకీరప్ప, మోతీబాయి, పుష్పమ్మ, పల్లేశ్, రాములుగౌడ్, యశోద, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.